బహిర్గతం కాని రంగులు
రూ॥140/-
పేజీలు:140

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM

## కటకటాల్లోకి కీచక ఎస్ఐ

మహిళా కానిస్టేబుల్‌పై
ఎస్సై లైంగిక దాడి
సర్వీస్ రివాల్వార్‌తో
బెదిరించి అత్యాచారం
ఎస్ఐ అరెస్టు 14 రోజులు
రిమాండ్



3లో

సంపుటి 27, సంచిక: 06 | గురువారం | 20-06-2024 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | ఖమ్మం : 8+8 | కరీంనగర్ : 8+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00



## రేపు మంత్రివర్గ సమావేశం

### రైతుల పంట రుణమాఫీ, రైతుభరోసా విధివిధానాలపై చర్చ!



ప్రజాపక్షం / హైదరాబాద్

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముఖ్యమంత్రి సిఎం ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షత ఈనెల 21వ తేదీ సాయం త్రం 4 గంటలకు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో జరగనుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం నోట్ జారీ చేశారు. ఈ కేబినెట్ భేటీలో ప్రధానంగా రైతుల పంట రుణమాఫీ, రైతుభరోసా విధివిధానాలపై చర్చించే అవకాశం ఉంది. పంటల బీమా అర్హతలు, కాళేశ్వరం ప్రాజెక్టు కుంగుబాటు, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం, రాష్ట్ర బడ్జెట్, అసెంబ్లీ సపమావేశాల తేదీల ఖరారు, ఖజానాకు ఆదాయ మార్గాల అన్వేషణ, భూముల మార్కెట్ విలువపై సమీక్ష, కొత్త విద్యుత్ విధానం తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు సమాచారం.

## వరి మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 117 పెంపు

**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం వరి కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)ని పెంచింది. 2024–25 ఖరీఫ్ సీజన్‌లో వరి ధాన్యం ధర క్వింటాల్‌కు 117 రూపాయలు (5.35 శాతం) పెంచింది. దీనితో క్వింటాల్ ధర 2,300 రూపాయలకు చేరుతుంది. నిజానికి కేంద్ర ప్రభుత్వం వద్ద ఇప్పటికే సరిపడా ధాన్యం స్టాకు ఉంది. అయితే, హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్, ఢిల్లీ రాష్ట్రాల్లో



అసెంబ్లీ ఎన్నికలు రానున్న నేపథ్యంలో, మద్దతు ధరను పెంచిందని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. కాగా, ఈ పెంపు విషయాన్ని కేంద్ర సమాచార, ప్రచార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం తెలిపారు. మంత్రివర్గ సమావేశం అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ, సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వివరించారు. వ్యవసాయ తరువాయి 2లో

# కష్టాల్లో ఢిల్లీ

- ఒకవైపు నీటి సంక్షోభం, మరోవైపు భానుడి భగభగలు
- అధిక ఉష్ణోగ్రతలు తట్టుకోలేక అల్లాడుతున్న రాజధాని వాసులు
- 72 గంటల్లో 15 మంది మృతి
- వెంటిలేటర్‌పై మరో 12 మంది
- మృతుల్లో కార్మికులే అధికం
- తగు జాగ్రత్తలు తీసుకోవాలన్న వైద్యులు



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో ఎండలు మండుతున్నాయి. ఉదయం 6 గంటల నుంచే ఎండ మండిపోతుండటంతో గడప దాటేందుకు జనం హడలెత్తిపోతున్నారు. దేశ వ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు చురుగ్గా సాగుతుంటే దేశ రాజధానిలో భానుడు భగభగలు కొనసాగుతున్నాయి. ఇలాంటి ఎండలు ఎప్పుడు చూడలేదని ఢిల్లీ ప్రజలు అంటున్నారు. ఉత్తర భారతంలో రాగల 24 గంటల పాటు వడగాడ్పులు కొనసాగుతాయని, ఆ తర్వాత ఉష్ణోగ్రతలు కాస్త తగ్గుతాయని వాతావరణ కేంద్రం పేర్కొంది. ఒక వైపు నీటి ఎద్దడి మరోవైపు తారెత్తిస్తున్న ఎండలతో ప్రజలు తీవ్రస్థాయిలో ఇబ్బంది పడుతున్నారు. మండుటెండలు, ఉక్కపోత, వడగాడ్పులతో హడలెత్తిపోతున్నారు. దాదాపు 40–45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో జనం పిట్టల్లా రాలిపోతున్నారు. గడిచిన 72గంటల్లో వడదెబ్బతో ఢిల్లీ, ఎన్సీఆర్ పరిధిలో 15మంది మతి మరణించారు. వీరిలో ఐదుగురు ఆర్ఎంఎల్, సఫ్దార్ జంగ్, ఎల్ఎన్‌జెపి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ చనిపోయారు. గత 24 గంటల్లో 10మంది నోయిడాలో మరణించారు. ఐదుగురు చనిపోగా, మరో 12 మంది పరిస్థితి విషమంగా ఉందని ఢిల్లీలోని రామ్ మనోహర్ లోహియా (ఆర్ఎంఎల్) మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అజయ్ శుక్లా బుధవారం తెలిపారు. బాధితుల్లో అత్యధికులు కార్మికులు ఉన్నట్లు చెప్పారు. ఎండ దెబ్బకు గురై సమయానికి ఆసుపత్రులకు చేరుకోలేక కార్మికులు మృత్యువాత పడుతున్నట్లు తెలిపారు. వడ దెబ్బ తగిలిన 36మందిలో 12 మంది వెంటిలేటర్‌పై ఉన్నట్లు వెల్లడించారు. రోగుల్లో 22 మంది కార్మికులేనన్నారు. వీరు గత రెండు రోజుల్లో ఆసుపత్రిలో చేరారని చెప్పారు. తీవ్రమైన వాతావరణ పరిస్థితుల్లో పనిచేయడంతో కార్మికులు అనారోగ్యానికి గురైనట్లు వెల్లడించారు. వడ దెబ్బ తగిలిన తర్వాత ఆసుపత్రికి రావడంలో చేసే ఆలస్యం ప్రాణాంతకంగా పరిణమిస్తున్నదన్నారు. ప్రస్తుతం మరణాల రేటు 60–70శాతం మేర ఉన్నట్లు డాక్టర్ శుక్లా చెప్పారు. మే 27 నుంచి ఎండ దెబ్బ తగిలిన తరువాయి 2లో

## అభివృద్ధి చెందుతున్న దేశాలతో

# తెలంగాణ పోటీ



- త్వరలో రాష్ట్రంలో అందుబాటులోకి కొత్త విద్యుత్ విధానం
- బ్యాంకర్లకు సామాజిక, మనవీయ కోణంతో ఉండాలి
- పెట్టుబడులకు హైదరాబాద్ స్వర్గధామం : ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/హైదారబాద్

వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడనుందని ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బ్యాంకర్లకు సామాజిక, మానవీయ కోణంతో ఉండాలని, సానుకూల దృక్పథం లేకపోతే ఏ రాష్ట్రం,సమాజం అభివృద్ధి చెందబోదన్నారు. వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభు త్వం తొలి ప్రాధాన్యతనిస్తోందన్నారు. రాబో యే కొద్ది రోజుల్లో రాష్ట్రంలో కొత్త విద్యుత్ పాలసీని అందుబాటులోకి తీసుకురానున్నామని వెల్లడించారు. హైదరాబాద్‌లో "41వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల" సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా 2024–25వ వార్షిక రుణ ప్రణాళికను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుతో కలిసి భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఈ ఆర్థిక సంవత్సర వ్యవసాయానికి రూ. 6,33,777.48 కోట్లు, వ్యవసాయ పంట రుణాలు రూ.5,197.31 కోట్లు, వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.19,239.87 కోట్ల రుణాలు ఇవ్వాలని ఎస్ఎల్‌బిసి ప్రతిపాదించింది. ఈ సమావేశంలో రూ. 2 లక్షల రుణమాఫీ అంశంపై కీలక చర్చ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, నాబార్డ్ సిజిఎం చింతల సుశీల గోవింద రాజులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ పెట్టుబడులకు స్వర్గధామం హైదరాబాద్ అని, రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంతో తెలంగాణ రూపురేఖలు మారిపోతున్నాయన్నారు. రుణాలు తరువాయి 2లో

## 'అప్పులు చేస్తాం సంపద సృష్టిస్తాం..'

### కుల గణన ఆలోచన విప్లవాత్మకమైనది

ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డిఎ ప్రభుత్వం కుల గణన చేపట్టాలని, తద్వారా సంపద, వనరులు పంపిణీ చేయాలని, ఆ మేరకు వారిని పాలనలో భాగస్వామ్యం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. "అప్పులు చేస్తాం సంపద సృష్టిస్తాం.. ఆ సంపదను సంక్షేమ పథకాల రూపంలో రాష్ట్ర ప్రజలకు పంచుతాం" అని డిప్యూటీ సిఎం చెప్పారు. రానున్న ఐదేళ్లలో స్వయం సహాయక సంఘాలకు లక్ష కోట్ల వడ్డీ లేని తరువాయి 2లో



## డిసెంబరులోపే హైదరాబాద్ – విజయవాడ

# హైవే విస్తరణ పనులు

### ఆర్ఆర్ఆర్‌ను నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదు : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 65) విస్తరణ పనులు డిసెంబరు లోపు పూర్తయ్యేలా చూస్తామని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. యుటిలిటి ఛార్జీలను భరించేందుకు బిఆర్ఎస్ ప్రభుత్వం ఇష్టపడలేదని, అందుకే ఆ ప్రాజెక్టు కొంతకాలం ఆగిందని, తాము యుటిలిటి ఛార్జీలు భరిస్తామని చెప్పడంతో మళ్లీ కదలిక వచ్చిందని తెలిపారు. రహదారుల పనులపైన హైదరాబాద్‌లోని సచివాలయంలో బుధవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి కీలకమైన ప్రాజెక్టులు కాంగ్రెస్ హయాంలోనే వచ్చాయని, ఔటర్ రింగ్ రోడ్, శంషా బాద్ విమానాశ్రయంతో హైదరాబాద్ రూపురేఖలు మారిపోయాయని, నల్లగొండ బైపాస్ రోడ్డు అంశాన్ని కేంద్రమంత్రి గడ్కరీతో చర్చించామని తెలిపారు. ఆర్ఆర్ఆర్‌ను కెసిఆర్ ప్రభుత్వం పట్టించుకోలేదని కేంద్ర మంత్రి చెప్పారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్)పైన కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. నాగ్‌పూర్‌మంచిర్యాల హైవే నిర్మాణంపై కూడా కేంద్రంతో చర్చించామని, విజయవాడ హైదరాబాద్ హైవేను డెత్ రోడ్డు అని కేంద్ర మంత్రి గడ్కరీ చెప్పినట్టు వివరించారు. ఎన్‌హెచ్ 65పైన 17 బ్లాక్ స్పాట్లను గుర్తించి,వాటికి మరమ్మతులు చేపట్టామన్నారు. విజయవాడహైదరాబాద్ హైవేను ఆరు లేన్లుగా మార్చే ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తామని మంత్రి వివరించారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులు నత్తనడకన సాగడంపై మంత్రి ఆరా తీశారు. కాంట్రాక్టర్ వల్లనే ఈ పరిస్థితి తరువాయి 2లో

## త్వరలో జర్నలిస్టులకు

# ఇండ్ల స్థలాలు



- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- టియుడబ్ల్యూజె రాష్ట్ర మహాసభలను ప్రారంభించిన మంత్రి
- జర్నలిస్టులు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలి
- మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి





ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్

జర్నలిస్టులకు త్వరలోనే ఇండ్ల స్థలాలు ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం ఖమ్మం నగరంలోని ఉషా హరి కన్వెన్షన్ హాల్ (కామ్రేడ్ అమర్ నాథ్ ప్రాంగణం)లో ఏర్పాటు చేసిన టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర మూడవ మహాసభలకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర అధ్యక్షులు నగునూరి శేఖర్ అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కేటాయింపు సమస్యను త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. తాను ఈ సభలకు వచ్చే ముందే ముఖ్యమంత్రితో చర్చించి వచ్చినట్లు ఆయన తెలిపారు. గత పదేళ్లుగా జర్నలిస్టులు భావ ప్రకటన చేయడానికి కూడా ఎంత ఇబ్బంది పడ్డారో అందరికీ తెలుసునని ఆయన తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వం జర్నలిస్టుల డిమాండ్లను నూరుశాతం పరిష్కారం చేస్తుందని ఆయన తెలిపారు. ప్రధానంగా జర్నలిస్టుల ఇండ్ల స్థలాలకు సంబంధించి కొన్ని చోట్ల మంజూరైనప్పటికీ కోర్టులో తరువాయి 8లో

## సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం

### ఎంఇఎ ఉదాసీన వైఖరిపై విజయన్ ఆగ్రహం

**తిరువనంతపురం:** కేంద్ర ప్రభుత్వం సమాఖ్య స్ఫూర్తికి పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తోందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్రంగా విమర్శించారు. ఇలాంటి పరిస్థితులు భవిష్యత్‌లో జరగకుండా చర్యలు తీసుకోవాలని హితవు పలికారు. ఈ మేరకు ప్రధాని మోదీకి విజయన్ బుధవారం లేఖ రాశారు. కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) ఉదాసీన వైఖరిని విజయన్ తీవ్రంగా ఖండించారు. జూన్ 12న మంగాఫ్‌లోని లేబర్ భవనంలో జరిగిన అగ్ని ప్రమాదంలో 40 మందికి పైగా ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 28, 2023 నాటి కేబినెట్ సెక్రటేరియట్ ఆఫీస్ మెమోరాండం ప్రకారం తాను రాజకీయ అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నానని పేర్కొన్నారు. కేరళ కేబినెట్ సమిష్టి నిర్ణయం విస్మరించబడిందని ముఖ్యమంత్రి ప్రధానికి వివరించారు. ఈ దరఖాస్తును పరిగణనలోకి తీసుకోవడంలో వైఫల్యం తరువాయి 8లో





## గుడిసె వాసులకు న్యాయం చేయండి

### సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నేతృత్వంలోని ప్రతినిధి బృందం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలం పరిధిలోని రావి నారాయణరెడ్డి కాలనీలో సిపిఐ ఆధ్వర్యంలో భూదాన భూమిలో 8వేల గుడిసెలు వేసుకున్న వారికి న్యాయం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సిపిఐ నాయకులు తరువాయి 2లో

# వైద్య రంగం ప్రక్షాళన

- సమర్థులైన వైద్యులను అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- నాణ్యమైన వైద్య విద్యను అందించేందుకు చర్యలు
- మెరుగైన బోధనకు నిరంతర పర్యవేక్షణ మంత్రి దామోదర రాజనర్సింహ్మా

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్రంలో నాణ్యమైన వైద్యులను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వైద్య ఆరోగ్య ,కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. వైద్య రంగ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టామని, రాష్ట్రంలో వైద్య విద్యకు పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు.ప్రైవేట్ వైద్య విద్య కళాశాలలు విద్యార్థుల నుంచి అదనపు ఫీజులను వసూలు చేయరాదని సూచించారు. రాష్ట్రంలో ప్రజా ఆరోగ్య భద్రతకు పెద్దపీట వేస్తున్నామన్నారు. రాష్ట్రంలోని ప్రైవేట్ వైద్య విద్య కళాశాలల యాజమాన్యాలు, డీన్‌లు, ప్రిన్సిపాల్‌లతో మంత్రి దామోదర రాజనర్సింహ హైదరాబాద్‌లోని సచివాలయంలో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్త్ ఎడ్యుకేషన్‌కు తెలంగాణ బెస్ట్ డెస్టినేషన్ గా గుర్తింపు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు వైద్య విద్య కళాశాల ల తో పాటు తరువాయి 2లో

## బస్‌స్టేషన్‌లో జన్మించిన చిన్నారికి

# జీవితకాలం ఉచిత బస్‌పాస్

- ప్రకటించిన టిజిఎస్ఆర్‌టిసి యాజమాన్యం
- డెలివరీ చేసి మానవత్వం చాటిన సిబ్బందికి ఘన సన్మానం

ప్రజాపక్షం/హైదరాబాద్



కరీంనగర్ బస్ స్టేషన్ లో పుట్టిన చిన్నారికి తమ బస్సుల్లో జీవిత కాలం ఉచితంగా ప్రయాణించేలా బస్ పాస్ ను అందిస్తున్నట్లు తరువాయి 2లో

# యుజిసి నెట్ పరీక్ష రద్దు

న్యూఢిల్లీ : నీట్ సహా పలు పరీక్షల్లో అవకతవకలు జరిగాయంటూ ఆరోపణలు వస్తోన్న వేళ ఎన్‌టిఎ కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 18న నిర్వహించిన యుజిసి నెట్ 2024 పరీక్ష రద్దు చేసినట్లు ప్రకటించింది. ఈ పరీక్షను మళ్లీ నిర్వహించాలని నిర్ణయించింది. నెట్ పరీక్షలో అవకతవకలు జరిగినట్టు గుర్తించిన యుజిసి ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా 1,205 సెంటర్లలో జరిగిన ఈ పరీక్షకు దాదాపు 9లక్షల మందికిపైగా అభ్యర్థులు హాజరయ్యారు. పారదర్శకతను కాపాడుకోవటం కోసమే తరువాయి 8లో

# వలసదారులకు యుఎస్ తీపికబురు




**వాషింగ్టన్:** అమెరికా పౌరసత్వం కోరుకుంటున్న లక్షలాది మంది వలసదారులకు తీపి కబురు అందింది. ఈ ఏడాది ఐదు లక్షల మందికి పౌరసత్వం కల్పించాలని నిర్ణయించినట్టు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ చేసిన ప్రకటన వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నది. దేశంలో చట్టపరమైన హోదా లేని యుఎస్ పౌరుల జీవిత భాగస్వాములు శాశ్వత నివాసం, పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవడానికి అనుమతిస్తున్నట్టు అమెరికా ప్రభుత్వం ప్రకటించింది. అమెరికా అధ్యక్ష పదవికి ఈ ఏడాది నవంబర్ 5న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, వలసవాదులను ఆకట్టుకోవడానికే బైడెన్ ఈ నిర్ణయం తీసుకున్నారన్నది నిజం. కాగా, ఈ ఏడాది జూన్ 17వ తేదీ నాటికి అమెరికాలో కనీసం 10 సంవత్సరాలుగా ఉంటూ, అక్కడ పౌరులను వివాహం చేసుకున్న వారికి మాత్రమే ఈ అవకాశం దక్కుతుంది. ఈ అర్హతలున్న వారు చేసుకున్న దరఖాస్తులను అమెరికా ప్రభుత్వం ఆమోదిస్తే, గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోవడానికి మూడేళ్ల గడువు లభిస్తుంది. అంత వరకూ తాత్కాలిక వర్క్ పర్మిట్‌ను జారీ చేస్తారు. ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాలను అనుసరించి, వలసదారులు ఎవరైనా అమెరికా పౌరులను వివాహం చేసుకున్నప్పటికీ, వారి పిల్లలకు అక్కడి పౌరసత్వం లభించదు. కానీ, బైడెన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు, అమెరికా పౌరులను వివాహం చేసుకున్న పురుషులు లేదా మహిళలు, వారి పిల్లలు 50,000 మందికి త్వరలోనే అమెరికా పౌరసత్వం లభిస్తుంది.

# విచ్చలవిడి ఖర్చులా?

## ఫ్రాన్స్ చేస్తున్న అధిక రుణాలపై ఇయు అసహనం



**బ్రసెల్స్:** అధిక రుణాలను తీసుకొని, విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నదంటూ ఫ్రాన్స్‌పై యూరోపియన్ యూనియన్ (ఇయు) అసహనం వ్యక్తం చేసింది. యూనియన్ కార్యనిర్వాహక విభాగం బుధవారం సమావేశమైనప్పుడు, ఫ్రాన్స్ అంశం చర్చకు వచ్చింది. ఇయు ఎన్నికల నేపథ్యంలో, ఫ్రాన్స్ అధికంగా ఖర్చులు చేస్తున్నదని విమర్శించింది. ఖర్చులు అదుపు చేయకపోవడంపై ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయెల్ మాక్రాన్‌ను కూడా తప్పుపట్టింది. 27 ఇయు సభ్య దేశాల్లో, ఏడు దేశాలకు ఆర్థిక విధివిధానాలపై మార్గదర్శకాలు చాలాకాలం క్రితమే వెలువడ్డాయి. ఈ ఏడు దేశాల్లో ఒకటైన ఫ్రాన్స్, అదుపులేని ఖర్చులను తగ్గించుకునే ప్రయత్నం చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇయు సభ్య దేశాల వార్షిక లోటు, దేశ జాతీయోత్పత్తి (జిడిపి)లో మూడు శాతం కంటే ఎక్కువ కాకూడదు. అంతేగాక, తీసుకునే రుణాలు ఎప్పుడూ ఉత్పత్తి విలువలో 60 శాతం కంటే పెరగకూడదు. ఈ తీర్మానాలకు లోబడి దేశలు మసలుకోవాలని ఇయు కమిషన్ స్పష్టం చేసినప్పటికీ, ఫ్రాన్స్ తన వైఖరిని మార్చుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇయు కమిషన్ సమావేశంలో ఈ అంశం ప్రస్తావనకు రావడం మాక్రాన్ బృందానికి అవమానకలంగా భావించాలి. ఇప్పటికే రైతులు, కార్మికులు, ఉద్యోగులు తమతమ డిమాండ్ల సాధన కోసం ఆందోళన బాట పట్టారు. ఉత్పత్తి తగ్గుతున్నది. ప్రజా సమస్యలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఖర్చుల అంశం కూడా చర్చకు రావడం మాక్రాన్ రెనెసెన్స్ పార్టీ ఎన్నికల్లో మళ్లీ గెలుస్తుందా అన్నది అనుమానంగానే ఉంది.

# హజ్ యాత్రికులను అల్లాడిస్తున్న ఉష్ణోగ్రతలు

## ఈ ఏడాది ఇప్పటి వరకూ 577 మంది మృతి





**హిజాజ్ (సౌదీ అరేబియా):** హజ్ యాత్రికులను పెరుగుతున్న ఉష్ణోగ్రతలు అల్లాడిస్తున్నాయి. హిజాజ్‌లోని మక్కా గ్రాండ్ మసీదు వద్ద ఉష్ణోగ్రత 51.8 డిగ్రీల సెల్సియస్ (125 ఫారెన్‌హీట్)కు చేరుకుంది. ఈ ఏడాది అత్యధిక ఉష్ణోగ్రతల కారణంగా ఇప్పటి వరకూ 577 మంది యాత్రికులు మరణించగా, పలువురు ఆసుపత్రి పాలయ్యారు. మృతుల్లో 323 మంది ఈజిప్షియన్లు, 60 మంది జోర్డానియన్లు ఉన్నారు. ఈ నెల 14న ప్రారంభమైన ప్రత్యేక హజ్ యాత్ర బుధవారంతో ముగిసినప్పటికీ, లక్షలాది మంది యాత్రికులు హిజాజ్‌లోనే ఉన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో, భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే వివిధదేశాలు హజ్ యాత్రకు వెళ్లిన తమతమ పౌరుల యోగక్షేమాలు కనుగొనడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాయి. ఈజిప్టు విదేశాంగ మంత్రిత్వశాఖ తప్పిపోయిన ఈజిప్షియన్ల కోసం వెతకడానికి సౌదీ అధికారులను సంప్రదిస్తున్నది. జీవితంలో ఒక్కసారైనా హజ్ యాత్ర చేయాలని ప్రతి ముస్లిం కోరుకోవడం సహజం. అయితే, ఇటీవల కాలంలో వాతావరణ మార్పుల కారణంగా, హజ్ యాత్ర సమస్యాత్మకంగా మారుతున్నది. ఈ ఏడాది పరిస్థితి మరింత విషమించింది. తీవ్రమైన ఉష్ణోగ్రతలు, వడగాడ్పులతో హిజాజ్ అగ్నిగుండంగా మారింది. ఈపరిస్థితుల్లో సరైన వసతులు లేక వేలాది మంది యాత్రికులు అనారోగ్యం పాలవుతున్నారు. మృతులసంఖ్య కూడా పెరుగుతుంది. ఇప్పటి వరకూ వడగాడ్పులతో ఆరోగ్యం దెబ్బతిన్న కనీసం 2,000 మంది యాత్రికులకు చికిత్స అందించినట్టు సౌదీ అరేబియా అధికారులు ప్రటించారు. అయితే, మృతుల సంఖ్యను మాత్రం వెల్లడించలేదు. గత ఏడాది హజ్‌యాత్రలో 240మంది మృతిచెందగా, వారిలో ఎక్కువమంది ఇండోనేషియన్లు ఉన్నారు. ఆ అనుభవాలను దృష్టిలో ఉంచుకొని, ఈసారి యాత్రికులకు శీతల పానీయాలు అందించేందుకు వాలంటీర్లను నియమించింది. గొడుగులు ఉపయోచడం వంటి పలు సూచనలు చేసింది. శరీరం అతిసారకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని యాత్రికులను కోరింది. ఈ ఏడాది సుమారు 18లక్షలమంది యాత్రికులు చ్చినట్టు అంచనా వేస్తున్నారు. వీరిలో 16లక్షల మంది విదేశీయులే. అధికారిక సమాచారం ఇవ్వకుండా, ఖరీదైన హజ్ వీసా లేకుండా వచ్చిన యాత్రికులే ఎక్కువగా సమస్యలు ఎదుర్కొంటున్నారు. ముందుగా సమాచారం ఇచ్చి, హజ్‌వీసాను పొందిన వారివివరాలు సౌదీ ప్రభుత్వం వద్ద ఉంటాయి. వారికి అవసరమైన సౌకర్యాలను కూడా ప్రభుత్వం కల్పిస్తుంది. కానీ, ఖర్చుకు వెనకాడే చాలా మంది అనధికారికంగా హజ్ యాత్రకు రావడమే అధిక మరణాలకు కారణమని అధికారులను ఉటంకిస్తూ పిటిఐ తెలిపింది. హజ్‌కు ముందు మక్కా నుంచి నమోదుకాని కొన్ని వేల మంది యాత్రికులను బయటకు పంపినట్టు సౌదీ అధికారులు తెలిపారు. లేకపోతే మరణాల సంఖ్య మరింత పెరిగేదని వ్యాఖ్యానిస్తున్నారు. హజ్‌కు వచ్చే వారంతా ముందుగా తమతమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరుతున్నారు. సౌదీ ప్రభుత్వం సూచనలను పాటిస్తే, భవిష్యత్తులోనైనా మరణాలను నివారించడానికి అవకాశం ఉంటుంది.

# ఆర్థిక, సైనిక సహకారాన్ని పెంచుకుందాం

## కిమ్, పుతిన్ సంకల్పం వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందంపై సంతకాలు

## 24ఏళ్ల తర్వాత ఉ.కొరియాలో పర్యటించిన రష్యా అధ్యక్షుడు



**ప్యాంగ్యాంగ్/మాస్కో:** ఆర్థిక, సైనికపరమైన సహకారాన్ని మరింత పెంచుకోవాలని రష్యా, ఉత్తర కొరియా అధినేతలు వ్లాదిమిర్ పుతిన్, కిమ్ జాంగ్ ఉన్ సంకల్పించారు. తమ దౌత్య బంధాన్ని బలోపేతం చేసుకోవాలని నిర్ణయించారు. పాశ్యాత్య ఒత్తిళ్లను కలిసి ఎదుర్కోవాలని నిర్ణయించారు. ఇదే క్రమంలో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందాన్ని కదుర్చుకున్నారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ 24 ఏళ్ల తర్వాత ఉత్తర కొరియా గడ్డపై కాలుమోపారు. ఉక్రెయిన్‌పై యుద్ధంలో ఆయుధ సరఫరా వివాదాస్పదమైన వేళ పుతిన్ ఉత్తర కొరియా పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. ఉత్తర కొరియాలో పుతిన్‌కు ఘన స్వాగతం లభించింది. రోడ్డుకు రెండు వైపులా భారీ సంఖ్యలో జనం చేరుకొని పూలు, ఉత్తర కొరియా, రష్యా జెండాలు ప్రదర్శిస్తూ, ఎరుపు, నీలం, శ్వేత టీషర్లు ధరించి పుతిన్‌కు స్వాగతం పలికారు. రాజధాని నగరంలోని కిమ్ 2 సంగ్ స్క్వేర్‌లో పుతిన్‌కు కిమ్ అట్టహాసంగా స్వాగతం పలికారు. అనంతరం ఇద్దరు అధినేతలు భేటీ అయ్యారు. అనేక అంశాలపై చర్చించారు. ఆర్థిక, సైనికపరమైన సహకారాన్ని మరింత పెంచుకోవాలని, పశ్చిమ దేశాలను కలిసికట్టుగా ఎదుర్కోవాలని నిర్ణయించారు. ప్యాంగ్యాంగ్ సదస్సు సందర్భంగా వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందంపై సంతకాలు చేశారు. తొలుత కిమ్ 2 సంగ్ స్క్వేర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పుతిన్ మాట్లాడుతూ ఉక్రెయిన్‌పై యుద్ధానికి అందించిన మద్దతుకుగాను కిమ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అమెరికా సామ్రాజ్యవాద ఆధిపత్య విధానాలపై పోరాటంలో భాగంగానే ఉక్రెయిన్‌లో యుద్ధం కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. దీర్ఘకాల సంబంధాలకు పునాదిగా నూతన పత్రంపై తాము సంతకాలు చేస్తున్నట్లు ప్రకటించారు. కొరియా యుద్ధం సమయంలో ప్యాంగ్యాంగ్‌కు మాస్కో మద్దతు, రెండవ ప్రపంచ యుద్ధమప్పుడు కొరియా ద్వీపంలో జపాన్ సైన్యంతో సోవియట్ సైన్యం పోరాటాన్ని గుర్తుచేసుకున్నారు. సోవియట్ కాలంలో కంటే తమ స్నేహబంధం ప్రస్తుతం పటిష్ఠంగా ఉందని చెప్పారు. ఉక్రెయిన్‌లో ప్రత్యేక సైనిక చర్యలకు ఉత్తర కొరియా సాయాన్ని, సంఘీభావాన్ని స్వాగతించారు. కిమ్ జాంగ్ ఉన్ కూడా పుతిన్‌తో ఏకీభవించారు. అమెరికా ఆధిపత్య విధానాలను తీవ్రంగా ఖండించారు. రష్యా ప్రయోజనాల దృష్ట్యా తీసుకునే చర్యలకు ఉత్తర కొరియా మద్దతు ఎల్లప్పుడు ఉంటుందని హామీనిచ్చారు. రెండు దేశాల భాగస్వామ్యం కోసం ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. అయితే ఈ ఒప్పందం గురించి ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. ఉత్తర కొరియాపై ఐరాస భద్రత మండలి... రష్యాపై అమెరికా, దాని మిత్రదేశాల ఆంక్షలు ఉన్న విషయం తెలిసిందే.

### కిమ్‌కు విలాసవంత కారు బహూకరించిన పుతిన్

రష్యా అధ్యక్షుడి తొలి పర్యటన సందర్భంగా ఇద్దరు అధినేతలు బహుమతులు ఇచ్చిపుచ్చుకున్నారు. రష్యాలో తయారైన విలాసవంతమైన ఉరుస్ కారుతో పాటు టీ సెట్‌ను కిమ్‌కు బహూకరించినట్లు క్రెమ్లిన్ అధికారి యూరి ఉషాకోవ్ తెలిపారు. పుతిన్‌కు కూడా ఆయన స్థాయికి తగ్గట్లు బహుమతులు అందినట్లు చెప్పారు. అయితే అవి ఏమిటో మాత్రం వెల్లడించారు.

# పాకిస్థాన్‌లో జర్నలిస్టు కాల్చివేత

**పెషావర్:** పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో సీనియర్ జర్నలిస్టు ఖలీల్ జిబ్రాన్ కాల్చివేతకు గురయ్యారు. తన స్నేహితుడు సజ్జాద్ అడ్వకేట్ ఇంటికి వెళ్లేందుకు లాండి కోటల్ పట్టణంలోని తన ఇంటి నుంచి బిబ్రాన్ బయల్దేరినప్పుడు ఆయనపై దాడి జరిగిందని పోలీసులు బుధవారం తెలిపారు. కారులో ఉన్న ఆయనను అడ్డుకొని బయటకు లాగి కాల్చి చంపారన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు బైకుపై వచ్చిన కాల్పులు జరిపారని తెలిపారు. జర్నలిస్టు కాల్చివేతపై దర్యాప్తునకు ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్ ముఖ్యమంత్రి అలీ అమీన్ ఆదేశాలిచ్చారు. హంతకులను వెంటనే అరెస్టు చేయాలన్నారు. ప్రావిన్స్ గవర్నర్ ఫైజల్ కరీం కుండీ కూడా ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. జిబ్రాన్ కాల్చివేతను ఎలక్ట్రానిక్ మీడియా ఎడిటర్లు, న్యూస్ డైరెక్టర్లు తీవ్రంగా ఖండించారు. ఆయనకు న్యాయం చేయాలని, హంతకులను పట్టుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలో జర్నలిస్టులపై దాడులు, వారికి వేధింపులు, బెదిరింపులు ఎక్కువయ్యాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. జిబ్రాన్‌కు న్యాయం చేయాలని సీఎంను డిమాండ్ చేశారు. గతనెలలో సింధీ పత్రిక జర్నలిస్టు నస్‌రుల్లా గడానీ కూడా ఇదే తరహాలో హత్యకు గురయ్యారు. బైకుపై వచ్చిన దుండగులు చేసిన దాడితో తీవ్రంగా గాయపడిన నస్‌రుల్లా మూడు రోజుల పాటు మృత్యువుతో పోరాడి ఓడిపోయారు.

# హైవే విస్తరణ పనులు

(మొదటి పేజీ తరువాయి)

వచ్చిందని అధికారులు చెప్పగా, ఈ అంశాన్ని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్లి కాంట్రాక్టర్‌ను మార్చడమా? లేదా చూసి పనులు వేగవంతం చేయించాలని అధికారులకు సూచించారు. అంబర్‌పేట ఫ్లైఓవర్ పనులు తుది దశకు చేరుకున్నాయని, మరో నెలరోజుల్లో ట్రాఫిక్‌కు అనుమతిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి అధికారులు వివరించారు.

# గుడిసెవాసులకు న్యాయం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

కోరారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివ రావు నేతృత్వంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, ముత్యాల యాదిరెడ్డిలతో కూడిన ప్రతినిధి బృందం ముఖ్యమంత్రిని బుధవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో కలిసి ఒక విజ్ఞాపన పత్రాన్ని అందజేసింది. ఏడాదిన్నర కాలంగా ఎండా వాన అని లెక్క చేయకుండా చిన్నపిల్లలతో నిరుపేద ప్రజలు అక్కడ జీవిస్తున్నారని, ఆ గుడిసెల్లో నివసించే ప్రజలందరూ చిన్న మధ్య తరగతి వర్గాలకు చెందిన ప్రజలని ముఖ్యమంత్రికి కూనంనేని సాంబశివరావు వివరించారు. దాదాపు 400 మంది విద్యార్థులు అక్కడి నుంచే స్కూల్స్‌కు వెళ్తున్నారని తెలిపారు. భూదాన భూమి పేదలకే చెందే విధంగా చూడాలని, మౌలిక సదుపాయాలైన విద్యుత్, మంచినీటి సౌకర్యం కల్పించాలని, ప్రైవేట్ రియల్ ఎస్టేట్ వ్యాపారులతో రెవెన్యూ, పోలీస్ అధికారులు కుమ్మక్కై ఈ నెల 13న గుడిసెలను తొలగించే ప్రయత్నం చేశారని సిఎం రేవంత్ రెడ్డికి కూనంనేని సాంబశివరావు తెలిపారు. అనంతరం సిఎం రేవంత్ రెడ్డి గుడిసెవాసులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు సిపిఐ నాయకులు తెలిపారు.

# కష్టాల్లో ఢిల్లీ

(మొదటి పేజీ తరువాయి)

45 మంది తమ ఆసుపత్రిలో చేరగా వారిలో తొమ్మిది మంది చనిపోయారని, గత రెండు రోజుల్లోనే ఏడు మరణాలు సంభవించాయని ఆర్ఎంఎల్ వర్గాలు తెలిపాయి. 'ఎండ దెబ్బ తగిలినప్పుడు తీసుకునే చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ఆసుపత్రికి రావడానికి ముందు నీళ్లు, ఐస్ వంటివి వినియోగించడంతో కాస్త ప్రయోజనం ఉంటుంది. రోగులను చేరుకున్న వెంటనే వారికి ఎండ దెబ్బ వల్ల కలిగే దుష్పరిణామాలను తగ్గించేందుకు తగు చర్యలు తీసుకునే విధంగా అంబులెన్సులు అందుబాటులో ఉంచాం' అని డాక్టర్ శుక్లా వెల్లడించారు. నెల రోజులుగా ఢిల్లీలో కనిష్ఠంగా 35 డిగ్రీలు, గరిష్ఠంగా 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. జూన్‌లో నమోదయ్యే సాధారణ ఉష్ణోగ్రతల కంటే ఆరు డిగ్రీలు అధికంగా ఢిల్లీలో నమోదవుతున్నట్లు అధికారులు తెలిపారు. రికార్డు ఉష్ణోగ్రతలు, నీటి సంక్షోభంతో రాజధాని ప్రజలు అల్లాడిపోతున్నట్లు వెల్లడించారు. పంపుల్లో నీళ్ల రోజంతా కాలిపోతుండగా... ఏసీలు కూడా ప్రజలకు ఎండ నుంచి ఉపశమనాన్ని కల్పించలేకపోతున్నాయన్నారు. దీంతో ఎండల తీవ్రతను తట్టుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు వైద్యులు సూచిస్తున్నారు.

**వడ దెబ్బ రోగులకు ప్రాధాన్యతివ్వాలి:** ఆసుపత్రులకు కేంద్రం ఆదేశాలు ఉత్తర భారతంలో ఎండలు అధికంగా ఉండటం, ప్రజలు మృత్యువాత పడుతుండటాన్ని కేంద్రం తీవ్రంగా పరిగణించింది. వడ దెబ్బ రోగులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు కేంద్ర ఆరోగ్య శాఖ సూచనలు జారీ చేసింది. ఇలాంటి కేసులను చేపట్టడానికి కేంద్రప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏర్పాట్లు, రాష్ట్రాల్లో పరిస్థితులను కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా సమీక్షించారు. సంబంధిత అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. వడ దెబ్బ రోగుల కోసం ఆసుపత్రుల్లో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. వడ దెబ్బ రోగులకు ఉత్తమ సేవలు అందించాలన్నారు. ఎండ తీవ్రత, వడ దెబ్బ నుంచి రక్షణకు సంబంధించి ప్రజల కోసం తగు మార్గదర్శకాలను ఢిల్లీ విపత్తు నివారణ యంత్రాంగం సైతం జారీచేసింది.

# తెలంగాణ పోటీ

(మొదటి పేజీ తరువాయి)




పెంచడంతోనే అభివృద్ధి సాధ్యమవుతుంది, రాష్ట్రంలో పెద్ద ఎత్తున రుణాలు ఇవ్వండి రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకర్లకు అండగా ఉంటుందని భరోసానిచ్చారు. నిరుపేదలు, మధ్యతరగతి వర్గాలకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు ముందుకు రావాలని,బలహీన వర్గాలకు విరివిగా రుణాలు ఇస్తేనే రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతుందన్నారు. ఆర్ఆర్ఆర్ నిర్మాణంతో తెలంగాణ రాష్ట్ర రూపురేఖలు మారిపోనున్నాయన్నారు. అతిపెద్ద రీజినల్ రింగ్ రోడ్డు తో తెలంగాణ రాష్ట్రంలో అర్బన్, సెమీ అర్బన్, రూరల్ ఇలా మూడు ప్రాంతాలుగా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పునరుద్ఘాటించారు. లండన్ లో థేమ్స్ నదిని అభివృద్ధి చేసినట్టుగా హైదరాబాదులో మూసి పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధికి రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయబోతున్నామన్నారు. రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి బాగా పెరిగిందని,తద్వారా రాష్ట్రంలో ఇథనాల్ పెట్రోలియం ఉత్పత్తులకు కేంద్రం ప్రోత్సాహం అందిస్తుందన్నారు. రాష్ట్రంలో ఆయిల్ ఫామ్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహకాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. వ్యవసాయ ఉత్పత్తులు, ప్రోత్సాహకాలకు ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తున్నామని రూపాయి కూడా పెండింగ్‌లో పెట్టలేదన్నారు. ఇటీవల ఆయిల్ ఫామ్ రైతులకు రూ 100 కోట్లు విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఎంఎస్ఎంఇ సూక్ష్మ, పెద్ద తరహా పరిశ్రమలకు బ్యాంకర్లు పెద్ద మొత్తంలో రుణాలు అందించి, ప్రోత్సహించాలని, ఈ రంగం దేశంలో అతి ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్నదని వివరించారు. రాష్ట్రంలో మిగులు విద్యుత్ అందుబాటులో ఉన్నదని, రెప్పపాటు కూడా కరెంటు కోతలు లేవని,వ్యవసాయానికి 24 గంటల పాటు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున పరిశ్రమలు వచ్చిన ఎటువంటి ఇబ్బంది లేకుండా విద్యుత్ సరఫరా చేస్తామని భరోసా ఇచ్చారు.

**బ్యాంకర్లు సహకరించడం లేదు**

సబ్సిడీ పథకాలకు సంబంధించి ప్రభుత్వం తమ వాటాను విడుదల చేస్తున్నప్పటికీ బ్యాంకర్లు సహకరించడం లేదని భట్టి విక్రమార్క అన్నారు. సాధారణంగా బ్యాంకర్లు మంజూరులు ఇచ్చినప్పటికీ సబ్సిడీ మొత్తం విడుదలలో జాప్యం జరుగుతుందని, కానీ రాష్ట్రంలో ఇందుకు వ్యతిరేక పరిస్థితులు కనిపిస్తున్నాయని తెలిపారు. రుణాల విషయంలో ప్రైవేట్ బ్యాంకులు లక్ష్యాలు సాధిస్తున్నప్పటికీ, జాతీయ బ్యాంకులు వెనుకంజలో ఉంటున్నాయన్నారు. మహిళా సంఘాల అభివృద్ధి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధానలక్ష్యమన్నారు. మహిళా సంఘాలకు ప్రతి సంవత్సరం రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను ,ఐదేళ్లపాటు లక్ష కోట్ల రూపాయలు వడ్డీ లేని రుణాలు అందిస్తామన్నారు.

**వేల, లక్షల కోట్లు ఎలా ఎగ్గొడుతారు..?: మంత్రి తుమ్మల**

బ్యాంకులు నిబంధనల ప్రకారమే రుణాలను అందజేస్తే మల్టీ నేషనల్ కంపెనీలు, పలు సంస్థలు రుణలను ఎలా ఎగ్గొడుతారని ప్రజలు ప్రశ్నిస్తున్నారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. ఏం కుదవ పెట్టుకుని ఆయా పెద్ద పెద్ద కంపెనీలకు రుణాలు ఇస్తున్నారని, ఇదేలా సాధ్యమవుతుందన్నారు. ఇటువంటి రుణాల ఎగవేతదారులను చూసి తామూ అలవాటుపడే పరిస్థితి ఉంటుందని వ్యాఖ్యానించారు. పరిస్థితులు ఇలాగే ఉంటే బ్యాంకర్ల పట్ల విశ్వసనీయ తగ్గుతుందని సూచించారు. పేదలు, పెద్దలకు ఒకే న్యాయం ఉండాలని, సమానమైన రీతిలో వ్యవస్థ పని చేయాలని ఆయన ఆకాక్షించారు. రుణాలను ఎగ్గొట్టిన వారి నుంచి డబ్బులను వసూలు చేసే పరిస్థితిలోనైనా ఉండాలన్నారు. ఈము పక్షుల కోసం 15 ఏళ్ల క్రితం రుణాలు ఇచ్చామని, ఒక ప్రైవేటు కంపెనీ బైబ్యాక్ అగ్రిమెంట్ చేసుకుని పైసలు ఇవ్వకుండా వెళ్లిపోయారని, దీంతో ఆ పక్షులను అడవిలోకి వదిలిపెట్టాల్సిన పరిస్థితి వచ్చిందని వివరించారు. ఆ బాధితులు తమకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేయాలని బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ బ్యాంకర్లు అంగీకరించడం లేదని తెలిపారు.

న్యాయం, ధర్మం, నిబంధనలు, పద్ధతులకు భిన్నంగా కాకుండా మానవీయ కోణంలో ఆలోచన చేయాలని బ్యాంకర్లను కోరారు. దేశ భవిష్యత్తు, అభివృద్ధి బ్యాంకర్లపైనే ఉన్నదన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సామాజిక భద్రత, ఇన్సూరెన్స్ పథకాలపట్ల ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉన్నదన్నారు. 18,000 వేల ఆయిల్ ఫామ్ సాగుదారులలో కేవలం 50 మందికి మాత్రమే బ్యాంకులు ఆర్థిక సహాయం అందజేశాయని వివరించారు. వ్యవసాయ,అనుబంధ రంగాలకు బ్యాంకులు రుణాలను పెంచాలని సూచించారు.

# వైద్యరంగంలో ప్రక్షాళన

(మొదటి పేజీ తరువాయి)

డెంటల్ కాలేజ్ లలో మెరుగైన వైద్య విద్యను అందించేలాచర్యలు చేపట్టామని, మెరుగైన వైద్య విద్యను అందించేందుకు ప్రాధాన్యత ఇచ్చామన్నారు. గతంలో ఉస్మానియా, గాంధీ, కాకతీయ మెడికల్ కళాశాల లో వైద్య విద్య పూర్తి చేసుకున్న డాక్టర్లకు ఎంతో గౌరవం ఉండేదని గుర్తు చే శారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో మెరుగైన వైద్య విద్య ను విద్యార్థులకు అందించేందుకు కృషి చేస్తున్నామని, వైద్య విద్య లో తెలంగాణ రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచేలా చర్యలు చేపడుతున్నామని ప్రైవేటు వైద్య కళాశాలల యాజమాన్యాలకు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 28 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఉండగా, ఇందులో 3690 ఎంబిబిఎస్ సీట్లు ఉన్నాయని తెలిపారు. (ఇందులో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఎయిమ్స్‌కు 100 ,ఇఎస్ఐ 125 ఎంబిబిఎస్ సీట్లు ఉన్నాయి) ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మొత్తం. 3915 మెడికల్ సీట్లు, ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పిజి సీట్లు 1320 ( రాష్ట్ర ప్రభుత్వ కళాశాలలో 1148, కేంద్ర ప్రభుత్వం నిమ్స్ 89,ఇఎస్ఐ 83 సీట్లు) ఉన్నాయన్నారు. సూపర్ స్పెషాలిటీ పిజి మెడికల్ షెడ్యూల్ 179 ఉన్నాయన్నారు. వీటిలో కేంద్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలలో 105,నిమ్స్ 59,ఇఎస్ఐ 15 సీట్లు ఉన్నాయన్నారు మంత్రి దామోదర్ రాజనర్సింహ వివరించారు.

**నిరంతర పర్యవేక్షణలో విద్యబోధన...** ప్రైవేట్ యాజమాన్యంలో 28 మెడికల్ కళాశాలలో 4,600 ఎంబిబిఎస్ మెడికల్ సీట్లు ఉన్నాయన్నారు. వీటితోపాటు 21 ప్రైవేట్ కళాశాల లో 1566 పిజి మెడికల్ సీట్లు ఉన్నాయన్నారు. అలాగే సూపర్ స్పెషాలిటీ పిజి సీట్లు 6 కాలేజీలలో 27 సీట్లు భర్తీ అవుతున్నాయన్నారు.పారదర్శకంగా, నిరంతర పర్యవేక్షణలో వైద్య విద్య బోధన జరిగేలా కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో రాష్ట్ర మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ వాణి, స్పెషల్ ఆఫీసర్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ విమల థామస్ పాల్గొన్నారు.

# క్వింటాల్‌కు రూ. 117 పెంపు

(మొదటి పేజీ తరువాయి)

ఖర్చులు, ధరల కమిషన్ (సిఎసిపి) సిఫార్సుల ప్రకారం, 14 ఖరీఫ్ (వేసవి) పంటల కనీస మద్దతు ధరను కేబినెట్ ఆమోదించినట్టు ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు. 'సాధారణ' గ్రేడు వరి క్వింటర్‌కు 117 రూపాయలు పెరిగితే, 'ఎ' గ్రేడ్ వరి క్వింటల్ ధరను రూ. 2,320గా ఖరారు చేసినట్టు వైష్ణవ్ తెలిపారు. ఉత్పత్తి ఖర్చుల కంటే ఎంఎస్‌పి కనీసం 1.5 రెట్లు అధికంగా ఉండాలని 2018లో తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉన్నట్టు ఆయన చెప్పారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సిఐ) వద్ద రికార్డు స్థాయిలో 53.4 మిలియన్ టన్నుల బియ్యం నిల్వలు ఉన్నాయని వైష్ణవ్ చెప్పారు. జులై ఒకటో తేదీ నాటికి అవసరమైన స్టాక్ కంటే ఇది నాలుగు రెట్లు ఎక్కువని తెలిపారు. జూన్ ఒకటో తేదీన మొదలైనప్పటి నుంచి దేశ వ్యాప్తంగా వర్షపాతం సాధారణం కంటే 20 శాతం తక్కువగా నమోదైనప్పటికీ, పరిస్థితులు వ్యవసాయానికి అనుకూలంగా ఉన్నాయని వివరించారు.

# జీవితకాలం ఉచిత బస్‌పాస్

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టిజిఎస్ఆర్‌టిసి) యాజమాన్యం ప్రకటించింది. ఆర్‌టిసి బస్సులు, బస్‌స్టేషన్‌లలో పుట్టిన పిల్లలకు జీవితకాలపు ఉచిత బస్‌పాస్‌ను ఇవ్వాలని గతంలో యాజమాన్యం తీసుకున్న నిర్ణయం మేరకు.. ఈ ఆడపిల్లకు బర్త్ డే గిఫ్ట్‌గా లైఫ్ టైం ఫ్రీ బస్ పాస్ ను మంజూరు చేస్తున్నట్లు పేర్కొంది. కరీంనగర్ బస్ స్టేషన్ లో పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణికి చీరను అడ్డుకట్టి కాన్పు చేసి మానవత్వం చాటిన తమసిబ్బందిని టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం హైదరాబాద్ బస్ భవన్‌లో బుధవారం అభినందించింది. సంస్థ ఉన్నతాధికారులతో కలిసి టిజిఎస్ఆర్‌టిసి ఎండి విసి సజ్జనర్ వారిని ఘనంగా సన్మానించారు. ఈనెల 16న కుమారి అనే గర్భిణీ, తన భర్త తో కలిసి భద్రాచలం బస్సు కోసం కరీంనగర్ బస్ స్టేషన్ కు వచ్చారు. ఆమెకు బస్ స్టేషన్ లో నొప్పులు ఎక్కువయ్యాయి. ఈ విషయాన్ని గమనించిన ఆర్టీసీ సిబ్బంది వెంటనే 108 కాల్ చేసి సమాచారం ఇచ్చారు. ఈలోగా నొప్పులు ఎక్కువ కావడంతో.. ఆర్టీసీ మహిళా సిబ్బంది ముందుకు వచ్చారు. చీరలను అడ్డుపెట్టి నార్మల్ డెలివరీ చేయగా ఆడపిల్ల పుట్టింది. అనంతరం అంబులెన్స్ సాయంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తల్లిబిడ్డా క్షేమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు.

**సమయస్ఫూర్తితో వ్యవహరించి..** సకాలంలో కాన్పు చేసిన ఆర్టీసీ సిబ్బంది సైదమ్మ, లావణ్య, స్రవంతి, భవాని, రేణుక, రజనీ కృష్ణ, అంజయ్య సేవలను ఈ సందర్భంగా టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ మెచ్చుకున్నారు. ఆపద సమయంలో సేవాతత్పరతను ఆర్టీసీ సిబ్బంది చాటుతుండటం గొప్ప విషయమని అన్నారు. ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చడంతో పాటు.. వారి ఆపద సమయం లో తాము ఉన్నామని భరోసా కల్పిస్తుండటం అభినందనీయమని ప్రశంసించారు.. సన్మాన కార్యక్రమంలో సంస్థ సీవోవో డాక్టర్ రవిందర్, జాయింట్ డైరెక్టర్ అపూర్వ రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, కృష్ణకాంత్, చీఫ్ పర్సనల్ ఆఫీసర్ ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

# సంపద సృష్టిస్తాం..

(మొదటి పేజీ తరువాయి)

రుణాలు అందజేస్తామని డిప్యూటి సిఎం చెప్పారు. కేంద్ర బడ్జెట్ చూసి దాని ఆధారంగా రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెడతామని తెలిపారు. కేంద్రం చేసే కేటాయింపులకు అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్‌లో వివిధ శాఖలకు, సంక్షేమ, అభివృద్ధి పథకాలకు కేటాయింపులు ఉంటాయన్నారు. గాంధీభవన్‌లో మీడియాతో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం సంపద, పదవులు పంచాలని, కుల గణన జరగాలనే రాహుల్ గాంధీ చేసిన ఆలోచన విప్లవాత్మకమైనదని ఆయన అన్నారు. కుల గణన చేస్తామని ఎన్నికల ముందు తెలంగాణ రాష్ట్రంలో రాహుల్ గాంధీ ప్రకటించారని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆ దిశగా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని తెలిపారు. ఈ దేశ సంపద వనరులు ఈ దేశ ప్రజలకే చెందాలని, భారతదేశ లౌకికభావంతో విలసిల్లాలని రాహుల్ గాంధీ ఆశిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ ఆలోచనలు, చూపిన మార్గాన్ని రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ నుంచి గ్రామస్థాయి కార్యకర్త వరకు ముందుకు తీసుకువెళ్తామని చెప్పారు. ఇంజనీర్లను కాదని అంతా తానేనని కెసిఆర్ కాళేశ్వరం కడితే కూలిపోయిందని అన్నారు. మేడిగడ్డలో మేట వేసిన ఇసుకను తొలగిస్తేనే ప్రాజెక్టు మరమ్మత్తులు ప్రారంభమవుతాయని తెలిపారు. విద్యుత్ కొనుగోలు అంశంపై అసెంబ్లీలో శ్వేత పత్రాన్ని చర్చకు పెట్టగా నాటి విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి న్యాయ విచారణ జరగాలని పదేపదే కోరడంతో సభా నాయకుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంగీకరించారని, ఇప్పుడు విచారణ అంటే వారు ఎందుకు ఆందోళన చెందుతున్నారో, ఎందుకు భయపడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. రైతుల పంట రుణాల మాఫీకి అంశానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, ఈ విషయంలో ఎవరికి ఎలాంటి అనుమానాలు అవసరం లేదని డిప్యూటీ సిఎం మరోసారి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఎన్నికల ముందు ఇదే విషయాన్ని స్పష్టం చేశారని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు రైతుల ఖాతాలో వేయబోదని వారు ప్రచారం చేశారని, అందుకు భిన్నంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఖాతాలలో జమ చేసిందన్నారు. రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు శ్రమించిన నాయకుల సమగ్ర సమాచారం అధిష్ఠానం వద్ద ఉందని, త్వరలోనే పదవుల పంపిణీ జరుగుతుందని తెలిపారు.

## జర్నలిస్టుల అక్రిడిటేషన్‌ల గడువు సెప్టెంబర్ 30 వరకు పొడగింపు

ఉత్తర్వులు జారీ చేసిన సమాచార శాఖ

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ (గుర్తింపు కార్డు) గడువును సెప్టెంబర్ 30వ తేదీ వరకు పొడిగిస్తూ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ హనుమంత రావు బుధవారం ఉత్తర్వలు జారీ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వల మేరకు జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్లు అయిన జిల్లా కలెక్టర్లు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు. వర్కింగ్ జర్నలిస్టుల కోసం ప్రతి రెండు సంవత్సరాలకోసారి అక్రిడిటేషన్ కార్డుల సదుపాయం రాష్ట్ర సమాచార శాఖ కల్పిస్తున్న విషయం తెలిసిందే. ఆ గడువు ఈ జూన్ నెల 30 వ తేదీతో ముగిస్తుండగా, ఈ గడువు తేదీని సెప్టెంబర్ 30 వరకు పొడిగించినట్లు ఆ ఉత్తర్వులలో తెలిపారు.

## పవర్ జనరేషన్ సెంటర్‌లో సెకండ్ హ్యాండ్ మిషన్‌లు:కోదండరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్ఎస్ ప్రభుత్వం యాదాద్రి, భద్రాద్రి పవర్ జనరేషన్‌లో సెకండ్ హ్యాండ్ మిషన్‌లను ఉపయోగించిందని కిసాన్ కాంగ్రెస్ సెల్ కోదండరెడ్డి ఆరోపించారు. బుధవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..యాదాద్రి, భద్రాద్రి పవర్ జనరేషన్‌లో అవకతవకలు జరిగాయన్నారు.ఛత్తీస్‌ఘడ్ నుండి విద్యుత్ కొనుగోలు విషయంలో కూడా చాలా అవకతవకలు జరిగాయని పేర్కొన్నారు.విద్యుత్ శాఖ లో జరిగిన అవినీతి పై కమిషన్ చైర్మన్ ను నియమిస్తే ఆయనను నిందించడం ఎంత వరకు సమంజసం అన్నారు. గత ప్రభుత్వంలో తాలు,తరుగు,తేమ పేరుతో రైతులను దోచుకున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేసినందుకు కిసాన్ కాంగ్రెస్ సెల్ తరపున ప్రభుత్వం కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రాన్ని కెసిఆర్ అప్పుల పాలు చేశారని, ధరణి పేరుతో పెద్ద భూ స్కాం జరిగిందని అరోపించారు. గొర్రెలు, చేప పిల్లల పంపిణీ లో పెద్ద స్కాం జరిగిందని అన్నారు. కమిషన్ అడిగిన ప్రతి దానికి కెసిఆర్ సమాధానం చెప్పి తీరాల్సిందేనన్నారు.

## హామీలు అమలు చేసేవరకు ప్రజల పక్షాన గర్జిస్తాం : పాడి కౌశిక్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చే వరకు ప్రజల పక్షాన తాము గర్జిస్తామని బిఆర్ఎస్ ఎంఎల్ఎ పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి, ఏడు నెలలు అయినా హామీల నెరవేరలేదని ఆరోపించారు. కాంగ్రెస్ కుంభకోణాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు.

**జేబులు నింపడానికే ఇసుక టెండర్లు: బాల్కసుమన్**

మేడి గడ్డ బ్యారేజ్ నుంచి 92 లక్షల క్యూబిక్ మీటర్ల టన్నుల ఇసుకను తరలించేందుకు టెండర్లను ఆహ్వానించారని, ఇది కాంగ్రెస్ నేతల జేబులు నింపడానికేనని బిఆర్ఎస్ మాజీ ఎంఎల్ఎ బాల్క సుమన్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని పునః సమీక్షించాలని కోరారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోకపోతే తాము కోర్టులను ఆశ్రయిస్తామన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఖనిజాల వేలానికి డెడ్ లైన్ విధిస్తూ ,రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారన్నారు. నీట్ పరీక్షను రద్దు చేసి, తక్షణమే మళ్లీ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. గొర్రెల కొనుగోలు అంశంలో అవకతవకలు జరిగాయని జోక్యం చేసుకున్న ఈడి, నీట్ పరీక్ష పేపర్ లికేజీలో ఎందుకు జోక్యంచేసులేదని ప్రశ్నించారు.

## జగన్ కేసు నేటికి వాయిదా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చీఫ్, ఎపి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహరెడ్డి కేసుల విచారణ గురువారానికి వాయిదా పడింది. జగన్‌పై నమోదైన క్విడ్ ప్రోకోకు సంబంధించిన కేసుల విచారణ నేడు హైదరాబాద్‌లోని సిబిఐ కోర్టులో జరగాల్సి ఉంది. అయితే, న్యాయమూర్తి సెలవులో ఉండడంతో కేసుల విచారణ రేపటికి వాయిదా పడింది.

## ఎక్సైజ్ శాఖలో 116 సూపర్ న్యూమరరీ పోస్టులు మంజూరు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ఎక్సైజ్‌శాఖలో ఉద్యోగాల భర్తీకి రాష్ట్ర సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. అకాడమీలో శిక్షణ పొందుతున్న కానిస్టేబుళ్ల పోస్టులకు సంబంధించి మొత్తం 116 సూపర్ న్యూమరరీ పోస్టులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం తెలంగాణ ఎక్సైజ్ అకాడమీలో ఆరు నెలల శిక్షణలో ఉన్న కానిస్టేబుళ్లను ఈ పోస్టుల్లో నియమించే అవకాశం ఉంది. కాగా రాష్ట్రంలో 2022 రిక్రూట్మెంట్లో భాగంగా ఎక్సైజ్‌శాఖలో 614 కానిస్టేబుళ్ల పోస్టులకు నియామకాలు చేపట్టిన సంగతి తెలిసిందే. అంతకన్నా ముందు ఏడాదే ఎక్సైజ్శాఖలో జరిగిన పునర్విభజన ప్రకారం కొత్తగా 14 ఠాణాల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ అయ్యింది. వీటిల్లో పనిచేసేందుకు వీలుగా 614 పోస్టులకు ఎంపిక ప్రక్రియ చేపట్టారు. అయితే ఇప్పటివరకు కొత్తగా ప్రకటించిన ఎక్సైజ్ ఠాణాలు ఏర్పాటు కాకపోవడంతో 614 పోస్టుల్లో 116 పోస్టులు ప్రస్తుతం అందుబాటులో లేకుండాపోయాయి. కంటీజియస్ డిస్ట్రిక్ట్ 4లో 6 పోస్టులు, కంటీజియస్ డిస్ట్రిక్ట్5లో 6 పోస్టులు, కంటీజియస్ డిస్ట్రిక్ట్ 6లో 104 పోస్టులు అందుబాటులో లేవు. ఈ నేపథ్యంలోనే ఈ పోస్టులను భర్తీ చేసేందుకు సూపర్ న్యూమరరీ పోస్టుల్ని సృష్టించారు. అకాడమీలో ఉన్న కానిస్టేబుళ్ల శిక్షణ ప్రక్రియ పూర్తికాగానే ఈ పోస్టుల్లో వారిని పునరుద్ధరిస్తారని ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది.

## ఉపకార వేతన బకాయిలు చెల్లించకుంటే ప్రత్యక్ష పోరాటం: ధర్మేంద్ర



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా రూ 7100 కోట్ల బోధనా రుసుములు, ఉపకార వేతన బకాయిలను చెల్లించకుంటే ప్రత్యక్ష పోరాటాన్ని నిర్వహిస్తామని అఖిల భారత యువజన సమాఖ్య (ఏ ఐ వై ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర అన్నారు. బోధనా రుసుములు, ఉపకార వేతన బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర డిగ్రీ,పిజి కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇందిరాపార్కులో నిర్వహించిన 'శాంతి దీక్ష' కార్యక్రమానికి ధర్మేంద్ర హాజరై సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఫీజు బకాయిలు పేరుకుపోయాయని, ఆ బకాయిలు విడుదల కాకపోవడంతో లక్షలాది మంది విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, బీటెక్, నర్సింగ్ విద్యార్థుల ఫీజు బకాయిలు కోట్లలో ఉన్నాయని, ప్రస్తుతం రాష్ట్రంలో ఏర్పడిన ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంఘీభావం తెలిపిన వారిలో ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర సమితి సభ్యులు మాజీద్ అలీ ఖాన్, కళ్యాణ్, అనీల్ కుమార్, మురళి, బాలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు





**ప్రజాపక్షం /హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ జన్మదినోత్సవ వేడుకలను రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. అన్ని జిల్లాల్లో డిసిసి కార్యాలయాల్లో రాహుల్ గాంధీ జన్మ దిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కడిక్కడ పలు సేవా కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు పెద్ద ఎత్తున కేక్‌లు కట్ చేసి సంబురాలను జరుపుకున్నారు. రాహుల్ గాంధీ పుట్టినరోజును పురస్కరించుకుని గాంధీభవన్‌లో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివాసేన రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రక్త దాన శిబిరం నిర్వహించారు. ఈ రక్త దాన శిబిరాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డితో పాటు యూత్ కాంగ్రెస్ నాయకులు , కార్యకర్తలు రక్త దానం చేశారు. అదేవిధంగా ఫిషర్‌మెన్ కాంగ్రెస్ అధ్యక్షులు మెట్టు సాయి ఆధ్వర్యంలో నిర్వహించిన పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డిలు కేక్ కట్ చేసి విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. రాహుల్ గాంధీ జన్మదిన వేడకల్లో భాగంగా రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో గాంధీభవన్ ఆవరణలో రాహుల్‌గాంధీ భారీ కటౌట్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం నిర్వహించిన సంబురాల్లో ఎంపి మల్లు రవి, మైనారిటీ నాయకులు ఫాహీం తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దమ్మ గుడిలో రాహుల్ గాంధీపేరతో ప్రత్యేక పూజలు నిర్వహించిన మహిళ కాంగ్రెస్ నేతలు అనంతరం క్యాన్సర్ హాస్పిటల్‌లో రోగులకు మందులను పంపిణీ చేశారు. తరువాత బాగ్అంబర్‌పేట్ డివిజన్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో నోటు పుస్తకాలు, స్టేషనరీ సామాగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉష్రశీ శ్రీకాంత్ గౌడ్ , సికింద్రాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పుస్తకాల కవిత, బ్లాక్ , డివిజన్ అధ్యక్షులు, ఆఫీస్ బేరర్స్ ,మహిళా కాంగ్రెస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఆదేవిధంగా తెలంగాణ రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదినోత్సవ వేడుకలను నిర్వహించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా బుధవారం న్యూ ఢిల్లీలోని ఎఐసిసి కార్యాలయంలో ఆయనకు సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంత రావు. టిపిసిసి క్యాంపెయిన్ కమిటీ ఛైర్మన్ మధు యాష్కి గౌడ్‌లు జన్మ దిన శుభాకాంక్షలు తెలిపారు ఢిల్లీలోని తెలంగాణ భవన్ లో నిర్వహించిన రాహుల్ గాంధీ జన్మదిన సంబురాల్లో భాగంగా వి.హెచ్ . హనుమంత రావు, మంత్రి పొన్నం ప్రభాకర్ ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అర్.లక్ష్మ ణ్ యాదవ్‌లు కేక్ కట్ చేశారు.







### పిసిసి తరుపున రాహుల్ గాంధీకి జన్మ దిన శుభాకాంక్షలు

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినోత్సవం సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ టిపిసిసి తరపున జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గాంధీ భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ వ్యక్తి గా కాకుండా యావత్ భారత దేశానికి శక్తిగా ప్రజలు భావిస్తున్నారన్నారు. యావత్ భారత దేశానికి భవిషత్తు రాహుల్ గాంధీ అని అన్నారు. దేశంలో కొన్ని విచ్ఛిన్నర శక్తులు విబేధాలు సృష్టించాలని చూస్తుంటే , రాహుల్ గాంధీ దేశ సమగ్రత కోసం కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు వేల కిలోమీటర్లు చరిత్రాత్మక యాత్రలు నిర్వహించి 140 కోట్ల ప్రజల అభిమానాన్ని చూరగొన్నరని కొనియాడారు. గాంధీ కుటుంబం అంటేనే త్యాగాలకు ప్రతీక అని అన్నారు. భారత ప్రథమ ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రు 10 ఏళ్ల పాటు జైల్లో ఉండగా, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ దేశం కోసం తూటాలకు బలై పోయిపోగా దేశం అఖండంగా ఉండాలని తపించిన రాజీవ్ గాంధీ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పొయ్యారన్నారు. ప్రధాని కావడానికి అవకాశం ఉండి పదవి త్యాగం చేసిన వ్యక్తి సోనియాగాంధీతో పాటు మోతిలాల్ నెహ్రు నుండి ఇప్పటివరకు ఎంతో మంది ,పదవి, ఆస్తులు ,ప్రాణాలు త్యాగం చేశారని తెలిపారు. దేవుళ్లు, మతాలు, అక్షింతల పేరిట మత రాజకీయాలకు పాల్పడుతూ ప్రజలను రెచ్చగొట్టి మోడీ మళ్ళీ అధికారంలోకి వచ్చారు తప్పితే 10 ఏళ్లు అధికారంలో ఉండి ఏమి చెయ్యలేదన్నారు.

## నిరుద్యోగులపై గత పాలకులది సవతితల్లి ప్రేమ

రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** బిఆర్ఎస్ పాలనలో నిరుద్యోగులపై పాలకులు సవతితల్లి ప్రేమ చూపించారని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు.బుధవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ఉపాధి మరియు శిక్షణశాఖ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ 216 సీట్లతో ఐటిఐ కళాశాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం యువత పెద్ద ఎత్తున తెలంగాణ ఉద్యమంలో పాల్గొంటే వారికి న్యాయం చేసేలా బిఆర్ఎస్ ప్రభుత్వం వ్యవహరించలేదన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారం వదులుకునే నాటికి రాష్ట్రంలో వివిధ శాఖల్లో 2లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఆరునెలల్లోనే 30 వేల ఉద్యోగాల నియమాకాలు జరిపి నియామక పత్రాలు అందచేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు పూర్తి న్యాయం జరిగేలా ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం వారికి నైపుణ్యాలలో శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రాష్ట్రంలో 65 ప్రభుత్వ,225 ప్రైవేట్ ఐటిఐలు విద్యార్థులకు ఇంజనీరింగ్,నాన్ ఇంజనీరింగ్‌లో 32 కోర్సుల ద్వారా శిక్షణను అందిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 76,900 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులకు శిక్షణ అయిపోగానే ఉపాధి అందేలా టాటా కంపెనీ, రాష్ట్ర ప్రభుత్వ కలసి సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించేందుకు అన్నిరకాల శిక్షణలను అందుబాటులోకి తెచ్చామన్నారు. విద్యార్థులకు శిక్షణ కాలంలో రూ.8వేల నుండి 11,500 వరకు స్కాలర్‌షిప్ అందించడం జరుగుతుందని,శిక్షణ పూర్తి కాగానే అప్రెంటీస్ చేయించి పరిశ్రమల వారితో జాబ్‌మేళా నిర్వహించి అపాయింట్‌మెంట్ ఆర్డర్లను అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.2324 కోట్ల వ్యయంతో ఐటిఐలను ఆధునీకరించి టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ సహకారంతో ఆధునీకరణ, వర్క్‌షాపుల నిర్వహణకు ఏర్పాటు చేశామన్నారు. దీనిలో భాగంగానే హుజూర్‌నగర్‌లో ఫిట్టర్, ఎలక్ట్రిషియన్, డ్రాఫ్ట్‌మెన్‌సివిల్ రెండు సంవత్సరాల కోర్సులను మెకానిక్ డిజిల్,వెల్డర్ ఒక సంవత్సరం కోర్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఐదు ఎకరాల స్థలంలో రూ.40 కోట్లతో ఐటిఐ కళాశాల భవన నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపి కందూరు రఘువీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ గెల్లి అర్చనరవి,జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, అడిషనల్ కలెక్టర్ ప్రియాంక,ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, ఎంపిపి గూడెపు శ్రీనివాస్, రైల్వే బోర్డు మెంబర్ యరగాని నాగన్నగౌడ్, సీనియర్ నాయకులు సాముల శివారెడ్డి, శంకర్‌నాయక్, దొంగరి వెంకటేశ్వర్లు,అరుణ్‌కుమార్‌దేశ్‌ముఖ్, వీరారెడ్డి పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ అరెస్టు

రూ.15 లక్షల గంజాయి స్వాధీనం




**ప్రజాపక్షం/హైదరాబాద్:** అంతరాష్ట్ర గంజాయి స్మగర్లర్‌ను రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రూ.15 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. ఒడిశా నుంచి సికింద్రాబాద్ మీదుగా ఢిల్లీకి గంజాయిని తరలిస్తున్నట్లుగా దర్యాప్తులో తేలింది. ఒడిశాలోని గజపతి జిల్లాకు చెందిన దిలీప్‌కుమార్ (34), తపన్ (30), విబిజయ్ (31)లు ఒక ముఠాగా ఏర్పడ్డారు. వీరు ఒడిశా నుంచి ఢిల్లీకి గంజాయిని సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం దిలీప్‌కుమార్ ఆరు బస్తాల్లో రూ.60 కిలోల ఎండు గంజాయిని సికింద్రాబాద్ వరకు విశాఖ ఎక్స్‌ప్రెస్ జనరల్ కోచ్‌లో పెట్టాడు. విశ్వసనీయ సమాచారం మేరకు సికింద్రాబాద్ ఆర్‌పిఎస్ హెచ్‌ఓం సాయిశ్వర్ గౌడ్, సిబ్బంది పి.సీతారాములు, ఆశీర్వాదం, కె.చంద్రశేఖర్‌లు తనిఖీ చేసి పట్టుకున్నారు. ఈ క్రమంలోనే దిలీప్‌కుమార్‌ను అరెస్టు చేయగా మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు.

## ఆర్‌టిసి కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి



**ప్రజాపక్షం /హైదరాబద్ :** ఆర్‌టిసిఅధికారులు కుట్రలు, కుయుక్తులు పన్ని కార్మికుల హక్కులను కాలరాయాలని చూస్తే భవిష్యత్తులో పోరాటాలు మరింత ఉధృతం చేస్తామని తెలంగాణ ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ నేతలు ప్రభుత్వాన్ని, యాజమాన్యాన్ని హెచ్చరించారు. ఆర్‌టిసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఎంజిబిఎస్ మహాత్మాగాంధీ విగ్రహం వద్ద తలపెట్టిన మౌన ప్రదర్శనను నిర్వహించారు. తాము అనుమతి తీసుకునే ప్రయాణికులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా శాంతియుతంగా చేపట్టిన తమ నిరసన కార్యక్రమాన్ని భగ్నం చేయడానికి ఎండితో పాటు యాజమాన్యం కుట్ర పన్నిందని ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ఎస్. బాబు, ప్రధాన కార్యదర్శి ఇ. వెంకన్నలు మండిపడ్డారు. నిరసన తెలియజేసే హక్కు కార్మికులకు, కార్మిక సంఘాలకు ఉందని, దానిని భగ్నం చేసే హక్కు ప్రభుత్వాలకు, యాజమాన్యాలకు లేదని వారు ధ్వజమెత్తారు. మహాత్మాగాంధీ విగ్రహం వద్ద శాంతియుత వాతావరణంలో నిరసన తెలియజేయటానికి మౌనప్రదర్శన చేస్తున్నామని ఈడి, ఎస్టేట్ ఆఫీసర్ లకు అనుమతికి లేఖలు ఇవ్వగా, . ప్రయాణీకులకు ఇబ్బంది లేకుండా మహాత్మాగాంధీ విగ్రహం వద్ద మౌన ప్రదర్శన చేసుకోవచ్చని యూనియనుకు తెలిపిన యాజమాన్యం మరోపక్క మౌనప్రదర్శనకు అనుమతి లేదంటూ పోలీసులను, సెక్యూరిటీ సిబ్బందిని ఉసి గొల్పటం ఏమిటని వారు ప్రశ్నించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించటంలో ప్రభుత్వానికి, యాజమాన్యానికి చిత్తశుద్ధి లేదని వారు మండిపడ్డారు. మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేయటానికి కూడా పోలీసులు అభ్యంతరం చెప్పటం ఏమిటని వారు నిలదీశారు. గాంధీ విగ్రహానికి పూలమాల వేయొద్దని పోలీసులు అనడం వల్ల మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా, లేక నియంతృత్వంలో ఉన్నామా అని వారు ప్రశ్నించారు. గత ప్రభుత్వ నియంతృత్వ పోకడలు ఈ ప్రభుత్వం కూడా అనుసరిస్తోందని వారు ఆవేదన వ్యక్తంచేశారు. కార్మికవర్గాన్ని అణచివేయాలని చూస్తే అది ప్రభంజనమై వెల్లువెత్తుతుందని హెచ్చరించారు. తమ సమస్యలను వివరించేందుకు హైదరాబాద్ జోన్ ఈడిని కలిస్తే బస్సు భవన్‌లో ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ యూనియన్ నేతలతో కలిసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపరన్నారు. దీంతో తాము అక్కడికి వెళ్లితే ఆయన అందుబాటులో లేకపోగా, వందలాది మంది పోలీసులను మోహరించి తమను అడ్డుకున్నారన్నారు. తమ సమస్యలను పరిష్కరించకుంటే మరింత పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని వారు యాజమాన్యాన్ని హెచ్చరించారు.

## కటకటాలలోకి కీచక ఎస్ఐ

మహిళ కానిస్టేబుల్ పై ఎస్సై లైంగిక దాడి

సర్వీస్ రివాల్వార్ తో బెదిరించి అత్యాచారం

ఎస్ఐ అరెస్టు : 14 రోజులు రిమాండ్



**ప్రజాపక్షం / జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి / కాళేశ్వరం:** ప్రజలకు రక్షణ కల్పించవలసిన పోలీసులే భక్షకబటులై ఓ ఖాకీ చకుడు ఓమహిళ కానిస్టేబుల్ పై సర్వీస్ రివాల్వార్‌తో చెదిరించి లైంగికంగా దాడి చేసి చివరకు కటకటాల పాలైన సంఘటన జయ శంకర్ భూపాలాపల్లి జిల్లా కాళేశ్వరం పోలీసు స్టేషన్‌లో వెలుగు చూసింది. వివరాల్లోకి వెలితే కాళేశ్వరం పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ గా విధులు నిర్వహిస్తున్న భవాని సేన్ తన పోలీసు స్టేషన్‌లో మహిళ కానిస్టేబుల్ గా ఉద్యోగం చేస్తున్న ఓమహిళపై కాని స్టేబుల్ పై తన సర్వీస్ రివాల్వార్‌తో బెదిరించి అత్యచారానికి పాల్పడిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. కాళేశ్వరం ఎస్సై భవాని సేన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళ కానిస్టేబుల్ పై హత్యాచారం చేశాడు. చేయడమే కాకుండా ఈ విషయం ఎవరికైన చెబితే నిన్ను చంపేస్తానని ఆమెను సదరు ఎస్సై బెదిరించినట్లు ఆమె ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కోంది.ఈ విధంగా బెదిరించి చాలా సార్లు తనపై లైంగికంగా వేదింపులు చేశాడని తెలిపింది.ఈ వేదింపులు తట్టుకోలేక జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేసింది.మహిళ హెడ్ కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు కాళేశ్వరం పోలీసు స్టేషన్‌లో యూఎస్ 449,376(2)ఎ (బి)324,506 ఐపిసి కింద కేసునమోదు చేశారు.ఈ కేసు దర్యాప్తు అధికారిగా భూపాలపల్లి డిఎస్పీ సంపత్ రావు జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే విచారణ అధికారి నియమించి విచారణ జరిపించారు.ఆరోపణలు నిజమని తేలడంతో బుధ వారం ఎస్సై భవాని సేన్ ను విచారణ చేపట్టిన అనంతరం తన సర్వీస్ రివాల్వార్‌ను స్వాదీన పరుచుకొని అతన్ని అరెస్టు చేసి భూపాలపల్లి కోర్టులో హాజరుపరిచారు.అదే విధంగా గతంలో కూడా భవాని సేన్ మరో ముగ్గురి మహిళల పై తన హోదాను అడ్డుపెట్టుకొని లైగిక దాడులకు పాల్పడినట్లు ఆరోపన రావడంతో ఎలాంటి విచారణ లేకుండానే భారత రాజ్యంగం లోని ఆర్టికల్ 311 ప్రకారం అతన్ని సర్వీసు నుండి శాశ్వతంగా తొలగించినట్లు మల్టీజోన్ ఐజీ ఏవి రంగనాథ్ వెల్లడించారు. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది.ఈ విషయం పై రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సీరియస్‌గా స్పందించారు.ఈ కీచక ఎస్సై పర్వం గురించి మీడియా లో వెలుగు చూసిన కథనాలపై సిరియస్‌గా స్పందించిన రేవంత్ రెడ్డి రాజ్యాంగం 311 ఆర్టికల్ ద్వారా మహిళ కానిస్టేబుల్ పై అత్యచారానికి పాల్పడిన ఎస్సై భవాని సేన్ ను సర్వీస్ నుండి రిమూవ్ చూయాలని ఉన్నతా అధికారులను ఆదేశించారు. అనంతరం మహిళ కానిస్టేబుల్ పై అత్యాచారం చేసిన ఎస్సై భవాని సేన్ విషయంలో మంత్రి శ్రీధర్‌బాబు తన నియోజకవర్గంలో తప్పు చేసిన ఎంతటి వారినైన ఉపేక్షించేదిలేదని స్పష్టం చేశారు.

## తెలంగాణ యువత అభ్యున్నతికి సహకరించాలి

కేంద్ర మంత్రి జయంత్‌సింగ్ చౌదరిని కోరిన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం /హైదరాబద్:** తెలంగాణ రాష్ట్ర యువత అభ్యున్నతికి సహకరించాలని, నిరుద్యోగ యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రి జయంత్‌సింగ్ చౌదరిని తెలంగాణ రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, జయంత్ సింగ్ చౌదరిలను మంత్రి పొన్నం ప్రభాకర్ ఢిల్లీలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.15వ లోక్‌సభలో మంత్రి పొన్నం ప్రభాకర్ సహచర ఎంపిగా ఉన్న జయంత్ సింగ్ చౌదరి తెలంగాణ ఉద్యమానికి సహకరించారని మంత్రి పొన్నం ప్రభాకర్ గుర్తు చేసుకుని ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. ప్రస్తుతం జయంత్‌సింగ్ చౌదరి కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్ ఎంటర్‌ప్రినర్‌షిప్ మంత్రిగా ఉండడం హర్షణీయమన్నారు. అదేవిధంగా రెండవ సారి కేంద్ర మంత్రి బాధ్యతలు తీసుకున్న కిషన్‌రెడ్డిని కూడా కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నిధులను కేంద్ర ప్రభుత్వం త్వరితగతిన విడుదల చేసేందుకు తన వంతు సహకారాన్ని అందించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

**శ్రీ జోగులాంబా బాలబ్రహ్మేశ్వర స్వామి దేవస్థానము**
అలంపూరు గ్రా. & మం. జోగులాంబ గద్వాల జిల్లా.
Lr.No.11/EO/SJBBSGD/2023, ప్రకటన తేది: 18-06-2024
జోగులాంబ గద్వాల జిల్లా, అలంపూరు శ్రీ జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి దేవస్థానము నందు ఆఫీస్ సబార్డినేట్ / స్వీపరుగా విధులు నిర్వహిస్తున్న శ్రీ ఈ. ఈశ్వర్‌రెడ్డి గారు తేది: 19-10-2023 నుండి ఎలాంటి సెలవు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు అగుచున్న విషయములో స్పీడు పోస్టు ద్వారా ఒక సారి, నేరుగా రెండు సార్లు మీకు కార్యాలయపు మెమోలు పంపించగా, వాటిని మీరు తీసుకున్నప్పటికీ మీ నుండి నేటి వరకూ ఈ అంశమై ఎలాంటి సెలవు పత్రము కానీ, జవాబు కానీ, వివరణ కానీ అందియుండలేదు. అందులకు గాను ఈ ప్రకటన జారీ చేసిన నాటి నుండి 15 రోజుల లోగా తగిన ఆధారములతో హాజరు కాగలరు. లేనిచో సర్వీస్ రూల్స్ ప్రకారం మిమ్ములను విధుల నుండి తొలగించబడునని తెలియచేయనైనది.
DIPR R.O. No. : 833-PP/CL/ADVT/1/2024-25 Date: 19-06-2024 సం/- కార్యనిర్వహణాధికారి

ప్రజాపక్షం
గురువారం, జూన్ 20

# ఉచిత ప్రదానాలు-శిరోభారం

రాజకీయ పార్టీలు – అవి జాతీయ పార్టీలైనా, ప్రాంతీయ పార్టీలైనా అధికారం కోసం వెంపర్లాటలో ఇష్టానుసారం ప్రజలకు ఉచిత ప్రదానాలు వాగ్దానం చేస్తున్నాయి. అధికారంలోకి వచ్చిన పార్టీ తమ వాగ్దానాలను అమలు చేయలేక సతమతమవుతున్నది. రాష్ట్ర పార్టీలు ప్రకటించే ఉచితాలను 'రేవడీ' (మిఠాయిలు)లతో పోల్చి హేళనచేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎన్నెన్ని గ్యారంటీలు ప్రకటించారో కదా! 2019 ఎన్నికలకు ముందే 'కిసాన్ సమ్మాన్' కింద చిన్న, సన్నకారు రైతులకు ఏటా రూ. 6వేలు మూడు దఫాల్లో ఉచిత సహాయ పథకం ప్రకటించి కొనసాగిస్తున్నారు. రైతులు ఆరుగాలం శ్రమించి, ఆటుపోట్లు తట్టుకుని పండించిన పంటలకు కనీస మద్దతు ధరకు లీగల్ గ్యారంటీ కల్పించటానికి నిరాకరిస్తున్నారు. వైరుధ్యానికి ఇది ఒక ఉదాహరణ మాత్రమే. కేంద్రప్రభుత్వం పారిశ్రామిక సబ్సిడీలు, రాయితీల పేరుతో, అప్పుల రద్దు రూపేణా లక్షల కోట్లు వెచ్చిస్తున్నది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద మండుటెండల్లో కాయకష్టంచేసే శ్రామికులకు వేతన చెల్లింపునకు బడ్జెట్ కేటాయింపును ఏటికేటా కోతపెడుతున్నది. మరోవైపున, తమ సంస్కరణలను అమలుచేసే రాష్ట్రాలకు అప్పు తెచ్చుకునే పరిమితి పెంచుతున్నది. ఎఫ్ఆర్‌బిఎంకు లోబడి రాష్ట్రాలు మార్కెట్ నుండి ఏటా పొందే అప్పులను, ఈ అదనపు అప్పును అసలు ఫాయిదాలతో కిస్తీలవారీ తిరిగి చెల్లించటానికి వాటి వద్ద వనరులేవీ? కొత్త అప్పులతో పాత అప్పులు తీర్చే విషవలయంలో చిక్కుకుంటున్నాయి.

ఎక్కడిదాకా ఎందుకు. మన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంకట పరిస్థితిని సూక్ష్మంగా పరిశీలిస్తే సమస్య తీవ్రత అర్థమవుతుంది. గత టిఆర్ఎస్/బిఆర్ఎస్ ప్రభుత్వం బడ్జెట్‌లోపల, వెలుపల విపరీతంగా అప్పులు చేసింది. వ్యవసాయాన్ని ఉద్ధరించే నిమిత్తం రైతులకు రుణమాఫీ, చిన్నపెద్ద వ్యత్యాసం లేకుండా ఎకరాకు రూ.10వేల చొప్పున రైతు భరోసా, రైతు భీమా, డబుల్ బెడ్‌రూం ఇళ్ల, ఆటుతర్వాత హుజూరాబాద్ ఉపఎన్నిక సమయంలో దళిత బంధు ఇత్యాది ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు ప్రకటించింది. ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టుకే దాదాపు రూ.1లక్షకోట్లు అప్పు చేసింది. తొమ్మిదేళ్ల పాలనలో అప్పులు రూ.7లక్షల కోట్లు దాటాయి. వాగ్దానాలు అరకొరగా అమలు జరిగాయి. ఆ పార్టీని గద్దెదించనున్న కాంగ్రెస్ పార్టీ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు అదనంగా 6 గ్యారంటీలు ఇచ్చింది. రైతులకు రూ. 2 లక్షల వరకు వ్యవసాయరుణాలు రద్దుచేస్తామంది. ఇప్పుడు వనరులు కోసం గుంజాటన పడుతోంది. సంక్షేమ పథకాలు వద్దని, తప్పని ఎవరూ అనరు. సామాజికార్థికంగా వెనుకబడి ఉన్న తరగతులను వృద్ధిలోకి తెచ్చేందుకు, రైతులు ప్రకృతి వైపరీత్యాలకు గురైనప్పుడు వారిని ఉదారంగా ఆదుకునేందుకు, బడుగు బలహీన వర్గాల బాలల విద్యాభివృద్ధి, వైద్యం వగైరాలకు ప్రభుత్వ చేయూత తప్పనిసరి. అదే నిజమైన సంక్షేమం.

ఆగస్టు 15 నాటికల్లా రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ అమలుచేస్తానని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి బలంగా ప్రతిజ్ఞ చేశారు. రూ.25.000–30.000 కోట్లు కావాలని అంచనా. వనరుల సమీకరణకై అప్పులు, భూముల తనఖా వగైరా మార్గాంతరాలు అన్వేషిస్తున్నారు. ఇంతలో వ్యవసాయ పెట్టుబడి పథకం రైతు భరోసా కింద చెల్లించాల్సిన వ్యవసాయీతరుణం మెడమీద కూర్చున్నది. మరోవైపున ప్రతినెల కొంత అప్పు, కొంత సొంత వనరులు కలిపి పాత అప్పుల కిస్తీలు చెల్లిస్తున్నది ప్రభుత్వం. గత 6 నెలల్లో రోజూ రూ.191 కోట్ల చొప్పున జూన్ 17 వరకు రూ. 38,400 కోట్లు అప్పుచెల్లించింది. అందులో అప్పు తెచ్చిన సొమ్ము రూ. 25.118 కోట్లు. ఇక రోజువారీ పరిపాలనా వ్యయంతో పాటు అభివృద్ధి పనులకు ధనం ఎక్కడనుండి వస్తుంది. ఎంత వస్తుంది. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ఈ విషయంలో పెద్దన్న స్థితిలో ఉంది.

ఏ రాష్ట్రమైనా, ఏ పార్టీ అధికారంలో ఉన్నా, విచక్షణారహితమైన ఉచిత వాగ్దానాలతో ప్రజలను భ్రమల్లో ముంచి అధికారం నిలుపుకోవాలని, లేక అధికారం కోసం పోటీపడినా అప్పుల భారంతో మునిగేది ఆ రాష్ట్ర ప్రజలే. మతం, కుల విభజనతో పాటు, సంక్షేమంపేరుతో అభివృద్ధిని గాలికి వదిలేస్తే మోసపోయేంత అమాయకులుకామని ప్రజలు గుణపాఠం నేర్పుతున్నారు. అందువల్ల ఉచితాలకు హేతుబద్ధప్రాతిపదికకై అన్ని రాజకీయపార్టీల మధ్య ఒక ఏకీభావాన్ని తీసుకురావటం, జవాబుదారీతనం నెలకొల్పే మార్గాలు అన్వేషించాలి. లేకపోతే మన రాష్ట్రాలు శ్రీలంక బాటలో ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతాయన్న హెచ్చరికలు నిజమవుతాయి. చేతులు కాలేక ఆకులు పట్టుకున్న ప్రయోజనముండదు.

# ఇది బహుజనుల రాజకీయ విజయం



డా.కత్తి పద్మారావు

2024 ఎన్నికలు అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తికే పట్టం కట్టాయి అని అనక తప్పదు. మోదీ ప్రభుత్వం మునుపటిలా గానికి, రిజర్వేషన్లకు వ్యతిరేకంగా నడిచే అవకాశం లేదు. భారత రాజ్యాంగానికి ఎవరైనా తలవంచాల్సిందే. దళిత, బహుజన, మైనార్టీల పోరాట స్ఫూర్తి ఈ ఎన్నికల్లో వెల్లివిరిసింది. మహాత్మా పూలే, అంబేద్కర్ ఆశయాలతో దేశంలో బహు సంఖ్యాకులు చైతన్యంతో ఉన్నారని అర్థమవుతోంది. రామ మందిర నినాదానికి, భారత రాజ్యాంగ పరిరక్షణ నినాదానికి జరిగిన సమరంలో రాజ్యాంగమే విజేతగా నిలబడిన సందర్భం మన ముందుకొచ్చింది. ప్రభుత్వంతో సమఉజ్జీలుగా ఉన్న ప్రతిపక్షం భారత రాజ్యాంగాన్ని రక్షించడంలో కృతకృత్యం అవుతుందని, ఈ రాజ్యాంగ పోరాటాన్ని మరింత ముందుకు కొనసాగిస్తుందని ఆశిద్దాం. భారతదేశంలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్న 2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాలు జూన్ 4వ తేదీ అత్యంత ఉత్కంఠ భరితమైన వాతావారణంలో వెలువడ్డాయి. 2019లో లోక్సభ ఎన్నికల్లో 303 సీట్లు సంపాదించిన బిజెపి 2004 ఎన్నికల్లో 241 సీట్లు మాత్రమే సాధించగలిగింది. 2019లో 52 సీట్లు మాత్రమే సాధించుకున్న కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో 99 సీట్లు సాధించగలిగింది. బీజేపీకి 2019 ఎన్నికల కంటే 60 సీట్లు తగ్గాయి. ఇకపోతే భారత రాజ్యాంగ సూత్రాల పరిరక్షణలోనూ, హేతువాద భావజాల ప్రచారంలో ముందున్న తమిళనాడు పుదుచ్చేరి ఎంపీ స్థానంతో సహా మొత్తం 40 స్థానాలను కైవసం చేసుకుని విజయకేతనం ఎగురవేసింది. తమిళనాడులో సామాజిక న్యాయానికి అధునాతన ధర్మానికి, ప్రజలు పట్టం కట్టారు. నరేంద్ర మోదీ పనిగట్టుకొని సనాతన సంప్రదాయాలను ప్రచారం చేశారు. రాముడిని దక్షిణాది రాష్ట్రాలకు తరలించాలని ప్రయత్నం చేశారు. కానీ లౌకికవాద భావజాలానికి ప్రజలు పట్టం కట్టారు. దీంతో బిజెపి, అన్నాడీఎంకె ఈ ఎన్నికల్లో బోణీ కూడా కొట్టలేకపోవడం గమనార్హం. రామమందిరంపై అతి ప్రచారంతో దెబ్బ ఈ ఎన్నికల ఫలితాలు భారతదేశానికే దిక్సూచిగా వున్నాయి. బిజెపి వైఫల్యానికి ప్రధాన కారణం ముఖ్యమైనది అయోధ్య రామ మందిరం. రామమందిర నిర్మాణం కొందరి విశ్వాసానికి సంబంధించినపుడు ఆ విశ్వాసాన్ని భారతీయులందరి మీద రుద్దాలనీ చూడటం భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. నిజానికి ఉత్తరప్రదేశ్లో ఘోర పరాజయానికి గురికావటానికి కారణం ఈ రామమందిర నిర్మాణమే. దళిత బహుజనుల నాయకుల స్ఫూర్తితో నిర్మించిన అంబేద్కర్ పార్క్ యుపిలోనే వుంది. ఇవన్నీ మనకు స్ఫూర్తివంతమైనవి. కాని వాటిని రాజకీయ ప్రచారానికి వాడుకున్నారు. రామమందిరం కూడా అలాంటిదే. దానిని కళాత్మకమైన దేవాలయంగా చూస్తే ఎవరికి ఏ ఇబ్బంది ఉండదు కానీ ఆ రామమందిరాన్నే బిజెపి ప్రచారాస్త్రంగా తీసుకోవడం వలన ఆ అంశం నరేంద్ర మోడీ నాయకత్వం వహిస్తున్న బిజెపి ఓటమికి దారి తీసింది.

### చావు దెబ్బ తీసిన యుపి

యువి, దేశంలోనే అత్యధిక సంఖ్యలో (80) లోక్ సభ స్థానా లు కలిగిన రాష్ట్రం. దేశంలోని అత్యంత ముఖ్యమైన రాష్ట్రాలలోఒకటిగా వుంది. ఈ రాష్ట్రంలో అత్యధిక నియోజక వర్గాలు గెలుపొందిన కూటమి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలుగుతుంది. ఈ ఎన్నికల్లో ఎస్పీ 37, కాంగ్రెస్ 6, స్థానాల్లో విజయం సాధించాయి. ఈ విజయం ఇండియా కూటమికి బాగా కలిసొచ్చింది. ఇకపోతే నరేంద్ర మోడీ భారతదేశంలోని ముఖ్యమైన దేవాలయాలన్నీ తిరిగినప్పటికీ ఫలితం లేకపోయింది. బీఎస్పీ ఓటు బ్యాంక్ కాంగ్రెస్, ఎస్పీకి బదిలీ కావడం చివరికి బిజెపినే దెబ్బతీసింది. జాట్లు, రాజ్పుత్లు, క్షత్రియులు, బ్రాహ్మణులు సైతం బిజెపికి, దూరం కాగా ఆ రాష్ట్రంలో దాదాపు 20% దాకా ఉన్న ముస్లిం ఓటర్లు గంపగుత్తగా కాంగ్రెస్ఎస్పీకూటమికి ఓటెయ్యడం గమనార్హం. జనాభా నిష్పత్తిని బట్టి సీట్లు ఇవ్వాలని డా. బి. ఆర్. అంబేద్కర్ ఎప్పుడో చెప్పారు. బిజెపి రాజకీయాల్లో మతాధిపత్యం, కులాధిపత్యం, వర్ణాధిపత్యం, పితృ ఆధిపత్యం ఇవన్నీ కనిపించాయి.

### రిజర్వేషన్లపై చేయి వేస్తే...

నిజానికి డా.బి.ఆర్.అంబేద్కర్ భారత రాజ్యాంగంలో ఏ రిజర్వేషన్లు కల్పించారో ఆ రిజర్వేషన్లను రద్దు చేస్తామన్న బిజెపి వాక్కు దళిత బహుజనులలో అభద్రతను కల్పించింది. అలాగే యువత ఆశలపై నీళ్ళు చల్లిన అగ్నవీర్ పథకం తీవ్ర రూపం దాల్చింది. నిరుద్యోగ సమస్య, ద్రవ్యోల్బణం, ఫిరాయింపులకు ప్రోత్సాహం వంటివి బిజెపిని దెబ్బతీసాయి. ప్రతిపక్షాలపై ప్రధాని మోదీ చేసిన తీవ్ర వ్యాఖ్యలు కూడా మొదటికే మోసం తెచ్చాయి. రాజస్థాన్లో ఎన్నికల ప్రచారసభలో మోదీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి ఇది బహుజనుల రాజకీయ విజయం. వస్తే దేశ ప్రజల సంపదను ముస్లింలకు పంచేస్తుందనీ, అర్బన్ నక్సల్ మనస్తత్వం కలిగిన ఆ పార్టీ నాయకులు మన తల్లులు, సోదరీమణుల మెడలోని మంగళ సూత్రాలను వదలరనీ మోదీ వ్యాఖ్యానించారు. నిజానికి ఒక మత ఆవేశం గాని, మతోన్మాదం కానీ, భారతదేశాన్ని పరిపాలించలేదు. అనే విషయం ఈ ఎన్నికలు నిరూపించాయి. భారతదేశం పునర్ నిర్మించాలంటే తప్పకుండా అంబేద్కర్ మార్గాన్ని అనుసరించాల్సిందే.

### రాజ్యాంగ పరిరక్షణ జరిగింది !

భారత రాజ్యాంగాన్ని రక్షించండి అనే నినాదాన్ని ముఖ్యంగా మల్లి ఖార్జున్ ఖర్గే, రాహుల్గాంధీ భుజాన వేసుకుని దేశమంతా ప్రచారం చేయడం వల్ల మోడీ యొక్క ప్రభావం భారతదేశ ప్రజలకు తెలిసింది. బిహార్ లో 12 సీట్లు సాధించిన నితీష్ కుమార్, ఆంధ్రప్రదేశ్లో 16 సీట్లు సాధించిన చంద్రబాబు జాతీయ రాజకీయాల్లో కీలకమయ్యారు. వారు మోదీ నాయకత్వంలోని ఎన్డీఏని సమర్థించారు. మొదట మోదీకి వ్యతిరేకంగా ఇండియా కూటమిని రూపొందించిన వారిలో నితీష్ కుమార్ ముఖ్యుడు. కానీ ఆయన బీసీ కులగణన తీర్మానాన్ని బిజెపి అంగీకరిస్తుందా? అనేది ప్రశ్న. అలానే ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హెూదాని పార్లమెంటులో నిరాకరించిన బిజెపితో చంద్రబాబు చివరిదాకా మనుగడ అనేది ప్రశ్నార్థకం?! ప్రభుత్వంతో సమఉజ్జీగా ఉన్న ప్రతిపక్షంభారత రాజ్యాంగాన్ని రక్షించడంలో కృతకృత్యం అవుతుందని, ఈ రాజ్యాంగ పోరాటాన్ని మరింత ముందుకు కొనసాగిస్తుందని ఆశిద్దాం.

''దారి దీపం'' సౌజన్యంతో

# సంఘర్షణలలో లైంగికహింసను ఆపాలి

ప్రతీ సంవత్సరం జూన్ 19వ తేదీ నాడు 'అంతర్జాతీయ సంఘర్షణ సంబంధిత లైంగిక హింస నిర్మూలనా దినోత్సవం' గా జరుపుకోవాలని ఐక్యరాజ్య సమితి 19 జూన్ 2015 నాడు తీర్మానించింది. ఇది లైంగికహింస, తీవ్రవాదం, అంతర్జాతీయ వ్యవస్థీకృత నేరాల మధ్య సంబంధాన్ని పరిష్కరించడానికి తీసుకున్న మొదటి అడుగు.

ప్రపంచవ్యాప్తంగా సంఘర్షణ సంబంధిత లైంగిక హింసలో బాధితులను గౌరవించడం మరియు ఈ నేరాల నిర్మూలనకు ధైర్యంగా నిలబడి ప్రాణాలు కోల్పోయిన వారందరికీ నివాళులర్పించడం ఈ రోజు ప్రధాన లక్ష్యం. ఈ రోజు ప్రపంచమంతటా యుద్ధాలు మరియు సంఘర్షణల సమయంలో లైంగిక హింస యొక్క తీవ్రమైన సమస్య గురించి ప్రజలకు తెలియజేయడం. ఈ భయంకరమైన నేరాలను ఆపడానికి మార్గాలను కనుగొనడంపై కూడా ఇది దృష్టి పెడుతుంది. ఈ సంవత్సర అంతర్జాతీయ దినోత్సవం సంఘర్షణలో లైంగిక హింస నిర్మూలన కోసం ఆరోగ్య సంరక్షణపై దృష్టి సారిస్తుంది. లైంగిక హింస నుండి బయటపడిన వారితో సహా సంఘర్షణలో గాయపడిన వారందరికీ భద్రత మరియు వైద్య సౌకర్యాలు అందుబాటులోకి తేవడంపై దృష్టి పెడుతుంది.

### నివేదికలలో నిజాలు:

ఈ వింతైన నేరం ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతోంది. గత సంవత్సరం సంఘర్షణలలో లైంగిక హింసకు సంబంధించిన నేరస్థులు స్వేచ్ఛగా తిరుగుతున్నారు. కాని ఈ హింసలో ప్రాణాలతో బయటపడిన వారి జీవితమంతా కోలుకోవడంలోనే గడిపారు.

సంఘర్షణ సంబంధిత లైంగిక హింసకు గురైన వారి ఖచ్చితమైన సంఖ్య తెలియదు. బాధితులు ముందుకు రాకపోవడమే ఇందుకు కారణం. ఐక్య రాజ్యసమితి భద్రతా మండలికి అందించిన నివేదిక ప్రకారం గత యేడాది యుద్ధాల దేశాలలో 3688 అత్యాచార లేదా లైంగిక హింస ఘటనలు జరిగాయి. ఇది ముందరి సంవత్సరంతో పోలిస్తే 50 శాతం ఎక్కువ. పాలస్తీనా, సూడాన్, ఉక్రెయిన్, హైతీ, మయన్మార్, కాంగోలో సంఘటనలు చూస్తే నమోదు చేయబడిన కేసుల పెరుగుదల ముఖ్యంగా ఆందోళనకరంగా ఉంది. ఈ సంఘటనలలో 95% మహిళలు లేదా బాలికలకు, 5% పురుషులు లేదా బాలురకు సంబంధించినవి. గాజాలో సంఘర్షణ సంబంధిత లైంగిక హింస కనీసం మూడు ప్రదేశాలలో జరిగిందని బందీలుగా ఉన్న వ్యక్తులపై లైంగిక హింసకు పాల్పడినట్లు విశ్వసించడానికి సహేతుకమైన ఆధారాలు ఉన్నాయని నివేదికలు తెలుపుతున్నాయి. హైతీలోని సాయుధ సమూహాలు ఆదాయాన్ని ఆర్జించడం కోసం లైంగిక హింసను ఉపయోగించు కున్నారు.



### వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉండాలి:

సంఘర్షణ సంబంధిత లైంగిక హింస అనేది దాడి మరియు అణచివేత యొక్క వినాశకరమైన రూపం. సంఘర్షణ సంబంధిత లైంగిక హింస అనేది అత్యాచారం, లైంగిక బానిసత్వం, బలవంతపు వ్యభిచారం, బలవంత గర్భం, బలవంతం వివాహం మరియు స్త్రీలు, పురుషులు, బాలికలు లేదా అబ్బాయిలపై జరిగే లైంగిక హింసకు సంబంధించిన రూపాన్ని సూచిస్తుంది. ఈ హింస సామాజిక ఆకృతిని నాశనం చేస్తుంది. సంఘర్షణల ఫలితంగా సుమారు 11.7 కోట్ల మంది ప్రజలు తమ ఇళ్లను వదిలి పారిపోయారు. ఆయా దేశాలు అంతర్జాతీయ చట్టాలను పట్టించుకోకపోవడం, ఆయుధాల విస్తరణ మరియు పెరుగుతున్న సైనికీకరణ వలన లైంగిక హింస పెరిగింది. ఆందోళన కలిగించే విషయం ఏంటంటే సంఘర్షణ సంబంధిత లైంగిక హింస నుండి బయటపడిన వారిలో అత్యధికులు వారికి సాంస్కృతిక కళంకం కలుగుతుందని ముందుకు రావడం లేదు. ప్రాణాలతో బయటపడిన వారు తరువాత కాలంలో శారీరక, లైంగిక పునరుత్పత్తి, మానసిక అనారోగ్యాలతో బాధపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. లైంగిక హింస, అత్యాచారం వలన బాధితులు గర్భాన్ని దాల్చవచ్చు. వారికి తక్షణ ఆరోగ్య సంరక్షణ అవసరం. తగిన సంరక్షణను పొందలేకపోతే వారు ఒంటరిగా ఉండే ప్రమాదం ఉంది. వారందరికీ వైద్య సదుపాయాల అందించడానికి ఆసుపత్రులు అందుబాటులో ఉండాలి. కానీ ఆసుపత్రులు, ఆరోగ్య కార్యకర్తలపై దాడులు వలన ప్రాణాలతో బయటపడిన వారి వైద్య సంరక్షణకు విఘాతం కలిగిస్తుంది. ఆరోగ్య హక్కు సవాళ్లను ఎదుర్కొంటున్నది. సంఘర్షణ ప్రాంతాలలో ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలపై దాడులు గర్భిణులు, బాలింతలు, తల్లులకు వినాశకరమైన పరిణామాలను కలిగిస్తాయి

### ప్రభావాలు:

లైంగిక హింస మహిళల జీవనోపాధిని బాలికల విద్యను తగ్గించింది. ఎక్కువ సంఖ్యలో మహిళలు, బాలికలు ప్రసవానికి ముందు లేదా ప్రసవ సమయంలో మరణించినట్లు నివేదికలు చెపుతున్నాయి. వీరికి భద్రతను సమగ్ర సంరక్షణను అందించడానికి, దీర్ఘకాలిక హాని నివారించడానికి మద్దతు ఇవ్వడం చాలా కీలకం. లైంగిక హింస నుండి బయటపడేవారికి సహాయం చాలా ముఖ్యమైనది. అంతర్జాతీయ సమాజం వీరికి న్యాయం చేయడంలో ముందుండాలి. ప్రాణాలతో బయట పడినవారికి ఆర్థికమద్దతు అందించాలి. అందరికీ డిజిటల్ అక్షరాస్యతతో సహా సమగ్రమైన నాణ్యమైన విద్యకు అందించాలి. ఆఫ్లైన్ మరియు ఆన్లైన్లో పెరుగుతున్న లింగ ఆధారిత హింస, వేధింపులు మరియు ద్వేషపూరిత ప్రసంగాలను ఎదుర్కోవడానికి అంతర్జాతీయ సహకారం తప్పనిసరిగా మెరుగు పరచబడాలి.

# అధికారమనేది ఓ బాధ్యత.. ఆధిపత్యం కోసం కాదు

ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం కొలువుతీరింది. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్ లతో పాటు మొత్తం 24 మందితో కొత్త మంత్రివర్గ సభ్యులు బాధ్యతలు చేపట్టారు. అయితే..గత వై.యస్.ఆర్.సి.పి. ప్రభుత్వం నందు అరాచకాలకు గురైన బాధిత తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను, ఇతర బాధిత ప్రజలను అధికారంలో ఉన్న అమాత్యులు ప్రతీకారంవైపు పయనించకుండా అదుపులో పెట్టవలసిన ఆవశ్యకత వుంది. ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడినందుకు ప్రజలు వై.యస్.ఆర్.సి.పి. నాయకులకు గట్టి గుణపాఠం చెప్పారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తాము అధికారంలో ఉన్నామనే విషయం గ్రహించాలి. ముఖ్యంగా మంత్రులు కార్యకర్తలకు చట్టపరిధిలో వారి సమస్యలను బాధిత వ్యధలను పరిష్కరిస్తాం అని భరోసా కల్పిస్తూ..''రాజ్యాన్ని జయించినవాడు వీరుడవుతాడుకోపాన్ని జయించిన వాడు మహర్షిగా మిగులుతాడు'' అనే సూక్తితో మానసిక చైతన్యం తీసుకురావాలి. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 201419 మధ్య తెలుగుదేశం కార్యకర్తలకు ఓ స్థాయి, హెూదా కల్పించాలని సదుద్దేశ్యంతో అప్పుడు సి.యం. గా కొనసాగిన నారా చంద్రబాబునాయుడు జన్మభూమి కమిటీలు ఏర్పాటు చేసి కొంతమేర అధికారాలు అప్పగించారు. ఈ కమిటీల సభ్యులు గ్రామస్థాయిలో సంక్షేమ పథకాలు అమలు కోసం ప్రజల నుంచి బాగా డబ్బు పిండారని ప్రచారం జరిగింది. ఇదే విధంగా అమరావతి అభివృద్ధి విషయంలో ప్రత్యేకంగా ఒక సామాజిక వర్గం లబ్ధి పొందుతున్నదని ప్రత్యర్థి పార్టీ అయిన వై.యస్.ఆర్.సి.పి. చేసిన ప్రచారాన్ని టి.డి.పి. సరైన విధంగా తిప్పి కొట్టలేక పోయింది. అప్పుడైనా, ఇప్పుడైనా పాలకపక్షం, ప్రతిపక్షం, ప్రజలు కలగలిస్తేనే ప్రభుత్వమనే విషయం అందరూ గ్రహించాలి. మరోసారి అనవసరమైన అసత్య ప్రచారానికి కొన్ని సామాజిక వర్గాల టార్గెట్ కోసం తావు ఇవ్వకుండా తాజాగా బాధ్యతలు చేపట్టిన సి.యం. చంద్రబాబునాయుడు జాగ్రత్త వహించాలి. ఇప్పుడు టి.డి.పి, బి.జె.పి, జనసేన పార్టీతో కూడిన సంకీర్ణ ప్రభుత్వం కొనసాగుతున్నందున మూడు పార్టీల నాయకులు, మంత్రులు అందరూ మరీ మరీ జాగ్రత్తగా వ్యవహరించవలసి ఉంది. భారతదేశంలో



1989 నుండి 2004 వరకు 25 సం॥లు వరుసగా సంకీర్ణ ప్రభుత్వాల యుగం నడిచింది. అంతకుముందు 197780 మధ్య కూడా సంకీర్ణ ప్రభుత్వం నడిచింది. 197080 మధ్య మరియు 199699 మధ్య నడిచిన సంకీర్ణ ప్రభుత్వాలు పూర్తికాలం నడవలేక మధ్యలోనే సమన్వయలోపంతో కుప్పకూలాయి. 199196 మధ్య నడిచిన పి.వి.నరసింహారావు సంకీర్ణ ప్రభుత్వం పూర్తికాలం 5 సం॥లు, 19992004 మధ్య వాజ్‌పేయి సంకీర్ణ ప్రభుత్వం పూర్తికాలం 5 సం॥లు విజయవంతంగా నడిచాయి. 2004 నుంచి 2014 వరకు యు.పి.ఎ. ఆధ్వర్యంలోని రెండు పర్యాయాలు సంకీర్ణ ప్రభుత్వాలు మరింత మెరుగ్గా విజయవంతంగా నడిచాయి. 2014 లో యన్.డి.ఎ. కూటమి అధికారంలోకి వచ్చినప్పటికీ బి.జె.పి.కి సంపూర్ణమైన మెజార్టీ ఉన్నప్పటికీ కూటమి ధర్మంలో భాగంగా 2024 వరకు మిత్రపక్షాలకు సరైన విధంగా ప్రాధాన్యత నిచ్చి ప్రభుత్వాలను నరేంద్ర మోదీ నడిపారు. ఈ తరహాలో గతంలో జాతీయస్థాయిలో విజయవంతంగా నడిచిన సంకీర్ణ ప్రభుత్వాలను స్ఫూర్తిగా తీసుకొని ఆంధ్రప్రదేశ్ నందలి టి.డి.పి, బి.జె.పి, జనసేన పాలకులు ముందుకు సాగవలసి వుంది. పరస్పర సహకారం పరస్పర ప్రయోజనం అనే విధంగా ఇరుప్రక్కల స్వప్రయోజనాలతోనే రాజకీయాలలో పొత్తులు ఉంటాయనే విషయం మరువకూడదు. కొంతమంది జనసేన కార్యకర్తలు మా పొత్తుతోనే టి.డి.పి. అధికారంలోకి వచ్చిందని ఎగిరెగిరి పడుతున్నారు. బి.జె.పి. కార్యకర్తలు మా మద్ధతు లేకుంటే చంద్రబాబు వై.యస్.ఆర్.సి.పి. ధాటికి తట్టుకోలేక మరోసారి జైలుకెళ్ళి ఉండేవారు.. మేము, మా ప్రధాని మోదీ కేంద్రం నుంచి మద్ధతు ఇచ్చినందుకే వై.యస్.ఆర్.సి.పి. నాయకులు తోక ముడిచారని ప్రగల్భాలు చెప్పుకుంటున్నారు.40 సం॥లుగా ప్రతి గ్రామం నందు బలమైన క్యాడర్‌తో నాటుకుపోయిన టి.డి.పి. అండ దండలతోనే అటు బి.జె.పి.కి, ఇటు జనసేనకు వారి స్థాయికి మించిన సీట్లు వచ్చాయని టి.డి.పి. కార్యకర్తలు ఎత్తిపొడుస్తున్నారు. ఇటువంటి ఎత్తిపొడుపులు అనవసర ప్రగల్భాలను పక్కన పెట్టి పరస్పర సహకారంతో అధికారంలోకి వచ్చాం..విధ్వంసానికి గురైన ఆంధ్రప్రదేశ్‌ను పునః నిర్మిస్తాం..సమైక్యంగా ముందుకు సాగుదాం అని మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు గ్రహించి వాస్తవాలను గమనిస్తూ ముందుకు సాగాలని సలహా ఇవ్వడమైనది. కలిసివుంటే కలదు సుఖం అనే విషయాన్ని ఏ విధంగాను మరువకూడదు.

తిప్పినేని రామదాసప్పనాయుడు
9618585063

# 'శరణార్థులను ఆదుకోవడం కనీస బాధ్యత'

యుద్ధాల వల్ల, కుల మత వర్ణ వివక్షత వల్ల లేదా మరోయితర కారణంగా హింసాత్మక చర్యలను సృష్టించడం ద్వారా కొంతమంది వ్యక్తులు లేదా కుటుంబాలు ప్రాణభయంతో సొంత దేశాలను వదిలి వేరేదేశాలకు వెళ్లి అక్కడ నివసించే వారిని 'శరణార్థులు' అని అంటారు. ఇటు వంటి సంఘటనలు రెండవ ప్రపంచ యుద్ధ సమయములు ఎక్కువగా ఉన్నా కూడా ప్రస్తుతం కూడా ఎక్కడో ఒక చోట ఆహారం కొరకు, నివాసం కొరకు బతుకు పోరాటం చేస్తూనే ఉన్నారు శరణార్థులు. ఇలాంటి వారిని ఆదుకోవడం కొరకు ప్రపంచ శరణార్థుల దినోత్సవం ప్రతి సంవత్సరం 'జూన్20న' ప్రపంచవ్యాప్తంగా నిర్వహించబడుతుంది. ప్రపంచంలోని శరణార్థుల గురించి అవగాహన కలిపించడంకోసం ఈ దినోత్సవంను జరుపుతున్నారు. శరణార్థుల సమస్యల పరిష్కారం, వారి హక్కుల పరిరక్షణ కోసం ఐక్యరాజ్యసమితి 1950 డిసెంబర్ 14న ఐక్యరాజ్యసమితి శరణార్థుల సంస్థని ఏర్పాటు చేసింది. ప్రపంచంలో అనేక దేశాల్లో నిరంతరం జరుగుతున్న యుద్ధాలు, అంతర్గత పోరాటాల ఫలితంగా అనేకమంది ప్రజలు నిర్వాసితులై శరణార్థులుగా మారుతూనే ఉన్నారు. ఈ పరిణామాల కారణంగా ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 2000, డిసెంబరు 4న సమావేశమై ప్రతి సంవత్సరం జూన్ 20న 'అంతర్జాతీయ శరణార్థుల దినోత్సవం' జరపాలన్న తీర్మానాన్ని ఆమోదించింది. 2001లో తొలిసారి జరుగగా అప్పటి నుండి, ఈ రోజు శరణార్థులందరినీ గౌరవించడం, వారి గురించి అవగాహన పెంచడం, వారికి మద్దతు తెలపడం వంటి కార్యక్రమాలు విశ్వవ్యాప్తంగా జరుగుతున్నాయి. ఇతర అంతర్జాతీయ దినోత్సవాల మాదిరిగా ప్రపంచ శరణార్థుల దినోత్సవం సందర్భంగా ఉత్సవాలు జరుపుకునే రోజు కాదని, శరణార్థులు ఎదుర్కొంటున్న కష్టాలు, అమానవీయ పరిస్థితులు, వాటి వెనుక ఉన్న కారణాలు, వీటన్నిటిని గురించి ప్రపంచ మానవ సమాజానికి తెలియజేసి అవగాహన కల్పించేందుకు ఈ సందర్భాన్ని వినియోగించుకోవాలన్న ఉద్దేశ్యంతో ఐక్యరాజ్యసమితి , ఐక్యరాజ్యసమితి శరణార్థుల సంస్థ ('యునైటెడ్ నేషన్స్ హైకమిషనర్ ఫర్ రెఫ్యూజీస్ యుఎన్‌హెచ్‌సిఆర్) పిలుపుమేరకు ప్రతి సంవత్సరం జూన్ 20న, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక పౌర సంఘాలు ప్రపంచ శరణార్థుల దినోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. యుద్ధం, హింస కారణంగా వారివారి స్వస్థలం నుండి పారిపోయి వచ్చిన వారిని ఆదరించి వారికి బతుకుదెరువు చూపెట్టాలని, వారిని కూడా తమ వారీగా గుర్తించి, ప్రభుత్వాలు అండగా ఉండాలని, ప్రజలు వీరికి మద్దతుగా ఉండాలని ప్రచారం చేస్తున్నారు.

# పండితుల పదోన్నతులకు అడుగడుగున ఇబ్బందులేనా?

తెలంగాణ రాష్ట్రంలోని భాష పండితుల పదోన్నతుల వ్యవహారం మూడు అడుగుల ముందుకు ఆరు అడుగుల వెనుకకు అన్న చందంగా తయారైంది.తెలంగాణ రాష్ట్రం లోని 8648 భాష పండితులకు,1352 దాదాపు 10 వేల మందికి పైగా పదోన్నతులు ఇవ్వనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.తెలంగాణ రాష్ట్రం లోని భాషలు ( తెలుగు, హిందీ, ఉర్దూ, మరాఠీ, కన్నడ, సంస్కృతం మిగతా దేశీయ భాషలు) బోధించే ఉపాధ్యాయులు ఉన్నత పాఠశాలలలో పనిచేస్తూ ప్రాథమిక పాఠశాల వేతనాలు తీసుకుంటూ శ్రమదోపిడికి, వెట్టిచాకిరికి గురయ్యారు.గత ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోని భాష పండితులకు పదోన్నతులు ఇవ్వడానికి జీ.వో 2,3 జీ.వో 9,10, జీ.వో 110 అంటూ మూడు, నాలుగు సార్లు ఉత్తర్వులు జారీ చేసింది.ప్రాథమిక పాఠశాలలలో పనిచేస్తున్న ఎస్జీటీ ఉపాధ్యాయ మిత్రులు తెలంగాణ రాష్ట్రంలోని భాష పండితుల పదోన్నతులలో ఎస్జీటీ ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వాలని తెలంగాణ ఉన్నత న్యాయస్థానం హైకోర్టు కు వెళ్లి స్టే తీసుకొని రావడం వాయిదా వేయించడం జరిగింది.

తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం డివిజనల్ బెంచ్ పండితుల పోస్టులు పండితులకే పి.ఈ.టి పోస్టులు పి.ఈ.ట లకు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇచ్చింది.ఎస్జీటి ఉపాధ్యాయులు పండితుల పదోన్నతుల్లో ఎస్జీటీ ఉపాధ్యాయులకు అవ ఇవ్వాలని మనదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కు వేసవి సెలవులు ఉండడంతో విక్లీ కోర్టు లో ' స్టే 'కోసం రిట్ పిటిషన్ దాఖలు చేశారు.14.06.2024 నాడు సుప్రీంకోర్టు లో పిటిషన్ డిస్మిస్ చేశారు.పండితుల పోస్టులను పండితులకే ఇవ్వాలని తెలంగాణ ఉన్నత న్యాయస్థానం హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు అంగీకరించినట్లు అయ్యింది.తెలంగాణ రాష్ట్రం లోని దాదాపు 10 వేల మందికి పైగా భాష పండితులు,పి.ఈ.టి ల ముఖాలలో వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యుల ముఖాలలో సంతోషానికి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.18.06.2024 నాడు తెలంగాణ రాష్ట్రంలోని ఉన్నత పాఠశాల హైకోర్టు లో స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు ' టెట్ 'అవసరమని ఒక సింగిల్ జడ్జి ఉత్తర్వులు జారీ చేస్తే ఉపాధ్యాయుల పదోన్నతుల్లో ' టెట్' అవసరం లేదని మరో సింగిల్ జడ్జి ఉత్తర్వులు జారీ చేసింది.ఏ జడ్జి ఉత్తర్వులను అమలు చేయాలో తెలియక విద్యా శాఖాధికారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.ఉపాధ్యాయుల పదోన్నతులకు ' టీచర్స్ ఎలిజిబిలిటి టెస్ట్ ( టెట్) అవసరమా ! లేదా ? అనే అంశంపై 20.06.2024 నాడు తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం హైకోర్టు లో కేసు ఉంది. జాతీయ విద్యా సంస్థ ( ఎన్ సీ టి ఈ) ప్రకారం స్థాయి ( లెవెల్) మారనప్పుడు టీచర్స్ ఎలిజిబిలిటి టెస్ట్ (టెట్ ) అవసరం లేదు.ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందినా టీచర్స్ ఎలిజిబిలిటి టెస్ట్ ( టెట్) అవసరం లేదు.ఉన్నత పాఠశాలలలో బోధించే ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వడంతో వారు బోధించే పాఠాలలో తేడా రాదు.స్థాయి ( లెవెల్) మారదు.భాష పండితులకు,పి.ఈ.టి లకు బోధించే తరగతులు గాని వేతనం లో తేడా ఉండదు.కేవలం హోదా మాత్రమే మారుతుంది.పండితుల,పి.ఈ.టి పదోన్నతుల విషయంలో టీచర్స్ ఎలిజిబిలిటి టెస్ట్ (టెట్) ఉత్తీర్ణత సాధించాలనే నిబంధనలు వర్తించవు.తెలంగాణ రాష్ట్రంలోని ఉపాధ్యాయ శాసన మండలి సభ్యులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు వెళ్లి తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి బుర్ర వెంకటేశం గారిని, కమీషనర్ మరియు సంచాలకులు ( డైరెక్టర్ ) గారిని కలిసినప్పుడు బదిలీలపై, పదోన్నతుల పై ఎలాంటి స్టే లేకపోవడం వల్ల యధావిధిగా ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు జరుగుతాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రమును విద్యా శాఖ జోన్ 1, జోన్ 2 కింది విభజించింది.జోన్ 1, హైదరాబాద్‌లోని ఉపాధ్యాయుల సర్వీస్ బుక్ వెరిఫికేషన్, పదోన్నతుల కోసం కొత్త పాఠశాలల ఎంపికకు వెబ్ లో నూతన పాఠశాలల ఎంపిక తర్వాత ఏమైనా పొరపాట్లు ఉంటే సరిదిద్దుకోవడానికి వెబ్ లో ఎడిట్ ఆప్షన్ అన్ని పూర్తి అయ్యాయి. కేవలం పదోన్నతుల ఆర్డర్ తీసుకొని కొత్త పాఠశాలలకు బదిలీ మీద వెళ్ళడమే మిగిలింది. ఉపాధ్యాయుల పదోన్నతుల ఉత్తర్వులు అదిగో ఇదిగో అంటూ గంట గంటకు ఉత్కంఠను పెంచుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు కాని తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి బుర్ర వెంకటేశం గారు కాని, తెలంగాణ విద్యా శాఖ కమిషనర్, సంచాలకులు ( డైరెక్టర్) గాని ఇతర విద్యా సంబంధిత అధికారులు భాష పండితుల,పి.ఈ.టి లో పదోన్నతుల విషయంలో జోక్యం చేసుకొని వీలైనంత త్వరగా పండితుల,పి.ఈ.టి లో పదోన్నతుల ఉత్తర్వులు జారీ చేస్తారని వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నారు.

డాక్టర్. ఎస్. విజయ భాస్కర్
9290826988

## పెన్షన్ కోసం పడిగాపులు..



ప్రజాపక్షం/నందికొండః ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ ల కోసం వృద్ధులు, వితంతువులు, వికలాంగులు నందికొండ మునిసిపాలిటీ పరిధిలోని స్థానిక పైలాన్ కాలనీ పోస్ట్ ఆఫీస్ వద్ద రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారు. ఉదయం 9గంటలకే పోస్ట్ ఆఫీస్ కు చేరుకొని గంటల తరబడి వేచి ఉంటున్నారు. తమకు డబ్బులు పడ్డాయో లేదో తెలుసుకునేందుకు నానా యాతనలు పడుతున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ రోజూ పోస్ట్ ఆఫీస్ చుట్టూ తిరిగి వృద్ధులమైన తాము అవస్థలు పడుతున్నామని పెన్షన్ కోసం పాస్ పుస్తకాలు పట్టుకొని పోస్టాఫీస్ కౌంటర్ల వద్ద వేచి చూస్తున్నామని అయినా సరే పోస్ట్ ఆఫీస్ వారు సరైన సమాచారం ఇవ్వకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నామని ఉదయాన్నే వచ్చి నానా అవస్థలు పడుతున్నామని వాపోయారు.పెన్షన్ నెలలో ఏ రోజు వస్తుందో తెలియని పరిస్థితని పెన్షన్ కోసం ఒక తేదీ అంటూ ఏదీ లేదని దాంతో తాము చాలా ఇబ్బంది పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ కోసం ఒక తేదీని నిర్ణయించి ప్రతి నెల అదే తేదిని క్రమం తప్పకుండా కొనసాగించి పెన్షన్ వచ్చే విధంగా చేస్తే తమకు ఈ బాధలు ఉండవని తమ గోడును వెళ్ళబోశారు. ఇకనైనా ప్రభుత్వం తమ బాధలను అర్థం చేసుకొని పెన్షన్ సరైన సమయంలో వచ్చే విధంగా చూడాలని వారు కోరారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ప్రజాపక్షం/కోదాడః పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఉత్తమ్‌పద్మాతిరెడ్డి అన్నారు.బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా 166 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ ,షాదీముబార్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నిక ల కోడ్‌తో చెక్కుల పంపిణీ కార్యక్రమం ఆలస్యం అయిందన్నారు.లబ్ధిదారులు వీలైనంత తొందరగా చెక్కులను బ్యాంకులో డిపాజిట్ చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నార. పేదల సంక్షేమానికి ప్రభుత్వం అందించే సాయాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సూర్యనారాయణ, మున్సిపల్ చైర్మన్ సామినేని ప్రమీల, రాష్ట్ర నాయకులు యెర్నేని బాబు, ఎంపిపి మల్లెల రాణి,చుండూరు వెంకటేశ్వరరావు, ప్రశాంతి, బొలిశెట్టి శిరీష,నాగేంద్ర బాబు, కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, జడ్‌పిటిసిలు, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతానికి ఎనిమిది గేదెలు మృతి



ప్రజాపక్షం/హుజూర్‌నగర్ః విద్యుదాఘాతానికి ఎనిమిది గేదెలు మృతిచెందిన ఘటన సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని మినిట్యాంకు బండ్ దగ్గర వ్యవసాయ పొలంలో మేతకు వెళ్లి గేదెలు విద్యుత్ స్తంభం విరిగిపడి విద్యుత్‌తీగలు తగిలి 8 గేదెలు చనిపోయాయి అన్నారు. పంగ నర్సింహారావుకు చెందిన 4 గేదెలు, చాగంటి వెంకన్నకు చెందిన 2 గేదెలు, ఉప్పతల శ్రీనివాస్‌కు చెందిన 2 గేదెలు మృతి చెందాయన్నారు. ఈ గేదెల విలువ రూ.6లక్షల వరకు ఉంటుందన్నారు. గేదెల వలనే జీవనాధారం పొందుతున్న కుటుంబాలకు విద్యుత్‌శాఖ తగు న్యాయం చేసి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## ఎమ్మెల్యే అయినా నిత్య విద్యార్థినే



ప్రజాపక్షం/ఆలేరు : ఎమ్మెల్యే అయిన నిత్య విద్యార్థినే అని ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్పు బీర్ల ఐలయ్య అన్నారు. బుధవారం ఆలేరు పట్టణ కేంద్రంలోని స్థానిక ప్రకాష్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన మంద సోమరాజు ఉద్యోగ విరమణ అభినందన సభ సందర్భంగా హాజరై మాట్లాడుతూ పదవులు పొందడానికి కారణం చదువు చెప్పిన విద్యార్థులే అని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పిఆర్టియు సంఘం సమస్యలు పరిష్కరిస్తామన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని అందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పలు సంఘాల నాయకులు సోమరాజు దంపతులను శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ నరోత్తం రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రవీందర్, పిఆర్‌టియు రాష్ట్ర నాయకులు శ్రీ పాల్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమలాకర్ రావు, జిల్లా అధ్యక్షులు రామ్మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, మున్సిపల్ చైర్మన్ శంకరయ్య, ఎంఈఓ కృష్ణ, నాయకులు ఎండి కాజా అలీ, కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు ఎజాస్, మండల యువజన విభాగం అధ్యక్షులు ఉటుకూరి సురేష్, నాయకులు పేరపు సిద్ధులు, లగ్గాని కుమార్, భీమగాని శ్రీనివాస్, తండా నవీన్, కోటగిరి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న దివ్యాంగ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిపరెంట్లి ఏబుల్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. జిల్లా కలెక్టర్‌గా నూతన బాధ్యతలు చేపట్టిన కలెక్టర్‌కు అసోసియేషన్ సభ్యులు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సన్మానం చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన చిర్రబోయిన లక్ష్మయ్య, జిల్లా అధ్యక్షులు రుద్రాక్షి శ్రీనివాస్, గౌరవాధ్యక్షులు కంచర్ల అంజిరెడ్డి, ఉపాధ్యక్షులు కొండాపురం శంకర్, జేరుపుల తిరుపతయ్య, చనమోని బాలయ్య, కాసర్ల లింగారెడ్డి, నాగేందర్, గంటి సైదులు, ఈ సైదులు ఉన్నారు.

# నిరంతర విద్యుత్ సరఫరాపై ఫోకస్

ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులు స్వీకరణ

చెట్ల కొమ్మల నరికివేత సహా పలు సమస్యల పరిష్కారం

ఇప్పటికే కొనసాగుతున్న జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ విచారణ



ప్రజాపక్షం/హైదరాబాద్ : వేసవి ముగిసి వర్షాకాలం సీజన్ రానే వచ్చింది. అదే సమయంలో విద్యుత్ శాఖకు పలు సమస్యలను కొని తెచ్చింది. భారీ వర్షాల నేపథ్యంలో చెట్ల కొమ్మలను విద్యుత్ వైర్లపై పడుతున్నాయి. అది కాస్త ఇళ్లు, భవనాలకు తాకుతుండడంతో వాటిని యుద్ధ ప్రాతిపదికన తొలగించాల్సిన అవసరం ఏర్పడింది. ఈ విషయంలో విద్యుత్ శాఖ పని చేస్తున్నా కొన్ని రాజకీయ పార్టీల నేతలు ఇందుకు విరుద్ధంగా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పాడుతున్నాయనో? లేదా కాల్ సెంటర్‌కు ఫోన్ చేసినా స్పందించడం లేదనో ఫిర్యాదులు వస్తున్నాయి. కాగా విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగానే తాము కొన్ని చోట్ల విద్యుత్ సరఫరాను గంట పాటు నిలిపివేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. దాదాపు 60 లక్షల మంది వినియోగదారులు మూడు లక్షల కిలోమీటర్లకు పైగా వున్న విద్యుత్ లైన్లలో అతి తక్కువ సందర్భాల్లో సరఫరాలో అంతరాయం కలిగే అవకాశం వుంటుందని చెబుతున్నారు. ఎక్కడైనా సరఫరా లేకుంటే కంప్లైంట్ నెంబర్ 1912కు ఫోన్ చేసి ఫిర్యాదులు తెలుప వచ్చని, దీనికి అక్నాలెడ్జ్‌మెంట్ నెంబర్ కూడా ఇస్తామని చెబుతున్నారు. ఫిర్యాదుల విషయంలో అత్యంత పారదర్శకంగా ఉన్నప్పటికీ రాజకీయ విమర్శల కోసం ట్విట్టర్ లో కామెంట్లు చేయడం సరి కాదని టిజి ఎస్‌పిడిసిఎల్ అధికార వర్గాలు చెబుతున్నాయి. ఫిర్యాదు చేసిన వినియోగదారులను ఇబ్బందులకు గురి చేయరాదని, కానీ కొద్ది సేపు అంతరాయానికి కొందరు 7 గంటలు సరఫరా లేదని అసత్య ప్రచారం చేయడం వల్ల స్థానిక విద్యుత్ శాఖ అధికారులు సిబ్బంది మీద చాలా ఒత్తిడులు ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు. కరెంటు సరఫరా, లైన్ల మరమ్మతులు చాలా కీలకమవుతున్నాయి. అసలే అపాయకరమైన ఈ పని చేస్తున్న క్రమంలో ఫోన్‌లో మాట్లాడుతూ లైన్ క్లియర్ చేయడం లాంటివి చేస్తే ఆ తొందరలో జరగరానివి జరిగి ప్రాణ నష్టం జరిగే దానికి బాధ్యత వహించేవారెవరనీ కింది స్థాయి లైన్‌మెన్లు గుర్తు చేస్తున్నారు. చాలా ఒత్తిడికి గురవుతూ పని చేస్తున్నా తమ వృత్తిని కనీసం గుర్తించకుండా సోషల్ మీడియాలో ఇష్టాను సారంగా పోస్ట్ చేస్తూ విద్యుత్ శాఖను అబాసుపాలు చేయడం సరి కాదంటున్నారు.

**కరెంటుపై రాజకీయ గడబిడ..**

ఇదిలా ఉండగా విద్యుత్ కోతల మీద సోషల్ మీడియా , బయట బిఆర్‌ఎస్ చేస్తున్న ప్రచారాలు గడబిడ రేపుతున్నాయి. సాంకేతిక సమస్యలు, మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపు, భారీ వర్షాలతో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు సహజమే అయినా వాటిపైనా విపక్షాలు విమర్శలు చేస్తు వస్తున్నారు. ఆ మాటకు వస్తే బిఆర్‌ఎస్ పాలనలో కూడా ఈ సమస్య ఉండేది. అయితే కెసిఆర్ సర్కారు ఈ విషయంలో తరుచు మీడియా సమావేశాలు పెట్టి వాటిని తిప్పికొట్టే వారు. సరిపడ విద్యుత్ లేకున్నా ఇతర రాష్ట్రాల నుండి కొనుగోలు చేసి నిరంతర కరెంటు ఇస్తున్నామని చెబుతూ వచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే విద్యుత్ కోతలు అని సోషల్ మీడియాలో ప్రచారం పెరిగింది. విద్యుత్ మీద ఇప్పుడు రాష్ట్రంలో పెద్ద స్థాయిలో రాజకీయం జరుగుతుండడంతో కాంగ్రెస్ నేతలు విద్యుత్ శాఖ అధికారులు , సిబ్బందిపై ఒత్తిడి తీసుకువస్తూ కోతలు రాకుండా చేయాలని చెబుతువస్తున్నారు.

అటు ముమ్మరంగా జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ విచారణ ఇదిలా ఉంటే అటు ఓ వైపు విద్యుత్ రంగంపై జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ విచారణ ముమ్మరంగా సాగుతోంది. గత సర్కారు హయాంలోని విద్యుత్ నిర్ణయాలపై న్యాయ విచారణ జరుగుతోంది. మరో వైపు బిఆర్‌ఎస్ వారు విద్యుత్ కోతల అంశాన్ని తెర మీదకి తెచ్చి దృష్టి మళ్లింపు రాజకీయాలకు పాల్పడుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఈ సమయంలో కోతలు లేవని.. ఎక్కడైనా విద్యుత్ కొంత సేపు పోయినా కాంగ్రెస్ వారు ఇవ్వలేక పోతున్నారన్న అపవాదులు రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. సోషల్ మీడియాలో కొందరు చేసే పోస్టులు కారణంగా విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది సమిధలుగా మారుతున్నట్లు విద్యుత్ శాఖ వర్గాలు పేర్కొంటుండడం గమనార్హం.

## 24న జాబ్‌మేళాను యువతీ యువకులు సద్వినియోగపర్చుకోవాలి

కాంగ్రెస్ నాయకుల పిలుపు



ప్రజాపక్షం/చిగురుమామిడిః రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ చొరవతో హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగ యువతీ యువకుల కోసం ఈ నెల 24న హుస్నాబాట్ పట్టణంలోని తిరుమల గార్డెన్‌లో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను సద్వినియోపరుచుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కంది తిరుపతి రెడ్డి, జడ్పిటిసి గీకురు రవీందర్‌లు కోరారు. బుధవారం చిగురుమామిడి మండల కేంద్రంలో మాట్లాడారు. ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న తరుణంలో యువత శక్తి నిర్వీర్యం కాకుండా వారిని ఉద్యోగాల వైపు తీసుకెళ్లడం కోసం మంత్రి పొన్నం ప్రబాకర్ చొరవతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ కంపెనీల యాజమాన్యం దాదాపు 5 వేల ఉద్యోగాల భర్తీ కోసం యువతీ యువకుల భవిష్యత్తుకు భరోసా కల్పించే విధంగా మంత్రి నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టిమల్ల రవీందర్, జిల్లా అధికార ప్రతినిధులు దాసరి ప్రవీణ్ నేత, ఐరెడ్డి సత్యనారాయణ రెడ్డి, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు షాబుద్దీన్, నాయకులు మహిపాల్‌రెడ్డి, నరేందర్ సింగ్ ,వంగర మల్లేశం , ఎంపిటిసిలు పాల్గొన్నారు.

## గ్రామస్థాయి నుండే ప్రభుత్వ సంక్షేమ పథకాలు,ప్రజాపాలనః కలెక్టర్



ప్రజాపక్షం/నల్లగొండ : గ్రామస్థాయి నుండే ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలు కావాల్సిన అవసరం ఉందని, ఇందుకుగాను ఎలాంటి ఇబ్బంది లేకుండా గ్రామస్థాయిలో సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి అన్నారు.బుధవారం ఆయన జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి మండలాల ప్రత్యేక అధికారులు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, మండల స్థాయి అధికారులతో వచ్చే సోమవారం నుండి నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమం, వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామస్థాయిలో విద్య, వైద్యం, ఆరోగ్యం ఉపాధి హామీ ప్రజా పాలన తదితర అన్ని పథకాలు సరైన విధంగా లబ్ధిదారులకు అందేలా చూడాల్సిన బాధ్యత గ్రామ, మండల స్థాయి టీములపై ఉందని అన్నారు. గ్రామ,మండల స్థాయి టీములు అన్ని అభివృద్ధి పథకాలు , ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజాపాలనకు సంబంధించిన అన్ని విషయాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి పథకం కింద టార్గెట్ తో పాటు, పెండింగ్ లబ్ధిదారులు, వారి జాబితాను ప్రత్యేకంగా రూపొందించాలని, అలాగే మండల స్థాయి టీములు గ్రామ స్థాయి టీములను పర్యవేక్షించాలని, రాబోయే రోజుల్లో ఆయా పథకాల వారీగా సమీక్షించడం జరుగుతుందని తెలిపారు. గ్రామస్థాయి బృందాలను ఆశా వాద దృక్పథంతో తీర్చిదిద్దాలని శానిటేషన్, విద్య సక్రమంగా నడిచేలా చూడడం, అంగన్వాడి ద్వారా పౌష్టికాహారం అందించడం, వైద్య ఆరోగ్యశాఖ ద్వారా అందించే సేవలు, గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకు ఇచ్చే పౌష్టికాహారం, ఇతర విషయాలు, ఉపాధి హామీ పనులు, గ్రామాలలో విద్యుత్ సమస్యలు, వంటి అంశాలపై గ్రామ స్థాయిలో పూర్తి సంతృప్తికరంగా పనిచేయాలని,అలాగే మున్సిపాలిటీలలో సైతం ఈ విధంగా పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇందుకు గ్రామ స్థాయి యంత్రాంగాన్ని సమాయత్తం చేయాలని అన్నారు. అధికారులు పూర్తిగా ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని,ఉద్యోగులు ఎవరైనా అనధికారికంగా విధులకు గైర్హాజరైతే సస్పెండ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. నిబంధనలకు అనుకూలంగా ఉన్న పనులు చేయాలని, ప్రజలతో మంచి సత్సంబంధాలను కలిగి ఉండాలని, అలాగే ప్రజాప్రతినిధులను కలుపుకొని కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రజా సంఘాలు, మీడియాను సైతం పరిగణలో తీసుకుని ముందుకు వెళ్లాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె శ్రీనివాస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి. పూర్ణచంద్ర ,జెడ్‌పి సిఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి తదితరులు 0

## పునరావాస కేంద్రాల్లో చేపట్టిన పనులు త్వరలో పూర్తిచేయాలి : కలెక్టర్



ప్రజాపక్షం / గద్వాల : నెట్టెంపాడు ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా వివిధ రిజర్వాయర్ల పరిధిలో నిర్వాసిత గ్రామాల ప్రజలకు పునరావాస కేంద్రాల్లో అన్నీ పనులు నిర్ణిత సమయంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడిఓసి కాన్ఫరెన్స హాల్లో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితిపై ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పునరావాస కేంద్రాల్లో నిర్వాసితులు సౌకార్యార్థ్యం పాఠశాల, అంగన్‌వాడి కేంద్రాలు, కమ్యూనిటీ హాల్స్ తదితర భవనాలు నిబంధనలకు అనుగునంగా నిర్మించాలన్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతల ప్రాజెక్టు కింద ఉన్న రిజర్వాయర్లు నీటి సామర్థ్యం ఆయకట్టు వివరాలు ప్యాకేజి పనులు ప్రస్తుత పనులు గట్టు ఎత్తిపోతల పథకం ఇప్పటి దాక సేకరించిన వివరాలు ఇంకా ఎన్ని ఎకరాలు భూ సేకరణ చేయవలసి ఉంది అని ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టుల ద్వారా జిల్లాలో సాగు అవుతున్న ఆయకట్టు వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని ప్రాజెక్టుల భోగోళిక మ్యాప్‌ను ఆయన క్షున్నంగా పరిశీలించారు. గుర్రం గుర్రంగడ్డ గ్రామం వద్ద కృష్ణానదిపై నిర్మిస్తున్న వంతెన పనులపై అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ ఎస్. ఈ, శ్రీనివాసరావు, ఈఈలు రహీముద్దీన్, వెంకటేశ్వర్‌రావు, జుబేర్, అహ్మద్, విజయ్ కుమార్ రెడ్డి, డిఈలు తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడబిడ్డలకు వరం.. కల్యాణలక్ష్మి



ప్రజాపక్షం/చింతపల్లి: పేదింటి ఆడబిడ్డలకు వరం కళ్యాణ లక్ష్మీ పథకం అని, ప్రతి పేదింటి ఆడబిడ్డకు పెళ్లి కానుకగా కళ్యాణ లక్ష్మీ పథకం ద్వారా త్వరలో నగదుతో పాటు తులం బంగారాన్ని అందిస్తామని దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్ అన్నారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 33 మంది లబ్ధిదారులకు గురువారం బాలునాయక్ కళ్యాణ లక్ష్మీ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా బాలు నాయక్ మాట్లాడుతూ ఎన్నికల హామీ ప్రకారం త్వరలోనే కళ్యాణ లక్ష్మీ పథకం ద్వారా నగదుతో పాటు తులం బంగారాన్ని కూడా ఆడబిడ్డలకు అందిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఎకరానికీ 7500 రూపాయలు చొప్పున సంవత్సరానికి 15000 రూపాయలు రైతుల ఖాతాలో జమ చేయబోతుందన్నారు. ఆరు గ్యారెంటీల పథకాలను దరఖాస్తు చేసుకోని వారు ఎంపిడిఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కొండూరు భవాని పవన్‌కుమార్, తహసీల్దార్ విజయకుమార్, ఆర్ ఐ యాదయ్య, డిసిసి ఉపాధ్యక్షుడు దొంతం సంజీవరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగభూషణం, వైస్ ఎంపిపి యాదిగౌడ్, ముచ్చర్ల గిరి, కాయితి జితేందర్ రెడ్డి, ఎరుకల వెంకటయ్య గౌడ్, హరినాయక్, సదానందం, శ్రీనివాస్, కొండల్, యాదయ్య, రాములు, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ ఆదర్శ పాఠశాల ఆకస్మిక తనిఖీ



ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : అమ్మ ఆదర్శ పాఠశాలలను యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతు కే జెండగే బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల పరిధిలోని అమ్మ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలపై ఆయన ఆరా తీశారు. అదేవిధంగా పాఠశాలల్లో పెండింగ్లో ఉన్న పనుల వివరాలను ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు అమ్మ ఆదర్శ కమిటీలు పనిచేయాలని సూచించారు. ఇప్పటికే పాఠశాలలో యూనిఫార్మ్స్, పుస్తకాలను అందజేత పూర్తయిందని, పాఠశాలల్లో ఇంకా ఏవైనా వసతులు కావాలన్నా వెంటనే పూర్తి చేయాలని అందుకు సంబంధించిన బడ్జెట్‌ను విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయంలో ధరణి ఫైల్స్ పై జరుగుతున్న పనుల వివరాలను ఆరా తీశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే తసిల్దార్లకు ధరణి సమస్యల పరిష్కారం కోసం లాగిన్లు ఇచ్చామని భూ సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యేందుకు తహసిల్దార్‌లు కృషి చేయాలని సూచించారు. తహసిల్దార్, ఆర్డీవో స్థాయిల్లో కొన్ని రకాల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని. మరికొన్ని సమస్యలకు కలెక్టర్, సిసిఎల్‌ఏ స్థాయిలో పరిష్కారం చూపిస్తామని తెలిపారు. తహసిల్దార్లు ధరణి పోర్టల్ ద్వారా తమ లాగిన్ లోకి వచ్చిన సమస్యను వారం నుండి పది రోజులలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంటఎంపీపీ గుత్తా ఉమాదేవి, స్థానిక తసిల్దార్ కృష్ణ, ఎంపీడీవో ప్రమోద్ కుమార్, ఎంఈఓ నాగవర్ధన్ రెడ్డి, ఏపీవో యాదయ్య, పంచాయతీ సెక్రెటరీ నరేష్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం కరీంనగర్ డిసిసి కార్యాలయంతో పాటు నగరంలోని పలు చోట్ల వేడుకలను ఘనంగా నిర్వహించారు. మొదట డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మానకొండూర్ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హాజరై పిసిసి కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డితో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ఇందిరా చౌక్ వద్ద నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి హాజరై కేక్ కట్ చేసి కార్యకర్తలకు, అభిమానులకు పంచారు. మాజీ కార్పొరేటర్ పడిశెట్టి భూమయ్య ఆధ్వర్యంలో కోతిరాంపూర్‌లోని గిద్దె పెరుమాండ్ల దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నారెడ్డితో పాటు పలువురు నాయకులు హాజరయ్యారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు వైద్యుల శ్రీదేవి అంజన్ కుమార్ ఆధ్వర్యంలో నగరంలోని సుభాష్‌నగర్‌లో ప్రభుత్వ పాఠశాలలో పేద విధ్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. మైత్రి కన్వెన్షన్ వద్ద 25వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు దీకొండ శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి హాజరై కేక్ కట్ చేశారు. 18వ డివిజన్ కాంగ్రెస్ ఇంచార్జి బాలబద్రి శోభారాణి శంకర్ ఆధ్వర్యంలో రేకుర్తి అంబేద్కర్ చౌరస్తా వద్ద కేక్ కట్ చేశారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ,రాజీవ్‌గాంధీ ఆశయాలను అంది పుచ్చుకుని మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా పోరాటం చేసి ఇండియా కూటమి 230కి పైగా సీట్లు సాధించి భారత రాజ్యాంగ వ్యవస్థను కాపాడడంలో సఫలీకృతుడైన రాహుల్ గాంధీ నేటి తరం యువ రాజకీయవేత్తలకు ఆదర్శప్రాయుడని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చర్ల పద్మ, పులి ఆంజనేయులు గౌడ్, శ్రావణ్ నాయక్, కర్ర సత్య ప్రసన్న, కొరివి అరుణ్ కుమార్, సిరాజ్ హుస్సేన్, వెన్నం రజిత, కుర్ర పోచయ్య, వంగల విద్యాసాగర్, నూనె గోపాల్ రెడ్డి, పోరండ్ల రమేష్, నెల్లి నరేష్, మంద మహేష్, పొన్నం మధు, జీడి రమేష్, ఎండి చాంద్, హస్తపురం తిరుమల, హసీనా, పర్వతం మల్లేశం, మెతుకు కాంతయ్య, కుంబాల రాజకుమార్, పొలాస వాసు, మాదాసు శ్రీనివాస్, ఆసిఫ్, పరదాల లింగమూర్తి తదితరులున్నారు. పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులకు, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ చైర్మన్ పోతాంశెట్టి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు కూడా వెంకటేష్, పిసిసి కార్యదర్శి ప్రమోద్ కుమార్, ఎంపీపీ నిర్మల, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అప్పుడు రూ.67,132.. ఇప్పుడు రూ.3.95 లక్షలు

రీఅసెస్‌మెంట్‌తో భారీగా పెరిగిన పారమితి బిల్డింగ్ ప్రాపర్టీ ట్యాక్స్

మొత్తంగా రూ.8.19 లక్షల వసూలుకు నోటీసులు

ప్రజాపక్షం కథనాలతో కదిలిన మున్సిపల్ యంత్రాంగం

ప్రజాపక్షం ఎఫెక్ట్

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః బల్దియాకు ఇన్నాళ్లు రావాల్సిన ప్రాపర్టీ ట్యాక్స్‌ను ఎగ్గొడుతున్న పారమిత స్కూల్ బిల్డింగ్ ఓనర్ బాగోతం బట్టబయలైంది. ప్రజాపక్షం దినపత్రికలో వచ్చిన వరుస కథనాలతో రెవెన్యూ సిబ్బంది రీ అసెస్‌మెంట్ చేసి ప్రాపర్టీ ట్యాక్స్‌ను లెక్కేశారు. పారమిత స్కూల్ బిల్డింగ్ పర్మిషన్, అసెస్‌మెంట్ లోపాలపై ప్రజాపక్షం దినపత్రిలో 'ఆరంతస్తులకు అనుమతి ఏదీ' అనే శీర్షికన ఈ నెల 11న ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో మున్సిపల్ రెవెన్యూ విభాగం సిబ్బంది వెళ్లి పూర్తి స్థాయిలో కొలతలు తీసుకుని రీ అసెస్‌మెంట్ చేశారు. పాత అసెస్‌మెంట్‌తో పోలిస్తే భారీ తేడాలు ఉన్నట్లు గుర్తించారు.

ఎట్టకేలకు మంగళవారం రాత్రి మున్సిపల్ కార్పోరేషన్ వెబ్‌సైట్‌లో పారమిత స్కూల్ బిల్డింగ్ రీ అసెస్‌మెంట్, చెల్లించాన ప్రాపర్టీ బకాయిల వివరాలను అప్‌డేట్ చేశారు. అలాగే రెసిడెన్షియల్ కేటగిరీ నుంచి నాన్ రెసిడెన్షియల్ కేటగిరీకి మార్చేశారు. వెనుకాల అనుమతి లేకుండా నిర్మించిన మూడంతస్తుల్లో నిర్మించిన రెండు బిల్డింగ్స్‌ను అసెస్‌మెంట్ చేసి ట్యాక్స్ వేసినప్పటికీ అనుమతి లేని రెండు బిల్డింగ్స్ వ్యవహారంపై మాత్రం మున్సిపల్ ఆఫీసర్లెవరూ నోరుమెదపడం లేదు. అలాగే పక్క ఉన్న వాల్‌మార్ట్ బిల్డింగ్ , ఇంకా రెసిడెన్షియల్ కేటగిరీ లోనే చూపడం విశేషం.

**పన్నుల్లో భారీ తేడాలు..**

కరీంనగర్ పద్మనగర్‌లోని పారమిత స్కూల్ బిల్డింగ్స్ 16261, 16261/3, 16261/3/1, 16261/3/2 ఇంటి నెంబర్లపై ఉన్నట్లు మున్సిపల్ ఆఫీసర్లు చెబుతున్నారు. ఇందులో 16261 నెంబర్‌పై గతంలో కేవలం రూ.2,082 ప్రాపర్టీ ట్యాక్స్ వేయగా ఇప్పుడు రీ అసెస్‌మెంట్‌తో రూ. 32,935కు చేరింది. 16261/3 నెంబర్‌పై ఉన్న బిల్డింగ్‌ను రీ అసెస్‌మెంట్ చేస్తే చెల్లించాల్సిన ప్రాపర్టీ ట్యాక్స్ రూ.1,10,456కు తేలింది. కానీ ఇన్నాళ్లు కేవలం రూ.5,486 మాత్రమే వసూలు చేయడం గమనార్హం.

ఈ ఒక్క బిల్డింగ్ మీద ట్యాక్స్ ఒకే సారి 22 రెట్లు పెరిగింది. అలాగే 162613/1 ఇంటి నెంబర్‌పై పాత అసెస్‌మెంట్ ప్రకారం రూ.5486 ట్యాక్స్ ఉంటే ఇప్పుడు అది రూ.22358 కి చేరింది. 16261/3/2 డోర్ నెంబర్‌పై గతంలో రూ.20,512 ఉంటే ఇప్పుడు రూ.32054కు పెరిగింది. మొత్తంగా పాత అసెస్‌మెంట్ ప్రకారం ఈ బిల్డింగ్ మొత్తానికి గతంలో రూ.33,566 ప్రాపర్టీ (ఆరు నెలలకు) చెల్లిస్తే రీ అసెస్‌మెంట్ తర్వాత అది రూ.1.97,803కు పెరగడం విశేషం. ఇది ఏడాదికి లెక్కగడితే రూ.3,95,606కు చేరింది. గత ఏడాదిన్నర (మూడు కిస్తీలు) ఏరియర్స్‌తో పాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డ్యూస్ మొత్తం కలిపి రూ.8,19,169 చెల్లించేలా డిమాండ్ నోటీసులు జనరేట్ చేశారు.

## ముడుపులు ముట్టందే.. ముందడుగు వేయరు

### భూమి సర్వేకు లక్షల్లో వసూళ్లు

**ప్రజాపక్షం/వెంకటాపూర్ :** దేశానికి వెన్నుముక రైతు అంటారు. కానీ రైతు భూమికి సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే అధికారులను ఆశ్రయిస్తే ఆయన వెన్నుముకను అధికారులను విరుస్తున్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రైతుల భూమి సర్వే చేయాలని అర్జీ, సర్వేయర్‌ను ఆశ్రయిస్తే లక్షల్లో వసూలు చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. మండలానికి చెందిన బొల్లవేని వీరస్వామికి చెందిన భూమి సర్వేకి రెవెన్యూ అధికారులను ఆశ్రయిస్తే లక్షల్లో అడుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు సాదా బైనామా అనే దాని పేరుతో రాష్ట్రంలో ప్రతి రైతుకు భూమి పట్టాలు ఇప్పించడం జరిగింది. అలా కొంత మంది రైతులు పట్టాలు రాకపోవడంతో తహసీల్దార్ వద్దకు రైతులు పోయినా భూమికి పట్టా కాలేదని అడుగుతున్నారు. అయినా గాని పట్టా అయిన భూములకే కొందరు ఒకటే భూమిపై గొడవ కావడంతో ఏ పాసుబుక్కు పట్టా వచ్చిన రైతు మీద కూడా కొంతమందికి గొడవ అవుతుంది. అది ఆసరా తీసుకున్న అర్జీ, సర్వేయర్ రైతుల వద్ద నుండి ఒక లక్ష నుండి రెండు లక్షల వసూలు చేస్తూ సర్వేలు చేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు ఎవరికి తెలవకుండా డబ్బులు వసూలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నారు. ఇరువర్గాల మధ్య డబ్బులు వసూలు చేస్తూ వారికే గొడవలు పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. దీనిపై వెంటనే అనుభవం లేని సర్వేయర్, రెవెన్యూ అధికారులపై రైతులు కోరుతున్నారు.

## విధులలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం

### కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ప్రజాపక్షం/జనగామ టౌన్:** విధులలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని, శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వైద్యులు, సిబ్బందిని హెచ్చరించారు. బుధవారం మండలంలోని పసరమడ్ల గ్రామ పంచాయితి పరిధిలోని చంపక్‌హిల్స్ మాతా, శిశు ఆరోగ్య కేంద్రంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. అనంతరం ఆసుపత్రి వైద్యులు, సిబ్బందితో సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు నిర్లక్ష్య దోరణిని వీడాలని, పేషంట్లకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సమయ పాలన పాటించాలన్నారు. పేషంట్లకు సక్రమంగా వైద్యాన్ని అందించాలన్నారు. మాతా, శిశు సంరక్షణ పట్ల నిర్లక్ష్యం వహించకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. అనంతరం కలెక్టర్ మెడికల్ కాలేజీని సందర్శించి పరిశీలించారు. మౌలిక వసతులను కల్పించాలని, ప్రయోగ శాలలో సరిపడా ప్రయోగ సామాగ్రిని అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత ప్రిన్సిపల్‌కు సూచించారు. ఈ తనిఖీలలో ఆయన వెంట ఎంసీహెచ్ ఆసుపత్రి సూపరిండెంట్ మధుసూధన్ రెడ్డి, మెడికల్ కాలేజి ప్రిన్సిపల్ గోపాల్‌రావు, వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీలో ఎన్‌పిడిసిఎల్ సిఎండి పర్యటన



**ప్రజాపక్షం/కొత్తగూడ:** బుధవారం ఏజెన్సి మండలాలైన కొత్తగూడ, గంగారం లో ఎన్పిడిసీఎల్ సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి పర్యటన చేశారు. కొత్తగూడ సబ్ స్టేషన్‌లో మొక్కలు నాటి విద్యుత్ పని తీరు అడిగి తెలుసుకున్నారు. పోలారం ఫిడర్ 75 కిలోమీటర్ల దూరం అటవీ ప్రాంతంలో ఇబ్బందిగా ఉందని స్థానిక ఏఇ సురేష్ తెలియపర్చడంతో ఆ ప్రాంతంలో మరోక సబ్ స్టేషన్ మంజూరు చేస్తానని అన్నారు. మండలంలోని బత్తులపల్లి, గోపాలపూరం గ్రామాలను సందర్శించి ప్రజలతో విద్యుత్ సరఫరా గురించి, గ్రామాల స్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ రంగ విద్యుత్ కోసం పెట్టుకున్న ఆర్జీలను త్వరితగతిన పరిష్కారం చేసేలా అధికారులు చూసుకుంటారని ప్రజలకు తెలిపారు. బత్తులపల్లి గ్రామంలో గిరివికాస పథకంలో మంజూరైన విద్యుత్ పనులను పరిశీలించారు. అనంతరం గంగారం మండలంలోని మడగూడెంలో 132 కెవి సబ్‌స్టేషన్ మంజూరి కావడంతో నిర్మాణం కోసం స్థలం స్థానిక సంబంధిత అధికారుల అనుమతితో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గంగారం మండలంలో విద్యుత్ అంతరాయం జరగకుండా ఇంకా రెండు సబ్ స్టేషన్‌లు అవసరం ఉందని స్థానిక అధికారులు తెలియపర్చడంతో మంజూరికి కృషి చేస్తానని అన్నారు. విద్యుత్ అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. రానున్న వర్షా కాలంలో విద్యుత్ అంతరాయం కలగకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని అదేశించారు. సీజీఎం రాజీవ్ చౌహన్, ఎస్ఇ జనగాం నరేష్, డిఇలు విజయ్, హర్షి నాయక్, అనిల్, ఏఇలు సురేష్, మైథిలి, సబ్ ఇంజనీర్ అనిల్ పాల్గోన్నారు.

## నకిలీ విత్తన బెడదను అరికట్టాలి

### కలెక్టర్ రాహుల్ శర్మ

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** రైతులు పంట సాగుకు సమయాత్తం అవుతున్నారని నకిలి విత్తనాల బెడదను అరికట్టేందుకు టాస్క్ ఫోర్స్ టీములు తనిఖీలు ముమ్మురం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాలు జారీ చేశారు.బుధవారం జిల్లా కలెక్టర్ చాంబర్‌లో వ్యవసాయ, ఉద్యాన వన శాఖ, జిల్లా ఇతర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 2,43,240 ఎకరాలలో వరి,పత్తి మిర్చి,ఇతర పంటలు సాగవుతున్నాయని రైతులకు విత్తనాలు,ఎరువులు ఎలాంటి కొరత లేకుండా అందుబాటులో ఉండాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో 45 వ్యవసాయ క్లస్టర్లు,45 రైతు వేదికలు ఉన్నాయని విత్తనాల ఎంపికలో రైతులకు సలహాలు సూచనలు ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌళిక వసతుల కల్పనకు 265 పాఠశాలలు మరమ్మతుల పనులు చేపట్టామని ఇప్పటివరకు 65 పాఠశాలలో పనులు పూర్తి కాగా మిగిలిన పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారి విజయ భాస్కర్,ఉద్యానవన శాఖ అధికారి సంజీవరావు,ఎస్సీ అభివృద్ధి అధికారి సునిత,మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారి నాగేశ్వరావు,డిఈవో రాంకుమార్,ఎస్సీకార్పోరేష్ ఈడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గోన్నారు.





అఖిత భారత కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ఎఐసిసి జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్‌ను పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝూన్సిరెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

## బిజెపి అరాచక పాలనను ఎండగడుతూ

# అనునిత్యం రాహుల్ పోరాటం

### మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/ పటాన్‌చెరు :** రాహుల్ గాంధీ ప్రజల మనిషి అని బిజెపి అరాచక పాలనను ఎండగడుతూ అనునిత్యం పోరాటం చేస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నా ఘనత రాహుల్‌గాంధీకి దక్కుతుందని తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని పటాన్‌చెరు పట్టణ అధ్యక్షులు ఐఎన్‌టియూసి జిల్లా అధ్యక్షులు కొల్లూరు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకలకు టిపిసిసి అధ్యక్షులు తూర్పు నిర్మల జగ్గారెడ్డి కాంగ్రెస్ నాయకులు నీలం మధు, కాట శ్రీనివాస్ గౌడ్‌లతో కలిసి మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని నీలం మధు నిన్నూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం జన్మించిన పిల్లలకు ఒక్కొక్కరికి రూ.10 వేల చెక్కును అందజేశారు. రాహుల్ జన్మదిన సందర్భంగా చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం వల్ల నీలం మధును మంత్రి కొండా సురేఖ అభినందించారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ భారత దేశ ఉజ్వల భవిష్యత్తుకు రాహుల్ గాంధీ నాయకత్వం అవసరమన్నారు. దేశంలో అన్ని వర్గాలకు న్యాయం జరిగి భారతను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో భారత్ జోడో యాత్ర చేపట్టి ప్రజల అందరిని ఏకం చేసి వారి మనసులను గెలుచుకున్న ఘనత రాహులకి దక్కుతుందన్నారు. మొన్న జరిగిన లోక్ సభ ఎన్నికల్లో నైతిక విజయం కాంగ్రెస్ దేనని అభిప్రాయపడ్డారు. ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేస్తూ ప్రజల మన్నలను పొందిన రాహుల్ గాంధీ భవిష్యత్తులో భారత ప్రధానిగా బాధ్యతలు చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. తాము రాహుల్ గాంధీని ప్రధానిచేయడం ఏ లక్ష్యంగా మెదక్ పార్లమెంట్ పరిధిలోని కాంగ్రెస్ నాయకులు శ్రేణులతో కలిసి కాంగ్రెస్ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా సైనికుల వలె కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొల్లూరు మల్లేష్, చంద్రారెడ్డి, సదర్ మల్లేష్, యూసుఫ్, గుండ్ల మహేందర్ రెడ్డి ,బ్లాక్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ రెడ్డి మున్సిపల్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి ,జైపాల్ రెడ్డి ప్రభాకర్ రెడ్డి మండలాధ్యక్షులు గ్రామ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి, మత్తు పదార్థాలను సమూలంగా నిర్మూలిద్దాం

### పోలీస్ కమిషనర్ అనురాధ



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** నార్కోటిక్ డాగ్స్ గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్ధాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి గంజాయి ఇతర మత్తు పదార్ధాలను సమూలంగా నిర్మూలిద్దామని జిల్లా పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ అన్నారు. డ్రగ్స్ మత్తు పదార్ధాల గుర్తించటంలో శిక్షణ పొందిన నార్కోటిక్ డాగ్ ద్వార జిల్లాలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. గుర్తించిన బ్లాక్ స్పాట్‌వద్ద వాహనాల తనిఖీలో డాగ్స్‌తో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించటం జరగుతుందన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్ధాల వాసనను పసిగట్టి వెంటనే తెలియజేస్తాయన్నారు. జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్ పరిధిలో డాగ్స్‌తో తనిఖీలు నిర్వహిస్తామన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో పలు ప్రాంతాల్లో డాగ్‌లతో తనిఖీలు నిర్వహించినట్లు సిపి తెలిపారు. గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్ధాలు సమూలంగా నిర్మూలించే విధంగా ప్రణాళికలు తయారు చేసినట్లు తెలిపారు. గంజాయి విక్రయించే వారితో పాటు, కొనుగోలు చేసేవారిపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. గంజాయి, ఇతర మత్తుపదార్ధాలపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరిస్తామన్నారు. జిల్లాలో ఏవరైన గంజాయి, డ్రగ్స్ ఇతరు మత్తు పదార్థాలు కలిగి ఉన్న రవాణ చేసిన ఇతరులకు విక్రయించిన 100కు డయల్ చేసి పోలీస్ కంట్రోల్ రూం వాట్సాప్ నెంబర్ 8712667100కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు.

## సమాజం నుండి సికిల్‌సెల్ వ్యాధిని నిర్మూలించాలి

### మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి :** సమాజం నుండి సికిల్‌సెల్ వ్యాధిని నిర్మూలించే విధంగా గిరిజన ప్రాంతాలలో అవగాహన శిబిరాలు ఏర్పాటు చేయాలని మంత్రి సీతక్క అన్నారు. ప్రపంచ సికిల్‌సెల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా మంత్రి సీతక్క పాల్గొని మాట్లాడుతూ సికిల్ సెల్ వ్యాధి రాకుండా చూసుకోవాలని, రక్తమార్పిడి లాంటివి చాలా కష్టంగా ఉంటాయని, ఈ వ్యాధితో ఎవ్వరూ మరణించకూడదని, వ్యాధి వచ్చిన వారికి, నిర్ధారణ జరిగిన వారికి, కౌన్సిలింగ్ ఏర్పాటు చేయాలని, గ్రామాలలో వైద్య సిబ్బంది, డాక్టర్లు అవగాహన కార్యక్రమాలు రోగ నిర్ధారణ శిభిరాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కలెక్టర్ దివాకర్, జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీజ, జిల్లా మెడికల్ కాలెజి ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌లాల్, జిల్లా ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ జగదీశ్వర్, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ పి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## అవగాహనతోనే వ్యాధిని నిర్మూలించవచ్చు

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** సరైన అవగాహనతోనే సికిల్ సెల్ వ్యాధిని నిర్మూలించవచ్చని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు.బుధవారం ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవ సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యలంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సికిల్ అనిమియా అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గోన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో సికిల్ సెల్ వ్యాధిపై సరైన అవగాహన లేక గుర్తించడంలో అలస్యం జరగడం వల్ల అనేక మంది ఈ వ్యాధి బారిన పడుతున్నారని తెలిపారు. బాధితులు వ్యాది పట్ల సరైన అవగాహన కలిగి ఉండాలని, వ్యాధి నిర్మూలనకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ సెగ్గం వెంకటరాణి సిద్దు,జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ మధుసూదన్,డిప్యూటి డిఎం అండ్ హెచ్ వో డాక్టర్ కొమురయ్య,సిహెచ్ వో రాజయ్య,శ్రీదేవి తదితరులు పాల్గోన్నారు.

## మెట్ల బావి పునరుద్ధరణకు ప్రతిపాదనలు

### సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశం



**ప్రజాపక్షం/వరంగల్ :** మెట్ల బావి పునరుద్దరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం వరంగల్ నగరంలోని 34వ డివిజన్ శివనగర్‌లోని చారిత్రాత్మక నేపథ్యం గల మెట్ల బావిని పర్యాటక, పురావస్తు, మున్సిపల్ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. మెట్ల బావి పునరుద్దరణకు చర్యలు చేపట్టుటకు గాను మెట్ల బావి ప్రాంతంలో అధికారులతో కలియ తిరుగుతూ సాంకేతికతతో సాంప్రదాయమైన పద్ధతిలో చేపట్టాల్సిన నవీకరణ పనులపై ఈ సందర్భంగా కలెక్టర్ చర్చించి పునరుద్దరణకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జీడబ్ల్యూంసీ ఆధ్వర్యంలో మెట్ల బావి పునరుద్దరణ పనులకు రూ. 50 లక్షలతో చేపట్టే పనులపై ఆరాతీసి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయుటకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా పర్యాటక శాఖాధికారి శివాజీ, కేంద్ర, రాష్ట్ర పురావస్తు శాఖ అధికారులు మల్లునాయక్, మల్లేశం, జీడబ్ల్యూఎంసీ ఈఈ శ్రీనివాస్, డీఈఓ వాసంతి, చరిత్ర కారుడు అరవింద్ ఆర్య తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు అసౌకర్యం కల్గించొద్దు

### హన్మకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా ఉపాధ్యాయులు ఉండకూడదని ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూడాలని హన్మకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. బుధవారం హసన్‌పర్తి మండలం హరిచంద్రనాయక్ తండా, అర్వపల్లి గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలలను కలెక్టర్ సందర్శించారు. రెండు గ్రామాల్లో మండల పరిషత్, ప్రాథమిక స్కూళ్లలోని విద్యార్థులకు తరగతి గదులు, బాత్‌రూమ్‌లు, తాగునీటి సౌకర్యాలను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న బాత్ రూమ్‌లు, నీటి వసతి నిర్మాణ పనులను తొందరగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సిఇఒ వేదవతి, డిఇఒ అబ్దుల్ హై, ఎంపిడిఒ ప్రవీణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు సుమలత, రత్నాకర్‌రెడ్డి, సెర్ప్ ఏపీఎం ఆకుల ప్రభాకర్, కమ్యూనిటీ కోఆర్డినేటర్ అనురాధ, ఈజీఎస్ ఏపీఓ విజయలక్ష్మి, ఎంపీపీ కేతపాక సునీత, ఎంఈఓ రామకృష్ణ రాజు, డీఈ, ఏఈ, గ్రామ సంఘాల అధ్యక్షులు తిరుపతమ్మ, జయంత, వీఓఏలు బిక్షపతి, వనిత తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ లీకేజీ

### పట్టించుకోని అధికారులు



**ప్రజాపక్షం/కమలాపూర్ :** కమలాపూర్ నుండి కన్నూరు గ్రామానికి మిషన్ భగీరథ ద్వారా వెళ్తున్న తాగునీరు సౌకర్యానికి సంబంధించిన పైపు లైన్ ద్వారా నీరు లీకేజ్‌తో వృధా అవుతుంది. దీని ద్వారా పంట పొలాల యజమానులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారు. తాగునీటి కోసం ఏర్పాటు చేసిన పైపులైన్‌ను సక్రమంగా ఉండేటట్లు చూసుకోకుండా నిర్లక్ష్యం వహిస్తూ రైతులని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పై అధికారులకు అనేక సార్లు విన్నవించినా నిమ్మకు నీరెత్తినట్లు నడుచుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపు లైనుల లింకుల లీకేజీలను పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు. అంతేకాక పొలాల్లో పంటలకు వేసిన రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల నీరు పైపులలోకి వెళ్ళడం ద్వారా ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. వీలైనంతా తొందరగా పనులు చేయకపోతే అధికారులని నిర్భంధం చేయవలసిన పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

## విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

### ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగది గదులను, కంప్యూటర్ ల్యాబ్ రూమ్, వంట గదులను ఆయన పరిశీలించారు. పాఠశాలలోని వసతులతో పాటు నాణ్యమైన భోజనం అందుతాందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం, ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. అందులో భాగంగా గురుకులాలు, కస్తూర్బా గాంధీ, మాడల్ స్కూల్, జిల్లా పరిషత్ హైస్కూల్‌లలో విద్యార్థులకు కనీస వసతులు కల్పించడానికి, పాఠశాలల వారీగా సమస్యలను తెలుసుకునేందుకే తనఖీలు చేస్తున్నట్లు వెల్లడించారు.ప్రతి నెలా ప్రతి ఒక్క పాఠవాలను తనిఖీ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని ఎవరైనా నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈనెల 21న జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా పరిధిలోని 5 మండలాల గురుకులాలు, కస్తూర్బా గాంధీ, మాడల్ స్కూల్, జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రిన్సిపల్స్, ప్రధాన ఉపాధ్యాయులు, స్పెషల్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంచాల ఎల్లయ్య, పీఏసీఎస్ చైర్మన్ కర్ణాకర్‌రావు, వైస్ ఎంపీపీ కొడారి కనకయ్య, నాయకులు రాజేష్ నాయక్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలల్లో స్టేషనరీ వ్యాపారం

### ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు



**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి :** ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు నోట్ బుక్స్, టై బెల్టులు అమ్మకూడదని ప్రభుత్వ జిఓ విడుదల చేసింది. ప్రభుత్వ నిబందనలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పాఠశాలల్లోనే స్టేషనరీ షాపులు ఏర్పాటు చేసి వ్యాపారం చేస్తున్నారు. విద్యార్థులకు కావాలసిన బుక్స్, టై, బెల్ట్ లు తప్పనిసరిగా మా పాఠశాలలోనే కొనుగోలు చేయాలని నిబంధనలు విద్యార్థుల తల్లిదండ్రులకు రుద్దుతున్నారు. పాఠశాలల్లో కొనకుంటే ఆది లేదు, ఇది లేదు అంటూ తప్పని సరిగా పాఠశాలలోనే కొనేలా ఒత్తిడి చేస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థులకు విద్యను మాత్రమే అందించాల్సి ఉంటుంది. స్టేషనరీ వ్యాపారం చేయవద్దంటూ ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోవడం లేదు. దీనికంతటికి విద్యాశాఖ అధికారుల సహకారంతో మూడు పువ్వుల ఆరు కాయలుగా స్టేషనరీ వ్యాపారం చేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన విద్యాశాఖ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇదే విధంగా పాఠశాల్లోకి విద్యార్థులు తప్పనిసరిగా టై బెల్టు, లు యూనిఫాం, స్టడీ మెటియల్ ఉంటేనే క్లాస్ రూంకి అనుమతిస్తారు లేదంటే ఇంటికి వెళ్లల్సిందే. ఇదే కొన్ని ప్రైవేట్ పాఠశాలలు చదువు కంటే ఎక్కువ స్టేషనరీ వ్యాపారం పైనే ఆదారపడి వ్యాపారం చేస్తున్నారు. ప్రతి సంవత్సరం విద్యార్థుల యూనిఫాం, టై బెల్టులను మార్చుతూ ప్రతి సంవత్సరం తప్పనిసరిగా కొనేలా చేస్తున్నారు. అదే విధంగా విద్యార్థులకు రోజు వారి షెడ్యూల్ కోసం ప్రత్యేక డైరీలను తయారు చేసి విక్రయిస్తున్నారు. దీని ద్వారా కూడా విద్యార్థుల తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

**అంట కాగుతున్న విద్యాధికారులు**

జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పేరు మోసిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు అడుగులకు విద్యాశాఖ అధికారులు మడుగులొత్తుతున్నారు. దీనిని అలుసుగా తీసుకున్న యాజమాన్యాలు ఏటికేడు పెద్ద ఎత్తున ఫీజును పెంచుతూ విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందుల పాల్చేస్తున్నారు. కొందరు పాఠశాలల యాజమాన్యాలు విద్యాశాఖ అధికారులకు పలు కార్యక్రమాలు మీటింగ్‌లకు తమ పాఠశాలలను వాడుకునేందుకు ఇస్తున్నారు. దీంతో మా కేంటి విద్యాశాఖ ఉన్నతాధికారులే తాము చెప్పినట్లు వింటారు. ఎవరు ఏం చెస్తారనే ధీమాతో ఇష్టం వచ్చిన రీతిలో ఫీజులు పెంచుతున్నారు. వారే పాఠశాలల్లో స్టేషనరీ వ్యాపారం చేస్తూ ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ లోపంతో ప్రభుత్వ నిబంధనలు అమలు కావడం లేదనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. వర్క్ బుక్‌లపై కూడా తమ పాఠశాలల పేర్లు ప్రింటింగ్ చేసి విద్యార్థులకు అంట గడుతున్నారు. తప్పని సరిగా పాఠశాలోనే పాఠ్య పుస్తకాలు యూనిఫాం, వర్క్ బుక్‌లు, టై బెల్టులు కొనవల్సిన పరిస్థితులు కల్పించారు.

**ప్రభుత్వాధికారులు నిర్లక్ష్యం**

ప్రైవేటు పాఠశాలలు తమ పాఠశాలల్లో స్టేషనరీ వ్యాపారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిఓ విడుదల చేస్తారు. విద్యార్థులకు ఏలాంటి ఇబ్బందులు ఉండకుండా పాఠశాల యాజమాన్యాల దోపిడి నుంచి విముక్తి కల్పించేందుకు ప్రభుత్వం సంకల్పిస్తే అవినీతి అధికారులు ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో యథేచ్ఛగా స్టేషనరీ వ్యాపారం చేస్తున్నా విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థులు తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విధ్యాశాఖ అదికారులు ఎక్కడా కూడా ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేసిన పాపాన పోలేదు. యాజమాన్యాలు ఇచ్చే కాసులకు కకుర్తి పడి వారు. ఏమి చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ప్రైవేటు పాఠశాలల్లో యాజమాన్యాలు చేస్తున్నా స్టేషనరీ వ్యాపారాన్ని అరికట్టాలని విద్యార్థ తల్లిదండ్రులు కోరుతున్నారు. అదే విధంగా ప్రతి ఏటా పెంచుతున్నా ఫీజులను అరికట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## నిర్మాణం పనుల్లో వేగం పెంచాలి : దివాకర్



**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి :** సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనులలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ములుగు మండలం బండారుపల్లి పరిధిలో 16 ఎకరాల స్థల విస్తీర్ణంలో రూ.47 కోట్ల నిధులతో పనులను జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ ఆకస్మికంగా తనిఖీ చేసి నిర్మాణ పనులలో వేగం పెంచాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో నిర్మాణ పనులకు అంతరాయం ఏర్పడితే బిల్డింగ్ అంతర్గత పనులను పూర్తి చేయాలని సూచించారు. కలెక్టరేట్ నిర్మాణ బ్లూ ప్రింట్‌ను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతి తమకు రోజు వారిగా తెలియజేయాలని, పనులలో నిర్లక్ష్యం వహించకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి శ్రీజ, డిఈ వెంకటరమణ, ఏఈ రాకేష్, ములుగు తహసీల్దారు విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## ల్యాబ్‌కు ఎమ్మెల్యే శంకుస్థాపన



ప్రజాపక్షం/సోన్ : మండలం లెఫ్ట్ పోచంపాడు గ్రామంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజీ లో కేంద్ర ప్రభుత్వ పి.యం.శ్రీ నిధులు 13.50 లక్షలతో సైన్స్ ల్యాబ్ నూతన భవన నిర్మాణానికి,బుధవారం ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపి నాయకులు సత్యానారాయణ గౌడ్, ఎంపీపీ బర్ల మానస హరీష్ మార మల్కవ్వ నారాయణ, నాయులు మార సరికేల గంగన్న, గోవర్ధన్‌రెడ్డి, ఉదయ్, రమేష్. శీను, అంజయ్య, నాగరాజు, మారుతి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీచైతన్య స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి : ఎఐఎస్‌ఎఫ్ డిమాండ్

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో నిబంధనల విరుద్ధంగా అధిక రేట్లకు పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్న ఆర్.ఎఫ్.సి.ఎల్ శ్రీ చైతన్య స్కూల్ పై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ చైతన్య స్కూల్ లోనే పాఠ్యపుస్తకాలను, యూనిఫాంసుని తీసుకోవాలని విద్యార్థులను వారి తల్లిదండ్రులను ఇబ్బందుల గురి చేస్తున్నారని ఆయన అన్నారు. ధనర్జనే ధ్యేయంగా పెట్టుకొని అధిక రేట్లకు పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్న శ్రీ చైతన్య స్కూల్ పై చర్యలు తీసుకోవాలని మండల, జిల్లా విద్యాధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ ఆ పాఠశాల పై చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్టుగా విద్యాధికారులు చేస్తున్నారని ఆయన అన్నారు. వాళ్ళు ఇచ్చే ముడుపులకు ఆశపడి విద్యాధికారులు చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారని ఆయన అన్నారు. ఇప్పటికైనా నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్న శ్రీ చైతన్య పాఠశాల పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున విద్యార్థులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

## నీట్ పేపర్ లీకేజీపై తక్షణమే స్పందించాలి : పిడిఎస్‌యు




ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడినా పట్టించుకొని కేంద్రం ఎంబీబీఎస్, ఇతర వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్‌యూజీ ఎంట్రన్స్ లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలకు సంబంధించి దేశవ్యాప్తంగా విద్యార్థులు,వారి తల్లిదండ్రుల్లో నెలకొన్న అనుమానాలను దేశ ప్రధాని మోదీ స్పందించక పోవడన్ని నిరసిస్తూ ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పి.డి.ఎస్.యూ నిర్మల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డా.బి.ఆర్.అంబేద్కర్ గారి విగ్రహం సర్కిల్ వద్ద ప్లకార్డులతో నిరసన కార్యక్రమం చేయడం జరిగిందని,పి.డి.ఎస్‌యూ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు వాగ్మారే మహేందర్ అన్నారు.బిహార్ లో రూ.30లక్షలకు నీట్ ప్రశ్నపత్రాలు విక్రయించారని,ఈ వ్యవహారంలో అరెస్టులు జరుగుతున్నాయని వార్తలు వస్తున్నప్పటికీ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమని మండి పడ్డారు.నీట్ పరీక్ష ఫలితాలలో 67 మందికి మొదటి ర్యాంకు ఎలా?నీట్ పరీక్షలో గతంలో ఎప్పుడూ లేని విధంగా ఏకంగా 67 మందికి మొదటి ర్యాంకులు రావడం ఎన్నో అవమానాలకు తావిస్తోందన్నారు.ఒకే సెంటర్ నుంచి పరీక్ష రాసిన 8మంది విద్యార్థులు 720 మార్కులు సాధించడం చూస్తే బీజేపీ హయాంలో పేపర్ లీకేజీ వ్యవహారం ఏ స్థాయిలో జరిగిందో అర్థమవుతోందన్నారు.ఫలితాలను 10 రోజులు ముందుకు జరిపి సరిగ్గా ఎన్నికల ఫలితాల రోజే ప్రకటించడం కూడా అనేక సందేహాలకు తావిచ్చిందన్నారు.ఇప్పటికైనా నీట్ పేపర్ లీకేజీ కి బాధ్యత వహిస్తు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(నీట్) చైర్మన్ ప్రదీప్ కుమార్ జోషి రాజీనామా చేయాలన్నారు.అలాగే మానిటరింగ్ చేయడంలో విఫలం చెందిన కేంద్ర ప్రభుత్వం ప్రజలకు,విద్యార్థులు సంజాయిషీ చెప్పాలని కేంద్ర ప్రభుత్వన్ని డిమాండ్ చేశారు. నీట్ నిర్వహణలో వివాదాలు నిత్యం జరుగుతున్న నేపథ్యంలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు,విద్యార్థులు కోరుతున్నట్లు నీట్ పరీక్షను రాష్ట్రాల పరిధిలోకి మార్చాలని కోచింగ్ సెంటర్ల పేరుతో,కన్సల్టెన్సీల పేరుతో పేపర్ లికేజీలు చేస్తున్న నీట్ కోచింగ్ సెంటర్ల అమనుమతులు రద్దు చేసి పేపర్ లీకేజీ కి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి నీట్ రాసిన విద్యార్థులకు న్యాయం చేయాలని నరేంద్ర మోడీ ప్రభుత్వన్ని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు పవార్. కిరణ్ విద్యార్థులు భూమిక, కావ్య, స్పందన, అఖిల, అనూష పాల్గొన్నారు.

## కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : పేదింటి ఆడబిడ్డలకు ఇంటికి పెద్ద దిక్కుగా కెసిఆర్ ఆలోచించి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకం కళ్యాణ లక్ష్మి అని ఆసిఫాబాద్ ఎంఎల్ఎ కోవ లక్ష్మి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో 66 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ తెలంగాణ ఆడబిడ్డలకు కళ్యాణ లక్ష్మి ఆర్థిక భరోసాగా నిలిచిందన్నారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసి గద్దెను ఎక్కిందని విమర్శించారు. అధికారంలోకి రాగానే కళ్యాణ లక్ష్మి తో పాటు తులం బంగారం ఇస్తాం అని మోసం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మండల జెడ్‌పిటిసి అరిగెలా నాగేశ్వర్ రావు, ఎంపిపి మల్లికార్జున్, సింగిల్ విండో ఛైర్మెన్ అలీ బిన్ అహ్మద్, వాంకిడి మండల జెడ్‌పిటిసి అజయ్ కుమార్, సింగిల్ విండో ఛైర్మెన్ పెంటూ, ఆసిఫాబాద్ తహసిల్దార్ శ్రీనివాస్ దేశ్ పాండే, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బోరువెల్, కిచెన్ షెడ్ ఏర్పాటు చేయాలని మంత్రికి వినతి



ప్రజాపక్షం/ముత్తారం : ముత్తారం మండలంలోని దర్యాపూర్ ఆదర్శ పాఠశాలలో బోర్వెల్ తోపాటు కిచెన్ షెడ్ (వంట రూమ్) అలాగే ఆదర్శ పాఠశాలలను ప్రభుత్వంలో విలీనం చేయాలని, 11 ఏళ్లుగా ఒకే చోట పని చేస్తున్న ఉపాధ్యాయులను బదిలీ చేయాలని ఉపాధ్యాయులు బుధవారం మంత్రి శ్రీధర్ బాబుకు వినతి పత్రం అందజేశారు.

# నైపుణ్యతతోనే మెరుగైన ఆదాయం





రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

ప్రజాపక్షం/మంథని : సమాజంలో మంచి నైపుణ్యం కల్గిన వారు విద్యావంతుల కంటే అధికంగా ఆదాయం సంపాదిస్తున్నారని, మంచి నైపుణ్యం ఉంటే మెరుగైన ఆదాయం సాధ్యమవుతుందని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. బుధవారం పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో న్యాక్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లను జిల్లా అదనపు కలెక్టర్ అరుణ శ్రీతో కలిసి అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి నైపుణ్యం ఉంటే దేశ విదేశాల్లో మంచి ఆదాయంతో అనేక ఉపాధి అవకాశాలు లబిస్తాయని అన్నారు. న్యాక్ శిక్షణ కేంద్రం ద్వారా ప్రజలకు అవసరమైన శిక్షణ అందించడం జరుగుతుందన్నారు, కుట్టు మిషన్‌లో శిక్షణ పొందిన మహిళలు తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ చేసుకోవాలని, బహిరంగ మార్కెట్‌లో నైపుణ్యం కల్గిన టైలరింగ్‌కు మంచి డిమాండ్ ఉందన్నారు. ఎంబ్రాయిడరీ వంటి విద్యల్లో సైతం శిక్షణ తీసుకుంటే మరింత ప్రయోజనం పొందవచ్చన్నారు. కుట్టు మిషన్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరికి మిషన్‌లు ఉచితంగా పంపిణీ చేస్తామని, ప్రభుత్వం తరపున అవకాశం ఉన్న మేరకు మహిళా సంఘాలకు దుస్తులను కుట్టే అర్డర్లు అందిస్తామన్నారు. యువతకు మంచి నైపుణ్యాలతో శిక్షణ అందించే దిశగా పెద్దపల్లిలో టాస్క్ కేంద్రంఏర్పాటు చేశామని, మంథనిలో సైతం ట్రెడ్స్ సంబందిత శిక్షణా కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళా సాధికారిత దిశగా ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించినట్లు ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పెంద్రి రమా సురేష్‌రెడ్డి, ఎంపీపీ కొండ శంకర్, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు ఐలి ప్రసాద్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు. అనంతరం బడిబాట ముగింపు కార్యక్రమంలో బాగంగా పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కలెక్టర్‌తో కలిసి ఆయన విద్యార్దులకు పాఠ్య పుస్తకాలు, యూనీఫాంలు అందజేశారు.

### రాహుల్‌గాంధీ ప్రధాని ఐతేనే దేశం మరింత అభివృద్ధి...

దేశం మరింత అభివృద్ధి చెందాలంటే రాహుల్ గాంధీ దేశ ప్రధానిగా కావాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు.అఖిలభారత కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు, రాయబారెల్లి ఎంపీ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం పెద్దపల్లి జిల్లా మంథనిలోని మంత్రి నివాసంలో నిర్వహించారు,ఈ సందర్భంగా మంత్రి చేతుల మీదుగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ బారత్ జూడో యాత్ర చేపట్టి దేశం మొత్తం పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకుని పార్లమెంట్‌లో ప్రస్తావిస్తూ పాలకుల కళ్లు తెరిపించి సమస్యల పరిష్కారానికి కృషి చేశారని గుర్తు చేశారు. రెండు సార్లు ప్రధానిగా అవకాశం వచ్చినా వద్దన్న నాయకుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు. విశిష్ట గుర్తింపు అయిన ఆధార్ కార్డు, ఉపాధి హామీ, నిర్భయలాంటి చట్టాలను ఆలోచన చేసింది రాహుల్ గాంధీ అని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఐలి ప్రసాద్, టౌన్ ప్రెసిడెంట్ పోలు శివ, ఎంపీపీ కొండ శంకర్, నాయకులు మంథని సత్యం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మానసిక, శారీరక ఉల్లాసానికి క్రీడలు దోహదం



కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : పిల్లల మానసిక, శారీరక అభివృద్ధిలో క్రీడలు ముఖ్య పాత్ర పోషిస్తాయని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. బుధవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులతో కలిసి కబడ్డీ ఆటలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వాన్ని కలిగించడంతో పాటు మానసిక ఉల్లాసానికి ఎంతగానో తోడ్పడుతాయని తెలిపారు. ఆటలు ఆడటం వలన విద్యార్థుల్లో స్నేహభావం, ఐకమత్యం పెంపొందుతాయని, ఒక జట్టుగా ఉండటం వల్ల కలిగే లాభాలను వివరించారు. ప్రతి ఒక్కరిలో పట్టుదల, కృషి వుంటే దేనినైనా సాధించగలుగుతామని, క్రీడల ద్వారా క్రీడాకారులకు సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అందరూ సమన్వయంతో ముందుకు సాగాలని, ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరవుతూ సమయపాలన తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించేందుకుగాను గొప్ప లక్ష్యంతో నిర్వహించిన బడిబాట కార్యక్రమం మంచి ఫలితాలను సాధించిందని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రజా సమస్యల పరిష్కారం దిశగా కృషి

కోమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. ఈనెల 12న రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) జిల్లా పర్యటనలో భాగంగా వాంకిడి మండలం సవాతి గ్రామంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులపై బుధవారం జిల్లాకేంద్రంలోని సమీకృత కార్యాలయాల భవన సముదాయంలోగల కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని పలు శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. విద్య, భవనాలు, రోడ్లు, భూములు, ఇండ్ల సమస్యలపై వచ్చిన ఫిర్యాదులపై వెంటనే పరిష్కారం చూపించాలని అధికారులకు తెలిపారు. రానున్నది వర్షాకాలం కావదంతో గిరిజన గ్రామాల్లో అత్యవసరమైన చోట రహదారుల నిర్మాణం, మరమ్మతుల పనులు సత్వరమే చేపట్టాలన్నారు. విద్య, వైద్యంకు ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ రాజస్వమండలాధికారి లోకేశ్వరరావు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్, విద్యాశాఖ అధికారి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, జిల్లా పంచాయితీ అధికారి భిక్షపతి, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీకాంత్, ప్రీతం





ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్లో ఆదివారం రోజున జిల్లా కౌన్సిల్ నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, జిల్లా నిర్మాణ బాధ్యులు తాండ్ర సదానందం ముఖ్య అతిథులుగా విచ్చేసి నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష & కార్యదర్శులుగా కల్వల శ్రీకాంత్ స్టాలిన్, రేణుకుంట్ల ప్రీతం, వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఆర్నకొండ సాయి ఆజాద్, ఉపాధ్యక్షులుగా మొలుగూరి నితిలేష్, సహాయ కార్యదర్శి కనుకుంట్ల సుమన్, కోశాధికారిగా ఎల్లపల్లి సురేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష & కార్యదర్శులు మాట్లాడుతూ పెద్దపెల్లి జిల్లా కేంద్రంలో విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న ఏకైక విద్యార్థి సంఘం ఏదైనా ఉన్నదంటే అది ఏఐఎస్ఎఫ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు మాతంగి సాగర్, గొడిసెల ప్రణీత్, గాజుల వినయ్, ఇరుగురాల హరీష్, జాడి శ్రీకాంత్, సరేష్, పప్పు శ్రీకాంత్ నందకిషోర్, ఎడవల్లి కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకుంటున్న కళాకారుల ప్రదర్శన



ప్రజాపక్షం/ముత్తారం : తెలంగాణ సాంస్కృతిక సారథి కళా బృందం సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కళాకారుల కళాజాత ప్రదర్శన ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటుంది. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం మైదంబండ గ్రామంలో నిర్వహించిన కొండ్ర వెంకన్న గౌడ్ కళాబృందం నిర్వహించిన ప్రదర్శనలో భాగంగా బడి బాట ప్రతి విద్యార్థి తల్లి తండ్రులు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, ఇంగ్లీష్ మీడియం విద్యాబోధన, మధ్యాహ్నం భోజనం లాంటి అన్ని సౌకర్యములు కల్పించడం జరుగుతుందని అందుకే విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోన్నే చదువుకునేలా ప్రతి తల్లి తండ్రి చొరవ తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సారథి కళాకారులు వెంకన్న గౌడ్, మల్లేష్ గౌడ్, రాజనర్సు, పద్మ, శ్రావణ్, శంకర్ గౌడ్, రాజన్న, రమ, రేణుక, శ్రీవల్లి, పాల్గొన్నారు.

# అంగన్‌వాడీలో కొత్త సిలబస్



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : ఇప్పుడున్న సిలబస్‌ను సరలీకృతం చేసి 3 నుంచి 6 సంవత్సరాలలోపు పిల్లలందరికీ అత్యంత నాణ్యతతో పూర్వ ప్రాథమిక విద్యను అంగన్ వాడీల్లోనే బోధించేందుకు మహిళా, శిశు సంక్షేమ శాఖ శ్రీకారం చుట్టింది. జాతీయ విద్యా విధానం, జాతీయ పాఠ్య ప్రణాళిక ప్రారంభ దశ, కేంద్ర మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ ఆదేశాలకు అనుగుణంగా ప్రత్యేకమైన సిలబస్‌ను సిద్ధం చేసింది. ఈ సిలబస్ ప్రకారం బోధించేందుకు ఇదివరకే శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లు ప్రస్తుతం జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లందరికీ శిక్షణ ఇస్తున్నారు.

### వచ్చే నెల 4 వరకు శిక్షణ

నూతన సిలబస ప్రకారం అంగన్‌వాడీ కేంద్రాల్లో బోధించేందుకు గాను అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ తరగతులు బుధవారం నుంచి ప్రారంభించామని జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి తెలిపారు. కరీంనగర్ అర్బన్, కరీంనగర్ రూరల్ ప్రాజెక్టుల పరిధిలో బుధవారం నిర్వహించిన ఈ శిక్షణ తరగతులకు హాజరై మాట్లాడారు. ఈ శిక్ష కార్యక్రమం వచ్చే నెల వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. జాతీయ విద్యా విధానం ప్రకారం 6 సంవత్సరాల లోపు పిల్లలంతా పూర్వ ప్రాథమిక విద్యకు మాత్రమే పరిమితం కావాలన్నారు. 3 నుంచి ఆరు సంవత్సరాల పిల్లల అవసరాలకు తగినట్లుగా ' 'ప్రియదర్శిని ' పూర్వ ప్రాథమిక విద్యా పాఠ్య ప్రణాళికను ప్రభుత్వం రూపొందించిందని తెలిపారు.

# జగిత్యాల లైబ్రరీ చైర్మన్ పదవికి ఆశావహులు ఎందరో!

* నేతల ప్రసన్నం కోసం ఆశావహుల ప్రయత్నాలు.
* సీనియారిటీ, సిన్సియార్టీకి ప్రాధాన్యత






ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి : జగిత్యాల జిల్లా గ్రంథాలయం చైర్మన్ పదవి నియామకానికి ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది.జిల్లాలో మైఖ్యమైన నామినేటెడ్ పదవి కావడం దీనిపై పలువురు సీనియర్లు ఆశలు పెంచుకున్నారు. ప్రభుత్వం నామినేటెడ్ పదవుల్లో సీనియారిటీ, సిన్సియార్టీక ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. జగిత్యాల జిల్లాలోన జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గ ల్లో కాంగ్రెస్ నుండి కేవలం అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధర్మపురి నుండి ఎమ్మెల్యేగా విజయం సాధించి ప్రభుత్వ విప్ గా కొనసాగుతున్నారు. మిగతా రెండు చోట్ల బీఆర్ఎస్ కు చెందిన ఎమ్మెల్యేలు గెలుపొందారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి, కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ జువ్వాడి ఇంచార్జి నర్సింగరావులున్నారు. వారం రోజులుగా లైబ్రరీ చైర్మన్ నియామకం చేయనున్నారని ప్రచారం ఊపందుకోగా దానికోసం పలువురు నేతలు ఆశిస్తూ, తమ నేతలను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాల్లో ఉన్నట్టు తెలుస్తోంది. జిల్లాలో సీనియర్ నేత తాటిపర్తి జీవన్ రెడ్డి ఆశీస్సులు ఉన్నవారికే ఈ పదవి వరించనుందని రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది. జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు చొప్పదండి, వేములవాడ అసెంబ్లీ పరిధిలో రెండేసి మండలాలున్నాయి. లైబ్రరీ చైర్మన్ పదవి జగిత్యాల జిల్లాకు సంబంధం ఉన్న అంశం కావదంతో ఎమ్మెల్సి జీవన్ రెడ్డి, ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్, కోరుట్ల ఇంచార్జి జువ్వడి నర్సింగరావు లు చర్చించి ఏకాభిప్రాయంతో చైర్మన్ ఎంపిక చెయ్యాల్సి ఉంటుంది. అయితే ఈ పదవికి ప్రముఖంగా వినిపిస్తున్న పేర్లు జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, అడ్వకేట్,కాంగ్రెస్ నాయకులు గుంటి జగదీశ్వర్, మాజీ లైబ్రరీ చైర్మన్ చంద్ర శేఖర్ గౌడ్, టీపీసీసీ నాయకులు బండ శంకర్, ధర్మపురి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంఘనబట్ల దినేష్ తదితరుల పేర్లు ప్రముఖంగా వినిపిస్తుండగా ఎవరికి వారు తమవంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. పదవి నాదేనంటూ కొందరు ప్రచారం చేసుకుంటుంటే దానిపై ఆశలు పెంచుకున్న మరికొందరు తమ నేతల వద్ద ఎలాగైనా లైబ్రరీ చైర్మన్ పదవి దక్కించుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఒకరి పేరు ప్రతిపాదించారని వారికే ఆ పదవి దక్కుతుందని జగిత్యాల జిల్లాలో చర్చలు జోరుగా సాగుతున్నాయి. ఎమ్మెల్యేగా గెలిచి ప్రభుత్వ విప్ గా కొనసాగుతున్న లక్ష్మణ్ కుమార్ డీసీసీ అధ్యక్ష పదవిని కాంగ్రెస్ అధిష్టానం వేరేవారికి కట్టబెడితే 'అడ్లూరి' ధర్మపురి నియోజకవర్గనికి లైబ్రరీ చైర్మన్ కావాలని ఎమ్మెల్సీ మెప్పించి పదవికోసం పట్టుబట్టే అవకాశాలు లేకపోలేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# సికిల్ సెల్ నిర్మూలనకు కృషి

కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాపక్షం/ మంచిర్యాల ప్రతినిధి : ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో పూర్తి స్థాయిలో సికిల్ సెల్‌ను నిర్మూలించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని మందమర్రి పట్టణంలో గల ఆదర్శ ప్రభుత్వ పాఠశాలలో సికిల్ సెల్ పక్షోత్సవాలను జిల్లా పరిషత్ చైర్పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాహుల్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా ఎస్. అనితతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భారత ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జూలై 3వ తేదీ వరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు సికిల్ సెల్ నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, మందమర్రి పట్టణంలో 430 మందికి పరీక్షలు నిర్వహించడం జరిగిందని, జిల్లాలోని 149 ఉప కేంద్రాలు, 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె దవాఖానాలు, బస్తీ దవాఖానాలలో ఆశ కార్యకర్తల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి గంగారాం, ప్రోగ్రాం అధికారి డా ఫయాజ్, ఎన్‌హెచ్ఎం డిపిఒ ప్రశాంతి, సబ్‌యూనిట్ అధికారులు నాందేవ్, సత్యనారాయణ, వైద్యాధికారి డా రమేష్, పాఠశాల ప్రిన్సిపల్ జయకృష్ణారెడ్డి, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, అల్లాడి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# రూ.2.50 లక్షలు పరిహారం సిగ్గుచేటు

బిఎంఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ధ్వజం

ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ : పెద్దపల్లి నియోజకవర్గంలో సభ్యసమాజం తలదించుకునేలా ఆరేళ్ళ బాలికపై హత్యాచారం జరిగితే స్థానిక ప్రజాప్రతినిధి బాధిత కుటుంబాన్ని పరామర్శించకపోవడం సిగ్గుచేటని భారతీయ మజ్దూర్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు బూర్ల లక్ష్మీనారాయణ ధ్వజమెత్తారు. బుధవారం ప్రెస్‌క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కంది శ్రీనివాసుతో కలిసి ఆయన మాట్లాడుతూ, సుల్తానాబాదులో ఆరేళ్ళ పసిబిడ్డపై జరిగిన హత్యాచారాన్ని తీవ్రంగా ఖండించారు. దారుణానికి ఒడిగట్టిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. సంఘటన జరిగిన మూడు రోజులకు ప్రజాప్రతినిధులు స్పందించడం వారి చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. బాలిక కుటుంబానికి అండగా ఉండి, రైస్ మిల్ యాజమాన్యంతో మాట్లాడి రూ.5లక్షల పరిహారం ఇచ్చేలా ఒప్పించగా, మంత్రులు వచ్చి కేవలం రూ.2లక్షల యాభై వేలు మాత్రమే ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. డబ్బున్నోడికి అన్యాయం జరిగితే రూ.20లక్షల వరకు పరిహారం ఇప్పించే నాయకులు, పేదవాడికి జరిగినప్పుడు మాత్రం అరకొర పరిహారం ఇప్పించి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. బాధితురాలి కుటుంబానికి రూ.20లక్షల పరిహారం, అమ్మాయి తండ్రికి ప్రభుత్వ ఉద్యోగం, ఇంటిస్థలం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బిఎంఎస్ ఆధ్వర్యంలో కార్మికుల పక్షాన ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు.

## గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు, బకాయిలు చెల్లించండి

ఎఐటియుసి హన్మకొండ జిల్లా అధ్యక్షుడు సారంగపాణి



**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికుల సమ్మె కాలంలో చెల్లించాల్సిన వేతనాలు ఆరు నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని హన్మకొండ కలెక్టరేట్‌లోని జిల్లా గ్రామపంచాయతీ అధికారికి తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ హన్మకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి హన్మకొండ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి, ప్రధాన కార్యదర్శి జక్కు రాజుగౌడ్ హాజరై మాట్లాడుతూ.. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్నపుడు కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా కార్మికులందరికీ కనీస వేతనాలు, ఇతర సమస్యలన్నీ మేము అధికారంలోకి వస్తే పరిష్కరిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నిలబెట్టుకోవాలన్నారు. డీపీఓ మాట్లాడుతూ.. మీరు అవినీతిపై పరిశీలించి పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మిక యూనియన్ జిల్లా నాయకులు సారయ్య, రమేశ్, సుధాకర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలి

సిడిపిఒ ఐసిడిఎస్‌కు ఎఐటియుసి వినతి



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** రాష్ట్ర అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ ఎఐటియూసి పిలుపు మేరకు నిర్మల్ సిడిపిఓ ఐసిడిఎస్‌కు అంగన్‌వాడీల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసాచారి మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ చాలీచాలని జీతంతో పనిచేస్తున్నారన్నారు. పదవీ విరమణకు రూ.2లక్షలు, కనీస వేతనం రూ.26000లు ఇవ్వాలని తదితర సమస్యలపై 2023లో 24 రోజుల సమ్మె చేశామని, దీని ఫలితంగా గత ప్రభుత్వంతో ఒప్పందం అయిందన్నారు. కాని ప్రస్తుత ప్రభుత్వం పదవీ విరమణ వారికి రూపాయలు 1లక్ష, 50 వేల జీఓ తీసిందన్నారు. దీనిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టీఏ, డిఏలు టిఏ బిలు ఇవ్వాలని, అదనంగా వేస్తున్న డ్యూటీలు రద్దు చేయాలని, పెండింగ్ అద్దెలు, గ్యాస్ బిల్లులు చెల్లించాలని, ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు,హెల్పర్స్ పోస్టులు భర్తీ చేయాలని, అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించాలని, ఉన్న అంగన్‌వాడీలలో టాయిలెట్స్, తాగు నీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని, డ్యూటీలో కాని ఆరోగ్య సమస్యలతో ఉద్యోగం కోల్పోయిన వారి కుటుంబంలో ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేస్తూ నిసిడిపిఓ కార్యలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యస్.విలాస్ ఎఐటియూసి రాష్ట్ర కార్యదర్శి ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలియజేశారు. కార్యక్రమంలో పి.పద్మకుమారి, రాష్ట్ర ఉపాధ్యక్షులు, అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ ఎఐటియూసి, రమాదేవి జిల్లా ప్రధాన కార్యదర్శి సునీత, గీత పాల్గొన్నారు.

## పస్తులు ఉంటున్న ప్రభుత్వ ఆసుపత్రి కాంట్రాక్టు కార్మికులు

ఎఐటియుసి జిల్లా కార్యదర్శి సునీల్



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఏడు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేస్తుంటే కాంట్రాక్ట్ కార్మికులను ఏం తిని బతకమంటారు అంటూ కడారి సునీల్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం సుల్తానాబాద్ ర్‌డెంట్, ఆర్ఎమ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడు నెలల వేతనాలు పిఎఫ్ వ్యక్తి గత స్లిప్పులు ఇవ్వాలని, ప్రభుత్వ గెజిట్ జీవో ప్రకారంగా రూ.15,500 వేతనం ఇవ్వాల్సి ఉండగా కేవలం 10,500 చెల్లిస్తూ చేతులు దులుపుకున్నారన్నారు. కనీసం జీతాలు ఎప్పుడు ఇస్తారు అని అడిగే స్వేచ్ఛ కూడా కార్మికులకు లేదన్నారు. వేతనాలు చెల్లించి వ్యక్తిగత పిఎఫ్ స్లిప్పులు అందించి ప్రభుత్వ జీవో ప్రకారంగా వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాధా రమేష్, రాకేష్, అనిల్, రమ్యశ్రీ, సునీత నాగమణి, సాహిత్య, హేమ, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

## పత్రికారంగంలో విప్లవాత్మక మార్పులకు రామోజీరావు శ్రీకారం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యవర్గసభ్యులు చాడ వెంకట్‌రెడ్డి

ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో 'రామోజీరావు యాదిలో' 'స్మృతి గీతం' సిడి ఆవిష్కరణ





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రతికారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారంచుట్టిన గొప్పకలం యోధుడు రామోజీరావు అని పలువురు సిపిఐ, ప్రజాసంఘాల నేతలు కొనియాడారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో 'రామోజీరావు యాదిలో' పేరుతో రూపొందించిన 'స్మృతి గీతం' సిడి ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దుంభవన్‌లో జరిగింది. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, ఇప్టా జాతీయ ఉపాధ్యక్షులు కందిమళ్ల ప్రతాపరెడ్డి, సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు ఇటి నరసింహ, మహిళ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఎన్.జ్యోతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రామోజీరావు తన తొలినాళ్లలో కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా ఉండడం గర్వ కారణంగా భావిస్తున్నామన్నారు. ఎంతో విశ్వసనీయతతో కూడిన వార్తలు అందించడం ఆయన నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు. కేవలం ఈనాడు పత్రిక మాత్రమే కాకుండా ఈ-టివిలో విలువలతో కూడిన వార్తలను అందించడంలో రామోజీ రావు ఆయనకు ఆయనే సాటి అన్నారు. అలాంటి వ్యక్తి స్మృతి గీతాన్ని ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు పల్లె నర్సింహ రచించడమే కాకుండా పాడడం అభినందనీయమన్నారు. రామోజీరావు మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేయడంతో పాటు సిపిఐ తరుపున వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నామన్నారు. చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన రామోజీరావు ఉద్యోగ అన్వేషణలో హైదరాబాద్‌కు వచ్చి అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్న ఆయన ఆ తరువాత దేశ రాజకీయాలనే ప్రభావితం చేసే స్థాయికి ఎదిగిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. రామోజీరావు వేల కోట్ల వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నప్పటికీ ఆయన ఎంత ఎదిగారో అంతే ఒదిగి ఉన్నారని అన్నారు. కందిమళ్ల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ రైల్వే ఉద్యోగం కోసం ప్రయత్నించి విఫలమైన రోజే రామోజీరావు తానే వేలాది మందికి ఉద్యోగం కల్పించే స్థాయికి ఎందుకు ఎదగకూడదనే పట్టుదలతో అనుకున్న గమ్యాన్ని అందుకున్న మహోన్నత వ్యక్తి అన్నారు. రామోజీరావు అడుగు పెట్టిన ప్రతి రంగానికి ఓ చరిత్ర ఉందన్నారు. ఆయన ఏ వ్యాపారం చేసినా సామాజిక కోణంలోనే చేశారన్నారు. అసలైన సామాజిక కార్యకర్త రామోజీరావు అని కొనియాడారు. రామోజీరావు తన జీవితాంతం ఏ లక్ష్యం కోసమైతే శ్రమించారో దాని ప్రతిరూపమే రామోజీ ఫిలిం సిటీ అని కందిమళ్ల ప్రతాపరెడ్డి చెప్పారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి కళాకారులు పాల్గొన్నారు.

## చరిత్రను తిరగరాసేది యువ కమ్యూనిస్టులే

ప్రొఫెసర్ చింతకింద కాశీం



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు యాదాద్రి జిల్లా యాదగిరిగుట్టలో రెండవరోజు కొనసాగాయి. ఈ శిక్షణా తరగతులకు ముఖ్యతిథులుగా ప్రొఫెసర్ కాసిం హాజరై కులం, మతం, వర్గం వర్గ పోరాటాలు సామాజిక న్యాయం అనే సబ్జెక్టు సుదీర్ఘమైన అంశంపై మాట్లాడారు. దేశంలో దోపిడీ వర్గం, దోపిడీకి గురయ్యే వర్గాల మధ్య పరిపాలన సాగుతుందన్నారు. ఇందులో తరతరాల వర్గం నుండి దళితవర్గం అణిచివేతకు గురైతు అనేక రకాలుగా అసమానతలకు, అవమానాలకు హత్యలకు, మానభంగాలకు అత్యాచారాలకు గురైతున్న వారందరినీ చేరదీసి సమనత్వం కోసం పోరాడి కమ్యూనిస్టు పార్టీ, వారికి అండగా ఎర్రజెండా పార్టీ నిలిచిందన్నారు. చరిత్రను కూడా తిరగరాసేది యువ కమ్యూనిస్టులె అని పేర్కొన్నారు. రష్యాలో కమ్యూనిస్టు పార్టీ డెబ్బై ఏళ్లు పరిపాలించి అక్కడ ఎలాంటి వర్గ పోరాటాలు లేకుండా అక్కడి ప్రజలందరూ సమానులే అని అందరికీ సమాన హక్కులు కల్గించిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ, అక్కడి వారసత్వాన్ని పనికి పుచ్చుకోని ఈ భారత దేశంలో సిపిఐ అధికారం దీశగా తీసుకరవానికి డిహెచ్‌పిఎస్ నాయకులు, కర్యకర్తలు, సమిష్టి కృషితో పోరాడి అధికారంలోకి తీసుకురావాలన్నారు. అంబేద్కర్‌కు మన దేశంలో అనేక అవమానాలు, ఇబ్బందులకు గురిచేసిన ఎదుర్కొని ధైర్యంతో ఉన్నత చదువులు చదివి అమెరికా లాంటి అగ్రదేశాలకు వెళ్ళినప్పుడు అక్కడివారితో ఉన్న సంబంధాలు చూసి అక్కడి వారు తన పై చూపించే అభిమానాన్ని చూసి చలించిపోయాడు, ఎందుకంటే మన దేశంలో కులం నాకు అడ్డు వచ్చేది, కానీ అగ్ర దేశాలలో నేను చదివిన ఉన్నత చదువులు చదివిన నన్ను గుర్తించి అగ్ర దేశాల వారు అన్ని వర్గాల వారితో కూర్చోబెట్టుకొని కలిసి బోజనాలు చేసుకుంటూ సమిష్టి నిర్ణయాలతో నా సలహాలు తీసుకునేవారని గుర్తు చేశారు. భారత దేశంలో కూడా ఆ విధానాలు రావాలంటే ఇక్కడ కులమతాలకు అతీతంగా ముందుకు సాగేందుకు అన్ని వర్గాల వారికి సమ న్యాయం జరిపేందుకు రాజ్యాంగం రచించిన అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని, కార్ల్ మార్క్స్, లెనిన్ ఆశయ సాధనలో వారిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరుపాక అనిల్‌కుమార్, సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములుతో పాటు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లెం కృష్ణ, ఏశాల అశోక్, చెక్క వెంకటేష్, బబ్బురి శ్రీధర్, లక్ష్మి పతి,లావణ్య యేసు రత్నం, తాళ్లపల్లి లక్ష్మ ణ్, రాజారత్నం, రత్నకుమారి, జైకుమారస్వామి, గోరేటి రాములు, కాశపాక దయాకర్, ఎల్లంకి మహేష్, ఉప్పుల శాంతికుమార్, పెరబోయిన బంగారు, అరే పుష్ప, మద్దూరి భాగ్య, మునికుంట్ల నరసమ్మ, ఇంజా హేమలత, సూరారం జానీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులు నియంత్రించండి

ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్ధన్

**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్ :** సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్, కార్పోరేట్ విద్యా సంస్థలు విద్యా వ్యాపారానికి తెరలేపాయని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తూ విద్యాశాఖ ఉత్తర్వులను బేఖాతరు చేస్తున్నాయని, అలాంటి విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి జేరిపోతుల జనార్ధన్ తెలిపారు. బుధవారం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ విద్యాసంస్థలను గుర్తించి,పర్మిషన్ లేకుండా పడుస్తున్న పాఠశాలలను సీజ్ చేయాలని. పుస్తకాలు,యూనిఫామ్ పేరిట దోపిడీ చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఎడి వెంకటేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వేల్పుల ప్రసన్నకుమార్,జిల్లా నాయకులు బానోత్ నవీన్,జక్కుల అనిరుద్,సిద్దుల సుమన్ తదితరులు పాల్గొన్నారు.



## కరెంటు కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమబాట



**ప్రజాపక్షం/నల్లగొండ :** దీర్ఘకాలికంగా కరెంటు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని, సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమబాట తప్పదని 1104 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సాయిబాబు హెచ్చరించారు. యూనియన్ నల్లగొండ జిల్లా ప్రాంతీయ సర్వజన సమావేశం బుధవారం నల్లగొండ పట్టణంలో జరిగింది. యూనియన్ పతాకాన్ని ఎగురవేసి ఆయన మాట్లాడారు. విద్యుత్ ఉద్యోగులు అనునిత్యం వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రాణాలను ఫణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నారన్నారు. విద్యుత్ సంస్థలో పని చేస్తున్న ఉద్యోగుల 52 సమస్యలపై ఇప్పటికే యాజమాన్యానికి నోటీస్ అందజేసి పిఎన్‌సి మీటింగ్ అడగడం జరిగిందని, ఈ సమస్యల పరిష్కారం కాకుంటే ఉద్యోగుల పక్షాన ఉద్యమ బాట పట్టవలసి ఉంటుందని విద్యుత్ యాజమాన్యాలకు హెచ్చరించారు. సమావేశానికి నల్లగొండ జిల్లా ప్రాంతీయ అధ్యక్షులు వెంకటయ్య అధ్యక్షత వహించగా రాష్ట్ర అధ్యక్షులు వి.వెంకటేశ్వర్లు, ఎస్‌పిడిసిఎల్ కంపెనీ అధ్యక్షులు ఎ.వేణు, వర్కింగ్ అధ్యక్షులు ఎన్. వెంకన్న యూనియన్ రాష్ట్ర సలహాదారులు ఆర్.జనార్దన్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు టి జైపాల్ రెడ్డి, జిల్లా అదనపు కార్యదర్శి టి శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షులు పి రాంబాబు, సర్కిల్ ఆఫీస్ అధ్యక్షులు డి కోటి, సిహెచ్ యాదగిరి, కె. జగదీష్, కె. సీనయ్య, పి.వి నాయక్, బి ముత్తయ్య, అయుబ్ పాషాలు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి

నీట్ పరీక్ష అవకతవకలపై స్పందించకుంటే కేంద్రమంత్రులను అడ్డుకుంటాం

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయి లు వెంటనే విడుదల చేసి విద్యార్థులకు అండగా ఉండాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో నిర్వహించిన సమావేశంలో మణికంఠరెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థలు ఫీజుల దోపిడీ చేస్తూ అక్షరాలతో విద్యా వ్యాపారం చేస్తున్నారని, అరికట్టేందుకు ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలన్నారు.నీట్‌పరీక్షలో జరిగిన అవకతవకలపై , పేపర్ లీకేజీలపై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ జరిపించాలని, 24 లక్షల విద్యార్థుల జీవితాలతో ఎన్డిఏ నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రధాని మోడీ స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి నీట్ విద్యార్థులకు జరిగిన అన్యాయంపై మాట్లాడకపోవడం సరికాదని, వారు నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని, లేని పక్షంలో వారిని రాష్ట్రంలో ఎక్కడికక్కడ అడ్డుకుంటామని మణికంఠరెడ్డి హెచ్చరించారు. గత మూడు సంవత్సరాల నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు సకాలంలో విడుదల చేయడంలో అప్పటి కెసిఆర్ ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందన్నారు. ప్రస్తుతం విద్యాసంవత్సరం పూర్తయిన విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం కళాశాలలకు వెళితే యాజమాన్యాలు రీయింబర్స్‌మెంట్ రాలేదని, ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని చెబుతున్నారన్నారు. ఫీజులు కట్టలేక, సర్టిఫికెట్లు తీసుకోలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో బడ్జెట్ కళాశాలలు సైతం కళాశాలల భవన కిరాయిలు కట్టలేక, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నారని, వెంటనే ప్రభుత్వం విద్యార్థులకు అండగా ఉండి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలన్నారు. రాష్ట్రంలో ప్రైవేట్ కార్పోరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఫీజుల దోపిడీ చేస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫాంలు అమ్ముతున్నా వేలాది రూపాయలు ఫీజు లు వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు ఫీజుల దోపిడీని అరికట్టడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో, సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని దెబ్బతీసే విధంగా నీట్ నిర్వహణ ఉందని దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు చెప్పినా పట్టించుకోవడం లేదని, నీట్ పరీక్షను ఏ రాష్ట్రం వారు వారే నిర్వహించుకునేలా కేంద్రం నిర్ణయం చేయాలన్నారు. సమావేశంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేష్, జిల్లా కోశాధికారి అలువాల విష్ణు, నాయకులు అనిల్ కుమార్, తౌకీర్, అనిల్ రెడ్డి, సాయి, వంశీ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## నెట్ పరీక్ష రద్దు (మొదటి పేజీ తరువాయి)

ఈ నిర్ణయం తీసుకున్నట్టు కేంద్ర విద్యాశాఖ తెలిపింది. ఈ అవకతవకలపై సిబిఐ విచారణ జరిపించాలని నిర్ణయించింది. పరీక్షల పారదర్శకతకు కట్టుబడి ఉన్నామని కేంద్ర విద్యాశాఖ స్పష్టం చేసింది. మరోవైపు నీట్ పేపర్ లీకేజీపై వస్తోన్న ఆరోపణలపైనా కేంద్రం స్పందించింది. సమయం కోల్పోయిన విద్యార్థులకు కలిపిన గ్రేస్ మార్కులు రద్దు చేస్తూ ఇప్పటికే నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. పట్నాలో నీట్ అవకతవకలపై పోలీసులు విచారణ చేస్తున్నారని వెల్లడించింది. ప్రాథమిక ఆధారాల మేరకు నీట్‌లో అవకతవకలు జరిగినట్టు నిర్ధరణకు వచ్చామని, బీహార్ ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకుంటుందని పేర్కొంది.

**నీట్ అక్రమాలపై రేపు కాంగ్రెస్ నిరసనలు...** మరోవైపు నీట్‌లో అనేక అక్రమాలు జరిగాయని, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్ర ప్రధాన కార్యాలయాల్లో కాంగ్రెస్ నిరసనలు చేపట్టనుంది. ఈ మేరకు అన్ని రాష్ట్రాల చీఫ్‌లు, కాంగ్రెస్ శాసనసభా పక్ష నేతలు, రాష్ట్ర ఇన్‌చార్జ్‌లు, ప్రధాన కార్యదర్శులు, ఇతర ముఖ్య కార్యకర్తలకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తక్షణమే స్పందించాలన్నారు. 'మీకు తెలిసినట్లుగానే, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) నీట్ 2024 ఫలితాలను 4 జూన్ 2024న విడుదల చేసింది. కొందరు అభ్యర్థులకు పెంచిన మార్కులను అనుసరించి అక్రమాలు మరియు పేపర్ లీక్‌ల ఆరోపణలతో ఫలితాలు దెబ్బతిన్నాయి' అని పేర్కొన్నారు.

## త్వరలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు

(మొదటి పేజీ తరువాయి)

వివాదం ఉందని వాటికి క్లియరెన్స్ వచ్చినప్పటికీ గత ప్రభుత్వం స్థలాలు ఇవ్వలేదన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత మీడియా అకాడమీ చైర్మన్‌గా ఐజెయు జాతీయ అధ్యక్షులు కె.శ్రీనివాసరెడ్డిని నియమించామన్నారు. ఆయన జర్నలిస్టుల సమస్యలపై సమగ్రంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వివరించారని వారితో చర్చించి జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు ఇచ్చే విషయంలో ఒక సమగ్రమైన పాలసీని తీసుకు వస్తున్నామని మంత్రి తెలిపారు. ఖమ్మం నగరంలో ఇదివరకే జర్నలిస్టుల ఇండ్లస్థలాల కేటాయింపుకు జీవో ఇచ్చారని, ఆ జీవో అమలుకు కొంతపని ఉన్నప్పటికీ దానిని పరిష్కరించి కొద్దిరోజుల్లోనే ఖమ్మం జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయిస్తామన్నారు. జీవో ప్రకారం స్థలం కొంత తక్కువగా ఉన్నందున వేరే చోట ఆ స్థలాన్ని కేటాయించే విషయంలో జిల్లాకలెక్టర్‌తో తాను మాట్లాడి సాధ్యమైనంత త్వరగా స్థలాలు కేటాయించాలని ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. అక్రిడేషన్స్, హెల్త్‌కార్డులు వంటి జర్నలిస్టుల డిమాండ్లు సమాంజసమైనవని అవి గొంతెమ్మ కోర్కెలు కావని మంత్రి తెలిపారు. అక్రిడేషన్ రెన్యువల్ మరో మూడునెలల వరకు చేయాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి తెలిపారు.

**జర్నలిస్టులు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలి : కె.శ్రీనివాసరెడ్డి**

వర్కింగ్ జర్నలిస్టులు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. సమాజంలో ఆ వృత్తి పట్ల గౌరవాన్ని పెంచుకునే బాధ్యత కూడా వర్కింగ్ జర్నలిస్టుల పైనే ఉందని ఆయన తెలిపారు. మహాసభల్లో ఆయన ప్రసంగిస్తూ గత పదేళ్ల నుండి ఒక సమాచార శాఖ మంత్రి జర్నలిస్టుల వేదిక పై కూర్చోవడం ఇదే తొలి సారని ఆయన అన్నారు. గత పదేళ్లుగా జర్నలిస్టులు తమ సమస్యలను చెప్పుకునేందుకు నాటి ముఖ్యమంత్రిని కలిసే అవకాశం లేదని ఇక సమాచార శాఖ అంతర్థానమై పోయిందని ఆయన తెలిపారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలనే ఒక మంచి ఉద్దేశం ఉన్న వ్యక్తి సమాచార మంత్రి కావడం సంతోషకరమన్నారు. దేశంలో మోడల్ ప్రెస్‌క్లబ్ అనే బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టబోతున్నారని ఆయన తెలిపారు. ఆ బిల్లును న్యాయకోవిదులు, ఐఏఎస్ అధికారులు కలిసి రూపొందించారని శ్రీనివాసరెడ్డి తెలిపారు. అదే తరహా బిల్లును తెలంగాణ రాష్ట్రంలో అమలుకు తేవాలని సూచించారు. గత ప్రభుత్వం అకాడమీకి రూ. 100 కోట్లు కేటాయించినట్లు తాను ఓ పత్రికలో చదివానని తాను చైర్మన్‌గా వచ్చిన తర్వాత అది నిజం కాదని తేలిందని ఇలాంటి అవాస్తవ ప్రకటనలు మానుకోవాలని హితవు పలికారు. జర్నలిస్టుల ఉద్యమం రెండు తెలుగు రాష్ట్రాల్లో బలంగా ఉందని ఆయన తెలిపారు. 20 ఏళ్ల తర్వాత తనను మళ్లీ మీడియా అకాడమీ చైర్మన్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రికి, తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సభలో ఐజెయు మాజీ అధ్యక్షులు ఎస్ఎన్ సిన్హా మాట్లాడుతూ జర్నలిజం ప్రస్తుతం ప్రమాదంలో ఉందని నిత్యం దాడులతో కాలం గడుస్తుందన్నారు. జర్నలిస్టులపై దాడులను అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడేందుకు జర్నలిస్టు వ్యవస్థ స్వేచ్ఛగా సాగాలన్నారు. ఈ సభలో ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్ అధ్యక్ష ఉపాన్యసం చేశారు. మాజీ ఎంఎల్‌ఏ గుమ్మడి నర్సయ్య, జెడ్పి చైర్మన్ లింగాల కమల్‌రాజు, ఐజెయు మాజీ అధ్యక్షులు దేవులపల్లి అమర్ తదితరులు ప్రసంగించారు. ఈ మహాసభల్లో ఐజెయు సెక్రటరీ జనరల్ బల్విందర్ సింగ్ జమ్ము, రాష్ట్ర గిడ్డంగుల నిర్వహణ సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎంఎల్‌సి పోట్ల నాగేశ్వరరావు, ఐజెయు స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎంఏ మజీద్, ఐజెయు కార్యదర్శులు వై. నరేందర్ రెడ్డి, డి. సోమసుందర్, జాతీయ కార్యవర్గ సభ్యులు కల్లూరి సత్యనారాయణ, ఆళ్లపాటి సురేష్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. రాంనారాయణ, ఖమ్మంజిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**సౌహార్థ ప్రతినిధుల రాక :** రాష్ట్ర మహాసభలకు సౌహార్థ ప్రతినిధులుగా వివిధ రాష్ట్రాల నుంచి ఐజెయు నాయకులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ అధ్యక్షులు ఐవి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందు జనార్థన్, తమిళనాడు రాష్ట్ర అధ్యక్షులు డిఎస్ఆర్ సుభాష్, పాండి చ్చేరి రాష్ట్ర అధ్యక్షులు మత్తి మహారాజా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర అధ్యక్షులు పిసి రాత్, కర్నాటక రాష్ట్ర అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, మహారాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యర్శులు శ్రీనివాస్, గుండారి ప్రమోద్ కారత్, ప్రధాన కార్యదర్శి అశోక్, రాష్ట్ర ఫోటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షులు గంగాధర్, ప్రధాన కార్యదర్శి హరి తదితరులు హాజరై ప్రసంగించారు. సభకు ముందు గత మహాసభ నుండి ఇప్పటి వరకు అమరులైన జర్నలిస్టులకు మహాసభ నివాళులర్పించింది. రాష్ట్ర వ్యాప్తంగా మరణించిన జర్నలిస్టులతో పాటు ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు మృతికి ప్రత్యేక నివాళులర్పించింది.

## స్ఫూర్తికి విరుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

సహకార సమాఖ్య సారాంశానికి విరుద్ధమని పేర్కొన్నారు. కువైట్ అగ్నిప్రమాదంలో మరణించిన కార్మికులలో సగానికి పైగా కేరళకు చెందిన వారేనని విజయన్ పేర్కొన్నారు. కువైట్ విపత్తు తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న కేరళ మంత్రి వర్గం రాష్ట్ర మంత్రిని కువైట్ పంపాలని నిర్ణయించిందని లేఖలో పేర్కొన్నారు. పరిస్థితిని నిశితంగా పరిశీలించడానికి, భారత రాయబార కార్యాలయంతో సమన్వయం చేసుకోవడానికి, బాధితులు, గాయపడిన వారి కుటుంబాలకు ఓదార్పు అందించేందుకు మంత్రి వీణాజార్జ్‌ను కువైట్ పంపడం ఉపయోగకరంగా ఉండేది. కానీ ఎంఈఏ నుండి రాజకీయ అనుమతి లభించకపోవడంతో కేరళ ఆరోగ్యమంత్రి కువైట్ పర్యటన నిలిచిపోవడం దురదష్టకరం. రాష్ట్రప్రభుత్వం బాధ్యతలు నిర్వర్తించేందుకు కేంద్రం అనుమతులు నిరాకరించడం దారుణమని లేఖలో పేర్కొన్నారు. ఈ ఘటనపై వివాదాన్ని రేకెత్తించడం తన ఉద్దేశం కాదని, ప్రజలు విపత్తులు, ప్రమాదాలు ఎదుర్కొన్నప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో వ్యవహరించాలన్న సమాఖ్య వ్యవస్థ సిద్ధాంతాలకు విరుద్ధంగా కేంద్రం వ్యవహరించిందని విజయన్ విమర్శించారు. భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే అభ్యర్థనలకు ఎంఈఏ బాధ్యతాయుతంగా స్పందించేలా చూడాలని విజయన్ లేఖలో ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com

## పిఇసెట్‌లో 96.48 శాతం ఉత్తీర్ణత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిపిఈడి, డిపిఇడి కోర్సులలో ప్రవేశాలకు నిర్వహించే ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పిఈసెట్) 2024 పరీక్షలో 96.48 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బిపిఈడికి 1650 మంది దరఖాస్తు చేయగా, 1198 మంది పరీక్షకు హాజరయ్యారు. ఇందులో 1156 మంది(96.49 శాతం) ఉత్తీర్ణత సాధించారు. డిపిఈడికి 742 మంది దరఖాస్తు చేయగా, 507 మంది పరీక్షకు హాజరయ్యారు. ఇందులో 489 మంది ఉత్తీర్ణత సాధించారు. హైదరాబాద్‌లోని ఉన్నతవిద్య మండలి కార్యాలయంలో ఉన్నత విద్య ఛైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి బుధవారం ఫలితాలను విడుదల చేశారు. ఈ నెల 10 నుంచి 13 వరకు ఫిజికల్ ఫిట్‌నెస్ అండ్ స్కిల్ టెస్టులను నిర్వహించారు. 10, 11వ తేదీల్లో పురుషులకు, 12, 13వ తేదీల్లో మహిళలకు పరీక్షలను నిర్వహించారు.

## పిఎఫ్ ట్రస్ట్ కోల్పోయిన డబ్బు రూ.300కోట్లు

### ఆర్‌టిసి బోర్డ్ మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పిఎఫ్ ట్రస్ట్ కోల్పోయిన డబ్బు కనీసం రూ. 300 కోట్లు ఉంటుందని ట్రేడ్ యూనియన్ సీనియర్ నాయకులు, ఆర్‌టిసి బోర్డ్ మాజీ డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావు తెలిపారు. ఆర్‌టిసి కార్మికుల వేతనాల నుంచి చట్టబద్ధంగా 12 శాతం చొప్పున నెలవారీ రికవరీలు చేస్తూ పిఎఫ్ ట్రస్ట్‌కు చెల్లించకుండా రూ. 1200 కోట్లను ఇప్పటికే అక్రమంగా దారి మళ్లించారని, ఈ విషయంలో చట్టాన్ని ఉల్లంఘిస్తున్న ఆర్‌టిసి ఎండిపై తీవ్ర చర్యలు తీసుకోవాలని ఎం.నాగేశ్వర రావు డిమాండ్ చేశారు. చట్ట ప్రకారం వివిధ విభాగాల్లో ఇన్వెస్ట్‌మెంట్ చేయక పోవడంతోనే పిఎఫ్ ట్రస్ట్ రూ. 300 కోట్ల డబ్బును కోల్పోయిందని నాగేశ్వరరావు తెలిపారు.

# ఐసిసిసిలో సిఎం క్యాంప్ కార్యాలయం

### ఐసిసిసిలో ఉన్న కొత్వాల్ కార్యాలయం డిజిపి కార్యాలయంలోకి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(ఐసిసిసి)లో ఏర్పాటు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. కాగా సిఎం రేవంత్‌రెడ్డి నెల రోజుల వ్యవధిలో ఇక్కడి ఆయా శాఖల పనితీరును సమీక్షించడంతో దీనికి బలం చేకూరుస్తుంది. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత ఇంతవరకు సిఎం క్యాంప్ కార్యాలయం ఏర్పాటు చేయలేదు. గతంలో బేగంపేటలోని ప్రగతి భవన్‌లో ఉన్న క్యాంప్ కార్యాలయాన్ని ప్రజా భవన్‌గా మార్చి ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఐసిసిసికి సిఎం రెండుసార్లు వచ్చిపోవడంతో తన క్యాంప్ కార్యాలయం ఇక్కడే ఏర్పాటు చేసుకుంటే బాగుంటుందని అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. ఈ మేరకు అధికారులు పావులు కదుపుతున్నారు. భద్రతాపరంగా కూడా ఇది అనువైన ప్రాంతం కావడంతో సిఎం దీనిపైనే మక్కువ చూపినట్లు తెలిసింది. బేగంపేట్ లోని ప్రగతిభవన్‌లోనే సిఎం క్యాంప్ కార్యాలయం ఉండేది. ఇక్కడి నుంచే అప్పటి దివంగత సిఎం రాజశేఖర్‌రెడ్డి, బిఆర్‌ఎస్ సిఎం కెసిఆర్‌లు కార్యకలాపాలు కొనసాగించారు. అయితే కొత్తప్రభుత్వం రాగానే సిఎం రేవంత్‌రెడ్డి సిఎం క్యాంప్ కార్యాలయాన్ని ప్రజాభవన్‌గా మార్చారు. ప్రజలు వచ్చి తమ సమస్యలను చెప్పుకునేందుకు వీలు కల్పించారు. దీంతో ఇక్కడ ఉన్న సిఎం క్యాంప్ కార్యాలయం ఎత్తివేశారు. మరోచోట సిఎం కార్యాలయం ఏర్పాటు చేయాలని చూస్తున్న తరుణంలో రేవంత్‌రెడ్డి చూపు ఐసిసిసిపై పడింది. అన్ని హంగులు కలిగిన ఐసిసిసిలోనే తన క్యాంప్ కార్యాలయం ఏర్పాటు చేయడం వల్ల ఎలాంటి ఆటంకాలు ఉండవని సిఎం భావిస్తున్నారు. దీంతో ఇందుకు కావాల్సిన పనులను చక్కబెట్టడంలో అధికారులు భిజిభిజిగా ఉన్నారు.



**ఐసిసిసిలోని కొత్వాల్ కార్యాలయం మార్పు..?** ఐసిసిసిలో ఎబిసిడిఇ 19 అంతస్తులవి రెండు, 16 అంతస్తులవి రెండు, ఏడు అంతస్థుల ఒక టవర్స్ ఉన్నాయి. ఈ ఐదు టవర్స్‌లకు వచ్చిపోయే గేటు ఒక్కటే ఉంది. ఏడో అంతస్తుదైన ఇ టవర్‌లో సిఎం, సిఎస్, హెచ్‌ఎం, డిజిపి ఛాంబర్‌లు ఉన్నాయి. మిగతా టవర్‌లో ఆయా ప్రభుత్వశాఖలకు సంబంధించిన సిసికెమెరాలతో కూడిన కమాండ్ కంట్రోల్ రూమ్‌లతో పాటు పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి కార్యాలయం ఉంది. ఈ కార్యాలయానికి ప్రతిరోజు వందలాది పోలీసులు, బాధితులు వచ్చివెళ్తుంటారు. అలాంటప్పుడు ఇక్కడ సిఎం క్యాంప్ కార్యాలయం ఏర్పాటైతే వీరికి తీవ్ర ఇబ్బందులు తప్పవు. దీంతో కమిషనర్ కార్యాలయాన్ని డిజిపి కార్యాలయంలోకి మార్చాలని అనుకుంటున్నారు.

**ఐసిసిసిలోకి డిజిపి కార్యాలయం...** లక్డికాపూల్‌లోని డిజిపి కార్యాలయాన్ని ఐసిసిసిలోకి మార్చాలని భావిస్తున్నారు. ఇప్పటికే ఐసిసిసిలో డిజిపికి ఛాంబర్ కూడా ఉంది. దీన్నె డిజిపి కార్యాలయంగా మార్చాలని అనుకుంటున్నారు. ఇలా చేయడం ద్వారా ఐసిసిసిలో సిఎం క్యాంప్ కార్యాలయంతో పాటు డిజిపి కార్యాలయం ఏర్పాటు చేయడం ద్వారా సిఎంకు డిజిపి అందుబాటులో ఉండడం పరిపాలన సులభతరమౌతుందని అధికారుల అంచన.

**ఐసిసిసి స్టేట్ హబ్...** ఐసిసిసి టవర్స్ స్టేట్ హబ్‌గా నిలిచింది. ఇందులో ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంమంత్రి, డిజిపి ఛాంబర్‌లు కలిగి ఉన్నాయి. అలాగే ఆయన ప్రభుత్వ శాఖలకు చెందిన కమాండ్ కంట్రోల్ రూమ్‌లు కూడా ఇక్కడే ఉన్నాయి. దీంతో ఈ టవర్‌కు స్టేట్ హబ్‌గా నిలబడింది. ఈ స్టేట్ హబ్‌లో హైదరాబాద్ కమిషనర్ కార్యాలయం ఉండడంతో స్టేట్ హబ్ ప్రాధాన్యత దెబ్బతింటుందనే ఉద్దేశ్యంతో ఇక్కడ ఉన్న కమిషనర్ కార్యాలయాన్ని లక్డికాపూల్‌లోని డిజిపి కార్యాలయంలోకి, ఇక్కడ ఉన్న డిజిపి కార్యాలయాన్ని ఐసిసిసి స్టేట్ హబ్‌లోకి మార్చలని అధికారులు నిర్ణయించినట్లు సమాచారం.

## కోదండరామ్‌ను విమర్శించే నైతిక అర్హత జగదీష్‌రెడ్డికి లేదు : ధర్మార్జున్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యుత్ కొనుగోలు, విద్యుత్ కేంద్రాల నిర్మాణంలో అంశంలో గత ప్రభుత్వ అవినీతిని కోదండరామ్ వాస్తవాలను వివరించినందుకు మాజీ మంత్రి జగదీష్ రెడ్డి రెచ్చిపోయి మాట్లాడుతున్నారని టిజెఎస్ ప్రధాన కార్యదర్శి ధర్మర్జున్ మండిపడ్డారు. కోదండరామ్‌ను విమర్శించే కనీస నైతిక అర్హత జగదీష్ రెడ్డికి లేదని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యాదాద్రి, భద్రాద్రి పవర్ ప్లాంట్‌ను కాలం చెల్లిన టెక్నాలజీ తో నిర్మిస్తున్నారని, అధిక ధరలతో పక్క రాష్ట్రాల నుండి విద్యుత్ కొనుగోలు చేస్తున్నారని తాము టిజెఎసిగా 2016 సంవత్సరం నుండే మాట్లాడుతున్నామని గుర్తు చేశారు. సాంకేతిక నిపుణుల సమక్షంలో జరుగుతున్న విచారణలో తమ అవినీతి అక్రమాల బయటపడుతుందనే భయంతోనే జగదీష్ రెడ్డి సమస్యను పక్కదారి పట్టించేందుకు అవాకులు,చేవాకులు పేలుతున్నారని పేర్కొన్నారు. విచారణ కమిషన్ ముందు వాంగ్మూలం ఇచ్చిన వారిపైన దాడి చేయడమంటేనే జగదీష్ రెడ్డి ఉలిక్కిపాటుకు కారణం అర్థం అవుతుందన్నారు. ఎక్కడ జైలుకు పోవాల్సి వస్తుందోనని బిజెపి నాయకులతో రహస్య మంత్రాంగం నడుపుతున్నారని ఆయన ఆరోపించారు.

## జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయండి

### షాద్‌నగర్ డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మీ



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని షాద్‌నగర్ డిప్యూటి డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి కోరారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ షాద్‌నగర్ డివిజన్‌లోని 1వ సంవత్సరం నుండి 19ఏళ్ల వరకు 85,776మంది బాలికలకు ఆల్ బెండజోల్ మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. ఏ ఒక్క పిల్లవాడ్ని వదలకుండా విధిగా నులి పురుగుల మాత్రలు వేయనున్నట్లు పేర్కొన్నారు. డివిజన్‌లోని 312అంగన్‌వాడి కేంద్రాల్లో 11,202మంది పిల్లలు ఉన్నారని, 256 ప్రభుత్వ పాఠశాలల్లో 36,540మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. 9జూనియర్ కళాశాలల్లో 421మంది విద్యార్థులు ఉన్నారని, మొత్తం 85,776మంది విద్యార్థులు ఉన్నట్లు వివరించారు. వారందరికి విధిగా నులి పురుగుల నియంత్రణ మాత్రలు వేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులు ఉన్నారు.

## కార్మికుడి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా

### బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య డిమాండ్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పౌల్ట్రి రేకులపై నుండి పడి మృతిచెందిన కార్మికుడి కుటుంబానికి రూ.పదిలక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని బికెఎంయు రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని పీర్లగూడ శివారులో యశ్వంత్‌రావు పౌల్ట్రీఫారంలో ప్రమాదశాత్తు పైనుండి కిందపడి ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న బికెఎంయు నేతలు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బుద్దుల జంగయ్య మాట్లాడుతూ పౌల్ట్రి రేకులను సరిచేసేందుకు అనుభవం లేని కార్మికుడిని షెడ్‌పైకి ఎక్కించడంతోనే ప్రమాదం చోటు చేసుకుందని మండిపడ్డారు. యాజమాన్యం నిర్లక్ష్యంతోనే కార్మికుడి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయని, వారి కుటుంబానికి 10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన వద్దె మల్లేష్‌కు భార్య రజిత, కుమార్తె ఉన్నట్లు తెలిపారు. నష్ట పరిహారం ఇవ్వకుంటే ఆందోళన చేపట్టనున్నట్లు హెచ్చరించారు.

## రోడ్డు మరమ్మతులు చేయాలని కమిషనర్‌కు వినతి



**ప్రజాపక్షం/నార్సింగి:** మణికొండ మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాలలో రోడ్లు గుంతలమయమై అధ్వాన్నంగా ఉన్నాయని తాగునీరు, మురుగునీటి వ్యవస్థ,, విద్యుత్, ట్రాఫిక్ ప్రధాన సమస్యలుగా గుర్తించి పరిష్కరించాలని మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్‌కు ది సిటిజన్స్ కౌన్సిల్ సభ్యులు అందే లక్ష్మణరావు, శేఖర్, ఆరిఫ్ మహమ్మద్, ఉపేందర్ రెడ్డి బుధవారం వినతిపత్రం అందించారు. ది సిటిజన్ కౌన్సిల్ సభ్యులు మాట్లాడుతూ హైదరాబాద్ నగరానికి అతి చేరువలో ఐటీ రంగంలో దిన దినాభివృద్ధి చెందుతున్న ప్రాంతాలన్నిటికి ప్రక్కనే ఉన్న మణికొండ ఎత్తైన నిర్మాణాలు ఉన్నాయన్నారు. మణికొండ, పుప్పాలగూడ, నెక్నంపూర్ గ్రామ పరిసర ప్రాంతాలలో రోడ్డు వెడల్పు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్‌రావు, ప్రధాన కార్యదర్శి శేక్ ఆరిఫ్ మొహమ్మద్, కార్యదర్శి ఉపేంద్రనాథ్‌రెడ్డి, కోశాదికారి దిలీప్‌కక్కడ్ పాల్గొన్నారు.

## అక్షరయోధుడు రామోజీరావు




**ప్రజాపక్షం/వనస్థలిపురం:** అచంచలమైన దీక్షతో, పట్టుదలతో నిరంతరం శ్రమించి అత్యున్నత స్థానానికి చేరుకున్న రామోజీరావు జీవితం ఎంతో స్ఫూర్తిదాయకమైనదని ప్రభుత్వ సిటీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు ప్రొఫెసర్ కోయ కోటేశ్వర్ రావు అన్నారు. మంగళవారం వనస్థలిపురంలో మదర్ తెరెసా చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనాడు సంస్థల చైర్మన్ రామోజీరావు సంతాప సభ ఏర్పాటు చేసి వారి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా ప్రొఫెసర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిక, సినిమా, పారిశ్రామిక రంగాల్లో రామోజీరావు గణనీయమైన మార్పులు తీసుకువచ్చారని ఆయన తెలిపారు. ముఖ్యంగా ప్రచురణ, ప్రసార మాధ్యమాల్లో ఆయన విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. తెలుగు భాషా పరిరక్షణకు రామోజీరావు ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వై.యాదయ్య, చేపూరి శంకర్, అజయ్ కుమార్, జయంత్, హర్ష, సువర్ణ, సురేష్, గౌతమ్, చైతన్య, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించేందుకు చర్యలు

### ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటామని, ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిరంతరం అందుబాటులో ఉంటానని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం షాద్‌నగర్‌లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి బిఆర్‌ఎస్‌కు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బూత్ స్థాయి నుండి మండల స్థాయి వరకు బిఆర్ ఎస్ పటిష్టం చేసేందుకు కృషి చేస్తామని, ఏ కార్యకర్త కూడా నిరుత్సాహ పడరాదని పేర్కొన్నారు. పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలోనే పని చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ వై.అంజయ్య యాదవ్, మున్సిపల్ చైర్మెన్ నరేందర్, కౌన్సిలర్ బచ్చలి నర్సింలు, నేతలు పిల్లి శేఖర్, కిశోర్, శివచారి, గుట్ట రాజు ఉన్నారు.

# రైతు శ్రేయస్సు ప్రభుత్వ లక్ష్యం

### షాద్‌నగర్ ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** రైతు శ్రేయస్సు ప్రభుత్వ లక్ష్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కంసాన్‌పల్లి గ్రామ సమీపంలో ఉన్న ఘనీకృత వీర్య నాళికల ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరీ కారణంగానే ఘనీకృత వీర్య నాళికల ఉత్పత్తి కేంద్రాన్ని ఎవరు పట్టించుకోలేదన్నారు. ఘనీకృత వీర్య నాళికల ఉత్పత్తి కేంద్రంలో 90బుల్స్‌ను ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉందని, దాంతో 11లక్షల వీర్య ఖనాలు ఉత్పత్తి చేసేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అన్నదాతలకు మేలురకం జాతి పశువులను అందించేందుకే ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. కార్యక్రమంలో టిపిసిసి సభ్యుడు బాబర్‌ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్, పురుషోత్తంరెడ్డి, కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, అంజత్, అధికారులు శ్రావణ్‌కుమార్, సునిత, రవితేజలు ఉన్నారు.





### ప్రజాసమస్యలపై పోరాడే ఏకైక వ్యక్తి రాహుల్‌గాంధీ

ప్రజా సమస్యలపై పోరాడే వ్యక్తి రాహుల్ గాంధీ అనే విషయాన్ని ప్రతి ఒక్కరు గ్రహించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం షాద్‌నగర్ పట్టణంలోని ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారీ కేక్‌ను కట్ చేసి అభిమానులకు తినిపించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకునేందుకే కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు రాహుల్‌గాంధీ భారత్ జోడో పాదయాత్ర చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో జడ్పిటిసి వెంకట్‌రాంరెడ్డి, టిపిసి సభ్యుడు బాబర్‌ఖాన్, నేతలు చెంది తిరుపతిరెడ్డి, బాల్‌రాజ్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, పురుషోత్తంరెడ్డి, అందె మోహన్ ముదిరాజ్, సయ్యద్ ఖదీర్, రాజేష్ గౌడ్, రాయికల్ శ్రీనివాస్, లింగం, మురళిమోహన్, శ్రీహరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

### రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** ఒకటి నుండి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ తప్పనిసరిగా నులి పురుగుల నివారణ మాత్రలు వేయించాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ తెలిపారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో కరపత్రాలు, గోడప్రతులను అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నులి పురుగుల వల్ల పిల్లలలో ఎదుగుదల లోపించడం,మందబుద్ధి, రక్తహీనత, చదువుపై ఏకాగ్రత కోల్పోవడం వంటి రుగ్మతలకు వారు లోనవుతారన్నారు. దీనిని నివారించేందుకు ప్రభుత్వం ప్రతియేటా రెండు పర్యాయాలు నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేయిస్తోందని చెప్పారు. ఇందులో భాగంగా ఈ నెల 20న జిల్లా వ్యాప్తంగా అన్నివసతిగృహాలు, విద్యాసంస్థలు, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు, కిశోర బాలబాలికల సంఖ్యకు అనుగుణంగా అల్బెన్ డజోల్ మాత్రలు పంపిణీ జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని సూచించారు. ఏవైనా కారణాల వల్ల మాత్రలు తీసుకోలేకపోయిన వారికి జూన్ 27వ తేదీన అందజేసేలా చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా జిల్లాలో ఒకటి నుండి 19 సంవత్సరాల వయస్సు కలిగిన 8 లక్షల 9 వేల మంది పిల్లలకు ఆల్బెండజోల్ టాబ్లెట్స్ వేయడానికి 40 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా 1774 మంది ఆరోగ్య సిబ్బంది,అంగన్వాడీ సిబ్బందితో టీచర్లను సమన్వయం చేసి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమం విజయవంతమయ్యేలా వైద్య,విద్యాశాఖతో పాటు ఐసిడిఎస్, సంక్షేమశాఖల అధికారులు అంకితభావంతో కృషి చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. క్షయవ్యాధి నివారించుటకు వయోజనులకు బిసిజి వ్యాక్సిన్ వేయడానికి ఇంటింటి సర్వే నిర్వహించాలని వైద్య అధికారులను అదనపు కలెక్టర్ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, జెడ్‌పి సీఈఓ కృష్ణారెడ్డి, డిపిఓ సురేష్ మోహన్, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి పద్మజ రమణ, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.



## హస్తినాపురం డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

### జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ సుజాతనాయక్ వినతి



**ప్రజాపక్షం/వనస్థలిపురం:** హస్తినాపురం డివిజన్‌లోని కాలనీల అభివృద్ధి కొరకు నిధులు మంజూరు చేయాలని ఎల్‌బి నగర్ జోనల్ కమిషనర్ పంకజను హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ మంగళవారం వారి కార్యాలయం కలిసి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుజాత నాయక్ మాట్లాడుతూ హస్తినాపురం డివిజన్ లోని శ్రీరమణ కాలనీలకు సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలని, వరద కాలువల పనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు రావడం జరిగిందని, దానికి సబంధించిన పనులు పూర్తి చేసే విధంగా అధికారులకు తెలియచేయాలని కోరారు. ఎపీఎస్బీ కాలనీలోకి వరద నీరు రాకుండా దానికి సంబంధించిన పనులు ప్రారంభమయ్యే విధంగా చూడాలన్నారు. కేకే గార్డెన్ వరకు వర్షపు నీటి కాలువ పనులు చేసే విధ్యంగా సంబంధిత అధికారులకు సూచనలు చేయాలని కోరారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ రాజేంద్రప్రసాద్, సూపరింటెంట్ ఇంజనీర్ అశోక్‌రెడ్డి, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# దేశ ప్రజల భవిష్యత్ ఆశాకిరణం రాహుల్

**ప్రజాపక్షం/వనస్థలిపురం:** ప్రజల నాయకుడు, కాంగ్రెస్ యువనేత రాహుల్ గాంధీని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ బుధవారం ఢిల్లీలో కేంద్ర పార్టీ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ భారతదేశ ప్రజలకు భవిషత్తు ఆశాకిరణం రాహుల్ గాంధీ అని ఆయన పేర్కొన్నారు. భారత్ జోడోయాత్ర, భారత్ న్యాయ యాత్రలతో దేశాన్ని చుట్టి వచ్చిన రాహుల్ గాంధీ దేశ ప్రజలకు భరోసా కల్పిస్తూ, వారి మన్ననలు పొందారన్నారు. విద్వేషం, విభజన రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా దేశ ప్రజల మధ్య ఐక్యత, ప్రేమానురాగాలను పంచుతూ రాహుల్ గాంధీ యాత్ర కొనసాగించారన్నారు. దేశంలో బిజెపి హవాను నిలువరించి,, ఇండియా కూటమి అధికస్థానాల్లో గెలుపొందటంలో రాహుల్ గాంధీ కీలక పాత్ర పోషించారన్నారు. దేశానికి రాహుల్ గాంధీ సారథ్యం వహించే రోజు తప్పక వస్తుందని ఆయన పేర్కొన్నారు.

**రంగారెడ్డి ప్రతినిధి:** దేశం,దేశ ప్రజల పట్ల రాహుల్ గాంధీకి ఉన్న అంకితభావం, చిత్తశుద్ధి, ప్రజలకు మేలు చేయాలనే తపన ఎంతో హర్షించదగినదని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డిసిసి అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన ముఖ్య నాయకులు కార్యకర్తలతో కలిసి రాహుల్ గాంధీ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధి తో పాటు ప్రజల పట్లా అంకితభావం, పేద ప్రజల అభ్యున్నతికి కోసం కాంగ్రెస్ పార్టీ దార్శనికత. ఇవన్నీ రాహుల్ గాంధీలో కనిపిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కర్మాన్ ఘాట్ హనుమాన్ టెంపుల్ మాజీ డైరెక్టర్ వెంకటేష్ గౌడ్,కాంగ్రెస్ మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ సురేందర్‌రెడ్డి కోఆప్షన్ నెంబర్ పల్లె జంగయ్య గౌడ్,మాజీ సర్పంచ్ పల్లె పాండు,నాయకులు కీసరి యాదిరెడ్డి, మీర్పేట్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు పద్మశ్రీ, తదితరులు పాల్గొన్నారు.



**శంషాబాద్‌లో ..** శంషాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శేఖర్ యాదవ్, మున్సిపాలిటీ అధ్యక్షులు సంజయ్ యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు స్థానిక అంబేద్కర్ విగ్రహం దగ్గర కేక్ కట్ చేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్.సి సేల్ ఉపాధ్యక్షులు నరేందర్, డిసిసి అధికార ప్రతినిధి సులోచన, నాయకులు బొబ్బిలి కిష్టయ్య, కౌన్సిలర్‌లు బండి శ్రీకాంత్ యాదవ్, అమృతరెడ్డి, మాక్నూర్ శ్రీకాంత్ యాదవ్, భాస్కర్‌రెడ్డి, ఎంపిటిసి అశోక్ ,మాజీ సర్పంచ్ లు రమేష్ యాదవ్, ప్రవీణ్ యాదవ్, పరమేష్ శ్రీధర్ యాదవ్ , లింగం యాదవ్ అక్రమ్ బాయి, శ్రీధర్ ,శంషాబాద్ మండల్ ఉపాధ్యక్షులు బంగారు కుమార్, చందు యాదవ్ లు పాల్గొన్నారు.

**ఎల్‌బినగర్‌లో...** రాహుల్‌గాంధీ పుట్టినరోజు వేడుకలను ఎల్‌బినగర్, రింగ్‌రోడ్డు, మన్సూరబాద్ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. మన్సురబాద్ డివిజన్ గ్గ్రెస్ అధ్యక్షులు బుడ్డ సత్యనారాయణ కేక్‌కట్ చేసి పంచారు. కార్యక్రమంలో మంజులారెడ్డి, పుల్లయ్య, పృథ్వీరాజ్. అక్రం, జైపాలరెడ్డి, రోజారెడ్డి, ప్రకాశ్, చెర్ల రమేష్, కెవిఎన్ రెడ్డి. మున్న ఆంజనేయులు, లక్ష్మి, వెంకటేష్, విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.







## కొను కోనోకార్పస్ చెట్లు తొలగించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం

**ప్రజాపక్షం/అడ్డాకుల :** విషపూరిత కోనోకార్పస్ చెట్లు తొలగించాలని అడ్డాకుల గ్రామ ప్రజలు ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అడ్డాకుల పరిసర ప్రాంతాలలో హరితహారం పేరుతో అధికారులు ఫ్లైఓవర్ బ్రిడ్జికి ఇరువైపులా విషపూరిత కోన కార్పరస్ చెట్లు నుంచి వెలువడే విషవాయువుల వలన ప్రజలకు శ్వాసకోశ సంబంధిత ఆస్తమా వ్యాధులు వస్తాయని ఈ చెట్ల వలన ప్రజలకు హాని తప్ప ఎలాంటి ఉపయోగం లేదు అందుకే చెట్లు తొలగించి ప్రజలకు ఉపయోగపడేటు వంటి చెట్లు నాటాలని చెట్లు తొలగించడానికి అడ్డాకుల మండల అధికారులను ఆదేశించే విధంగా చూడాలని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య భద్రతలు కాపాడాల్సిన అధికారులు పర్యావరణం పేరుతో ప్రజలు అనారోగ్యాలకు హాని కలిగించే కొను కార్పస్ చెట్లు నాటి పెంచడం సరికాదని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషవాయువు వెదజల్లే ఈ చెట్లు రోడ్డు విస్తరణలో భాగంగా గ్రామ సుందరికరణ కోసం గ్రామంలో ఉన్న ఎన్ హెచ్ 44 బ్రిడ్జికి ఇరువైపులా చెట్లను నాటడమే కాకుండా గ్రామ పరిసర ప్రాంతాలలో నాటడం పురవీధుల గుండా నాటడం జరిగింది. ఈ చెట్ల వలన ప్రజలు భవిష్యత్తులో శ్వాసకోశ సంబంధిత వ్యాధులకు కారణమయ్యేలా ఉంటాయని పరిశీలకులు అంటున్నారు. ఈ చెట్ల కాయలు కాసిన తర్వాత వాటి నుండి ముప్పాడి వచ్చి గాలిలో కలవడం ద్వారా మనసులు పీల్చుకునే గాలి నుండి శ్వాస కోసం సమస్యలు రావడం జరుగుతుంది. ఈ చెట్ల పెంచడం వల్ల గడ్డి జాతి మొక్కలకు హాని జరగడంతోందని ఇతర మొక్కలకు అన్ని జరగడం వల్ల వన్యప్రాణులకు ఆహారం దొరకడం చాలా కష్టంగా ఉంటుంది. ఈ చెట్లతో అందమైన గ్రామం దేవునికి తెలుసు కానీ ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిలితే అప్పుడు ఏ దేవుడు ముందరికి రాడు అని అంటున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి స్పందించి ఈ చెట్ల నుండి ప్రజలకు హాని కరుగుతుంది అనే విషయాన్ని తెలుసుకుని పరిశీలించి ప్రజల సమస్యను పరిష్కరించే విధంగా చూడాలని మండల తాసిల్దార్, ఎంపీడీవో, లకు సూచించారు. ఈ సమస్యను పరిష్కరించకపోతే జిల్లా కలెక్టర్ ను ఆశ్రయించి జిల్లా సంబంధిత అధికారులు కలిసి సమస్యను పరిష్కరించే విధంగా చూస్తామని ప్రజలు డిమాండు చేశారు.

## వానాకాలం రైతుబంధు రైతుల ఖాతాల్లో జమచేయాలి

### ఎంపిటిసి పెద్ద గోపాల్ రెడ్డి

**ప్రజాపక్షం / మల్దకల్ :** వానకాలం రైతుబంధు తక్షణమే రైతుల ఖాతాలలో జమ చేయాలని ప్రభుత్వాన్ని టిఆర్ఎస్ ఎంపీటీసీ పెద్ద గోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం వచ్చింది, కానీ రైతులకు పంట పెట్టుబడి సహాయం గురించి కాంగ్రెస్ మెదపడం లేదు అని ఆయన అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ ఆయాంలో వాన చినుకు పడితే రైతుబంధు పైసలు పడేవి అని ఆయన తెలిపారు. ప్రభుత్వం రైతు భరోసా డబ్బులు వెంటనే విడుదల చేయాలని కోరారు. షరతులు లేకుండా ఎకరాకు రూ. 7500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రసంగాల్లో మ్యానిఫెస్టోలో పంట కాలానికి ముందే ప్రతి ఎకరాకు ఇస్తామని చెప్పారని ఇప్పుడు రైతులను మోసం చేయడం సరి కాదని అన్నారు. పంట ప్రారంభం అయిందని, విత్తనాలు వేస్తున్నారని రైతు భరోసా వేయడం లేదు అని తెలిపారు. కేసిఆర్ బస్సు వేసుకొని అడిగితే రైతుబంధు కొందరికి వేశారని ఆయన గుర్తు చేశారు. ప్రజా సమస్య మీద రైతు సమస్యల మీద దృష్టి సారించాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయాన్ని చిన్న చూపు చూస్తుందని ఎరువుల కొరత రాకుండా ముందస్తు చర్యలు తీపుకోవాలని కోరారు. కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని రైతులను దగా చేయడం మంచిది కాదని ఆయన తెలిపారు.



## కార్యాలయాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి : జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం / మహబూబ్ నగర్ ప్రతినిధి :** సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవనం (కలెక్టరేట్ ) లో ని వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ బి. విజయేందిర బోయి అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని అన్ని జిల్లా కార్యాలయాలను జిల్లా కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కార్యాలయాలతో అధికారులు, సిబ్బంది వారికి కేటాయించిన గదులు, వసతులు, తదితర వివరాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. మొదటి, రెండవ ఫ్లోర్ లో గత ప్రభుత్వ శాఖరి కార్యాలయాల, కలెక్టరేట్ సేక్షన్ విభాగాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అన్ని కార్యాలయాలతో అనవసరంగా ఉన్న సామాగ్రిని వెంటనే తీసివేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్ రావు, డి.ఆర్.ఓ.కె.వి.వి రవి కుమార్, కలెక్టరేట్ ఏవో శంకర్ ఉన్నారు.



## రోడ్డు విస్తరణ, డ్రైనేజీ పనులు పూర్తి చేయాలి : కమిషనర్‌కు వినతి

**ప్రజాపక్షం/పెబ్బేరు :** పెబ్బేరు మున్సిపాల్టీలోని సుభాష్ చౌరస్తా నుండి పిజేపి కెనాల్ వరకు రోడ్డు విస్తరణ చేసి రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్కి శ్రీనివాస్‌గౌడ్ , భాను ప్రకాశ్ రెడ్డి, షకీలా, వినయ్ బుధవారం పెబ్బేరు మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పెబ్బేరు మున్సిపాల్టీలో రోడ్ల విస్తరణ పనులతో పాదచారులు , వాహనదారులు అనేక ఇబ్బందులు గురవుతున్నారని భారీ వాహనాలు రాకపోకలు ఎక్కువగా ఉండటం వలన రోడ్డు మీద పెద్ద గుంతలు ఏర్పడి అనేక ప్రమాదాలు కారణమవుతున్నాయని, వర్షాకాలంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేక వర్షపు నీరు డ్రైనేజ్ నుంచి వచ్చి మరుగు నీరు రోడ్లపై రావడంతో ద్విచక్ర వాహనదారులకు కింద పడటం అనేక ప్రమాదం జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా స్పందించి వర్షాకాలం వరకు టీయూఎఫ్ఐడిసి నిధులు మంజూరు చేసి రోడ్డు విస్తరణ డ్రైనేజీ పనులను వేగవంతం చేసి పట్టణాభివృద్ధికి సహకరించాలని వారు కోరారు.

### 'సికిల్ సెల్ అనీమియా' రాకుండా

# తగిన జాగ్రత్తలు అవసరం

### రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్ రావు



**ప్రజాపక్షం / మహబూబ్ నగర్ ప్రతినిధి :** సికిల్ సెల్ అనీమియా వ్యాధి వచ్చిన వారికి చికిత్సతో పాటుగా, వ్యాధి రాకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్ రావు అన్నారు. ప్రపంచ సికిల్ సెల్ అనీమియా నిర్మూలన దినోత్సవ కార్యక్రమం సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని బంజారా భవన్ నందు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి చత్రు నాయక్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్ రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ లు పాల్గొన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్ రావు మట్లాడుతూ వ్యాధి రాకుండా ఉండాలంటే ముందు జాగ్రత్తలుగా పోగ తాగడం గాని తంబాకు వేసుకోవడం కానీ మత్తు పదార్థాలు తీసుకోకుండా రక్తహీనతను అధిగమించడానికి కావలసిన ఆకుకూరలు, కూరగాయలు పండ్లు వంటివి తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని (పివిటిజి) కార్యక్రమాల ద్వారా 1441 మంది చెంచు వాళ్లను గుర్తించడం జరిగినదని, వీరిలో 40 సంవత్సరముల లోపు ఉన్న 640 మందికి ఈ సికిల్ సెల్ అనఅమియా కు సంబంధించిన రక్తపరీక్షలు చేయడం జరిగినది ఇందులో నలుగురికి క్యారియర్ గా ఉన్నట్లు నిర్ధారించడం జరిగిందని, మిగతా గిరిజనులకు ఈ వ్యాధి రాకుండా ఉండడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. జిల్లా వుద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కృష్ణ మాట్లాడుతూ ఈ వ్యాధి వచ్చిన వాళ్ళని వివాహం చేసుకుంటన భవిష్యత్తులో పుట్టబోయే పిల్లలకు కూడా ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. అదేవిధంగా వ్యాధి వచ్చిన వాళ్ళు వ్యాధి రాని వాళ్ళని వివాసం చేసుకుంటే 50 శాతం పిల్లలకి వ్యాధి వచ్చే అవకాశాలు కలవు కావును వీటిపై అవగాహన పెంచుకోని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సంధ్యా కిరణ్మయి డాక్టర్ భాస్కర్ నాయక్, డాక్టర్ రఫీ, డాక్టర్ తిరుపతి రావు, ఈ కార్యక్రమంలో పరిశీలన కోరకు సునీత అదేవిధంగా వివిధ గ్రామాల నుంచి గిరిజన ప్రజలు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## బాలికల ఉన్నత విద్యను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలి

### రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి



**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** బాలికలని ఉన్నత విద్యనభ్యసించే దిశగా ప్రతి ఒక్కరు ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. గ్రామ స్థాయిలో తెలుగు మీడియం ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉత్తమ ప్రతిభ కనబర్చిన బాలికలకు బుధవారం గ్రామీణ భాగస్వామ్య సంస్థ ఆధ్వర్యంలో బహుమతుల ప్రధాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి, వనపర్తి శాసన సభ్యులు మేఘారెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వీరు పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన బాలికలకు వీఐపీ సంస్థ తరపున రూ. 5వేల నగదు బహుమతి, రూ. 20వేల ఫిక్స్డ్ డిపాజిట్‌లను ప్రదానం చేశారు. అదేవిధంగా విద్యార్థుల తల్లిదండ్రులకు సన్మానం, పాఠశాలకు, గ్రామ పంచాయతీకి మొక్కలు అందజేశారు.

**ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యం ఇస్తోంది : ఎమ్మెల్యే మేఘారెడ్డి**

వీఐపి సంస్థ ఎన్నో ఏళ్ల నుంచి జిల్లాలో అనేక మంచి కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అద్భుతమైన ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, అందుకు వారికి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం ఉంటుందని చెప్పారు. అన్ని దానాలలో కెల్లా విద్యాదానం గొప్పదని అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎం. నగేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ పద్మావతి, విఐపి సంస్థ ఈడి నాగేంద్ర స్వామి, డిఈఓ గోవిందరాజులలు, మున్సిపల్ చైర్మన్ పుట్టపాకుల మహేష్ , వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, నాయకులు కృష్ణ, కదిరే రాములు, విద్యార్థులు , తల్లిదండ్రులు , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# భావి భారత ప్రధాని రాహుల్‌గాంధీ





**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకలను బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో టపాకాయలు కలుస్తూ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి ఒకరినొకరు తినిపించుకుంటూ పుట్టిన రోజు శుభాకాంక్షలు రాహుల్ గాంధీ అని అన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో భారత దేశ ప్రధాని మంత్రిగా రాహుల్‌గాంధీ బాధితులు చేపడతారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేసి కాంగ్రెస్ పార్టీ కోసం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని బడుగు బలహీన వర్గాల అందరూ బాగుంటేనే దేశం బాగుంటుందని అందర్నీ ఒక తాటికి తెచ్చి రాజ్యాంగం కాపడటం కోసం తన ప్రాణాలు సైతం లెక్క చేయకుండా పోరాడిన వీరుడు రాహుల్ గాంధీ అన్నారు. అలాంటి నాయకుడి పుట్టిన రోజులు వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతోషం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు , వనపర్తి మున్సిపల్ చైర్మన్ పుట్టపాకుల మహేష్ , వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య, సమన్వయకర్త మున్సిపల్ కౌన్సిలర్ కో ఆప్షన్ నంబర్స్ సోషల్ మీడియా యూత్ కాంగ్రెస్ , పార్టీ అనుబంధ సంఘం నాయకులు , కాంగ్రెస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**కొత్తకోటలో ...**

కొత్తకోట మండల కేంద్రంలో భావి భారత కాబోయే ప్రధాని రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి ప్రభుత్వ ఆసుపత్రిల్లో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్ , బోయజ్ , పాపయ్య, కృష్ణారెడ్డి, బీచుపల్లి యాదవ్ , శ్రీనన్న, బాబు, సలీం ఖాన్ , మిషేక్ , వెంకటేష్ , మోహన్ రెడ్డి, రాము, శ్రీను, నరేందర్ సాగర్ , లక్ష్మన్న, సాయిల్ యాదవ్ , భాస్కర్ , శివకుమార్ రెడ్డి, జాన్ , రాము, రాఘవేంద్రగౌడ్ తదితరులు ఉన్నారు.

**శ్రీరంగాపురంలో ...**

మండల కేంద్రంలో రాహుల్‌గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు. రంగాపురం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్ యాదవ్ , మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాములు యాదవ్ , ఎంపీటీసీ ఎల్లస్వామి, ఆశోక్ రెడ్డి, స్వామి, వెంకటస్వామి, రఘు, రంజిత్ , శివ నారాయణ, రామరాజు, శ్రీను, తిరుపతయ్య, రవి, ఆంజేయులు, చందు, రాముడు, రమేష్ , లోకేష్ , గాలన్న, రాజు, తదితరులు పాల్గొన్నారు.

**పెబ్బేరులో ...**

కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ పుట్టిన రోజు సందర్భంగా వనపర్తి జిల్లా బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం పెబ్బేరు సుభాష్ చౌరస్తాలో కేక్‌ను కట్ చేసి పుట్టిన రోజు సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్ , మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్ , భాను, ప్రకాశ్ రెడ్డి, శివసాయి, రామన్ గౌడ్ , కరెంట్ రాములు, సాయిగౌడ్ పాల్గొన్నారు.

**నర్వలో...**

మండల పరిధిలోని ఉందేకోడ్ గ్రామంలో ప్రపంచ దేశాలే గర్జించదగా విషయం భారతదేశాన్ని మొత్తాన్ని, భారత్ జోడో యాత్ర అనే పేరుతో భారతదేశం మొత్తం పాదయాత్ర చేసి ధీరుడు నిన్నటి త్యాగాలకు వారసుడు, రేపటి తరానికి మార్గదర్శకులు,భారతదేశాన్ని ప్రగతిశీల వైపు నడిపించే ఏకైక వ్యక్తి యువకులకు ఆదర్శంగా నిలుస్తున్న యువ నాయకుడు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురాగలిగే నాయకుడు భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు గ్రామ కాంగ్రెస్ నాయకులు ఎంపీటీసీ రాజ్ నాయకులు ఉమాపతి గ్రామ అధ్యక్షుడు కొండప్ప , అశోక్, కాలప్ప, రామలింగ కేకట్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

**మల్దకల్‌లో...**

జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల పరిధిలోని బిజ్వారం గ్రామంలో బుధవారం అంగన్ వాడి సెంటర్లో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వై.శ్రీనివాస్ రెడ్డి, డి.సత్యరెడ్డి ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వై.శ్రీనివాస్ రెడ్డి హజరై చిన్నారులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, మెకానిక్ గోపాల్, కొంకల గోకరన్న, డైనమిక్ లీడర్ నారాయణ, వడ్డే గోపాల్, తెలుగు మోహన్, తిరుమల్, లక్ష్మన్న, అంగన్‌వాడీ టీచర్స్ లక్ష్మి, పారజా తమ్మ, అనంతమ్మ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**వంగూర్...**

కాంగ్రెస్‌పార్టీ అధినేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను మండలకేంద్రంలో కాంగ్రెస్‌పార్టీశ్రేణులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. జడ్పిటిసి కెవిఎన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్‌కట్‌చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షులు పండిత్‌రావు, ఎంపిటిసి రమేష్‌గౌడ్, మండల నాయకులు జనార్దన్,మధుకర్‌రెడ్డి, తిరుమలయ్య, శివశంకర్, శ్రీశైలం, రాజు పాల్గొన్నారు.

## నిరసన వ్యక్తం చేయడం నేరం కాదు

### టీవీవీ సభ్యులపై కేసు డిస్మిస్ చేసిన హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బహిరంగ ప్రదేశాల్లో ప్రజల ఆస్తులకు నష్టం చేకూర్చకుండా శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసే హక్కు ప్రజలకు ఉందని హైకోర్టు తీర్పు చెప్పింది. తెలంగాణ విద్యార్థి వేదిక సభ్యులపై పెట్టిన కేసును కొట్టేసింది. పౌరహక్కుల సంఘాలకు చెందిన ప్రొఫెసర్ సాయిబాబా, వరవరరావులను విడుదల చేయాలంటూ 2010 మే 17న అంబేద్కర్ విగ్రహం వద్ద పర్మిషన్ తీసుకోకుండా నిరసన తెలిపారంటూ 13 మందిపై సైఫాబాద్ పోలీసులు నమోదు చేశారు. దీనిని కొట్టేయాలని కోరుతూ టీవీవీ సభ్యులు కొత్తపల్లి మహేష్ ఇతరులు వేసిన పిటిషన్‌ను హైకోర్టు అనుమతించింది. పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేసింది. పిటిషనర్లు శాంతి భద్రతలకు భంగం కలిగించినట్లుగా ఆధారాలు లేవని చెప్పింది.. ప్రజాజీవనానికి ఇబ్బందిలేకుండా ప్రజాస్వామ్యయుతంగా . శాంతియుతంగా నిరసన తెలిపేందుకు రాజ్యాంగం వెలుసుబాటు ఇచ్చిందని చెప్పింది. ఈ మేరకు బుధవారం జస్టిస్ కె. సుజన తీర్పు వెలువరించారు.

## గ్రేస్ మార్కులపై ఎన్ఎంసీ రూల్స్ మార్పు చట్టబద్ధమే : హైకోర్టు ఉత్తర్వులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎంబీబీఎస్ గ్రేస్ మార్కులకు సంబంధించి నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎన్ఎంసీ) రూల్స్ మార్పు చేయడాన్ని హైకోర్టు సమర్థించింది. అయితే, ప్రత్యేక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని గ్రేస్ మార్కులు కలపాలని కోరే విద్యార్థుల వినతులను చట్ట ప్రకారం పరిష్కరించాలని సూచించింది. గ్రేస్ మార్కులను తొలగిస్తూ 2023 ఆగస్టులో ఎన్ఎంసీ తీసుకున్న నిర్ణయంలో జోక్యం చేసుకోమని చెప్పింది గ్రేస్ మార్కులు పొందడం పిటిషనర్ల హక్కు కాదంది. ఎంబీబీఎస్ విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించి..ఒక సబ్జెక్టులో తక్కువ మార్కులొస్తే 5 గ్రేస్ మార్కులు ఇచ్చే విధానాన్ని ఈసారికి తమకు అమలు చేయాలని, తాము పాత నిబంధనలు అమల్లో ఉండగా అడ్మిషన్ తీసుకున్నామని విద్యార్థుల వాదనను తోసిపుచ్చింది. కేసు ప్రత్యేక పరిస్థితులను గమనంలోకి తీసుకుని పిటిషనర్లకు గ్రేస్ మార్కులను మంజూరు చేసే అంశంపై తగిన నిర్ణయం తీసుకోవాలని ఎన్ఎంసీ, వర్సిటీలకు సూచన చేసింది.



## బలహీనవర్గాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం

**ప్రజాపక్షం/వంగూర్ :** బలహీనవర్గాల అభివృద్ధికాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని జడ్పిటిసి కెవిఎన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీచేశారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణరాష్ట్రంలో బడుగు బలహీనవర్గాల అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్‌ప్రభుత్వంతోనే సాధ్యమని అన్నారు. గత ప్రభుత్వంలో అవినీతి అక్రమాలుతప్ప తెలంగాణరాష్ట్రప్రజలకు చేసింది ఏంలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యా వైద్యానికి పెద్దపీట వేస్తుందని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ వెంకటరమణ, కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షులు పండిత్‌రావు, ఎంపిటిసి రమేష్‌గౌడ్, మండలనాయకులు జనార్దన్, కడారివెంకటయ్యయాదవ్, మధుకర్‌రెడ్డి, తిరుమలయ్య, రాజు, శివశంకర్, గెలవయ్య శ్రీశైలం, జంగయ్య, కల్యాణలక్ష్మి లబ్ధిదారులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### కేంద్రమంత్రికి ఘనసన్మానం



**ప్రజాపక్షం/వంగూర్ :** కేంద్రసహాయ మంత్రి బండిసంజయ్‌కుమార్ ప్రమాణస్వీకారం తర్వాత మొదటిసారిగా రాష్ట్రానికి విచ్చేస్తున్న సందర్భంగా బుధవారం బిజెపి మండలపార్టీ అధ్యక్షులు ఖానాపురం భాస్కర్ స్వాగతంపలుకుతూ ఘనంగా సన్మానించారు.




## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైనవిద్య

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విశాలమైన తరగతిగదులతోపాటు నాణ్యమైన విద్య అందుతుందని ఎంపిపి సూర్యప్రతాప్‌గౌడ్ అన్నారు. మండలంలోని వెన్నచర్ల గ్రామంలోని జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో బడిబాట కార్యక్రమానికి బుధవారం ఎంపిపి సూర్యప్రతాప్‌గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను, ఏకరూప దుస్తులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధి,పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీటవేసిందన్నారు. టూరిజం ఎక్సైజ్‌శాఖమంత్రి జూపల్లికృష్ణారావు సహకారంతో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను మరింత అభివృద్ధిచేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులందరూ సమయపాలనపాటించి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి రవికుమార్, ప్రధానోపాధ్యాయులు, మాజీసర్పంచ్ రాధాబాలస్వామి, మాజీ ఎంపిటిసి కర్ణ, వార్డుమెంబర్ రాముడు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఎం.శంకర్, సురేష్‌గౌడ్, మల్లేష్ పాల్గొన్నారు.



## ధరణిపోర్టల్ పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించండి

### జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ధరణిస్పెషల్‌డ్రైవ్‌లో పెండింగ్ భూసమస్యలను రానున్న పదిరోజుల్లో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశమందిరంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావుతో కలిసి ఆర్‌డిఓలు, తహసీల్దార్లతో ధరణిపెండింగ్ ఫిర్యాదుల పరిష్కారానికై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధరణిలో వివిధ మాడ్యూల్స్‌కిందదాఖలైన దరఖాస్తులను తక్షణమే పరిశీలిస్తూ యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ఆదేశించారు. ఆయా దరఖాస్తులకు సంబంధించి ఇప్పటికే క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయినవాటిని మూడు నాలుగురోజుల్లో పరిష్కరించాలని ఏఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో లేకుండావారం వ్యవధిలోపు అన్నింటిని పరిష్కరించాలని స్పష్టమైన గడువు విధించారు. ప్రతిరోజు ధరణి దరఖాస్తుల పరిష్కారంపై పర్యవేక్షణ ఉంటుందన్నారు. రోజువారి ధరణిఫిర్యాదుల పరిష్కార వివరాలను తెలుసుకోనున్నట్లు తెలిపారు. ధరణి ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. రోజువారి ప్రగతిని సాధించి మండలాల్లో పెండింగ్ ఫిర్యాదులులేకుండా చూడాలన్నారు. తహసీల్దార్లు నిబద్ధతతో పనిచేసి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని తెలిపారు. అలసత్వానికి ఏమాత్రంతావులేకుండా దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా తమ మండలాలపరిధిలోఉన్న మిల్లులను తహసీల్దార్లు సందర్శించి ఆయా మిల్లులకు కేటాయించిన వరిధాన్యం వివరాలతోపాటు ప్రస్తుతం మిల్లులో ఉన్న స్టాక్ ఎంతఉంది ఇప్పటివరకు సిఎంఆర్‌కు అందించిన రోజువారి బియ్యం వివరాలను తనకు తెలియజేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, ఆర్‌డిఓలు నాగరాజు, శ్రీనివాసులు, మాధవి, కలెక్టరేట్ సూపరింటెండెంట్‌లు జాకీర్‌ఆలీ, శ్రీనివాసులు, కార్తీక్‌కుమార్, ధరణి సిబ్బంది పాల్గొన్నారు.

## గృహజ్యోతి పథకం అమలు

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** అర్హులైన విద్యుత్ వినియోగదారులకు గృహజ్యోతిపథకం అమలైందని మండల విద్యుత్‌శాఖ అధికారి ఏఈ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గృహజ్యోతిపథకానికి అమలుకాని విద్యుత్ వినియోగదారులు స్థానిక ఎంపిడిఓ ఆఫీస్ కార్యాలయాన్ని సంప్రదించాలని వినియోగదారులను కోరారు.

## మాత్రల పంపిణీపై అధ్యాపకులకు శిక్షణ



**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** మండలకేంద్రంలో నులిపురుగుల మాత్రలపంపిణీపై బుధవారం మండల వైద్యాధికారులు అధ్యాపకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నులిపురుగుల మాత్రలను పంపిణీచేయాలని వైద్యాధికారులు అధ్యాపకులను కోరారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారులు, ఆయా పాఠశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన అధికారులు



ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : వికారాబాద్ జిల్లా కు నూతనంగా వచ్చిన జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసేందుకు వస్తున్న అధికారులకు ,ప్రజాప్రతినిధులు శాలువాలు ,బోకేలతో వస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వారిని ఉద్దేశించి మాట్లాడుతూ నన్ను మర్యాద పూర్వకంగా కలవడానికి విచ్చేయుచున్న అధికారులు ,ప్రజా ప్రతినిధులు శాలువాలు ,బోకేలతో కాకుండా పేద విద్యార్థులకు ఉపయోగపడే విధంగా నోటు పుస్తకలు ,పెన్నులు ఇతర స్టేషనరీ తో రవాలిని అయన కోరారు. అందరూ పేద విద్యార్థులకు సహాయం చేసినట్లు ఉంటుందనివీటిని అనుసరించాల్సిందిగా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

ప్రజాపక్షం
మహానగరి
మేడ్చల్ మల్కాజ్‌గిరి — వికారాబాద్
హైదరాబాద్ | గురువారం | 20 జూన్, 2024 | 11

## జిల్లా అభివృద్ధికి కృషి చేస్తా :ఎంపి కొండవిశ్వేశ్వర్‌రెడ్డి



ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : చేవేళ్ల పార్లమెంటు ఎంపీ అభ్యర్థిగా భారీ మెజార్టీ అందించిన ప్రజలకోసం వికారాబాద్ జిల్లా అభివృద్ధికోసం కృషి చేస్తానని కొండవిశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఎంపీనీ వికారాబాద్ జిల్లా కేంద్రంలో బీజేఆర్ చౌరస్తాలో ఘనంగా స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. ఎంపీని నాయకులు కార్యకర్తలు పౌరసన్మానం కార్యక్రమం నిర్వహించారు. భారీ సంఖ్య లోహజరై శుభాకాంక్షలు తెలిపారు. బీజేపి పార్టీ నాయకులకు కార్యకర్తలకు ,అభిమానులు ధన్యవాదాలు తెలియజేశారు. జిల్లా అధ్యక్షులు మాధావరెడ్డి , వికారాబాద నియోజకవర్గ బీజేపి పార్టీ కోఆర్డినేటర్ వడ్ల నందు ,వైస్‌యంపిపి రాములు తదితరులు పాల్గోన్నారు.

## ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు జవాబు దారిగా ఉండాలి

ఇబ్రహింపట్నం శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి



ప్రజాపక్షం/యాచారం : ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు జవాబ్ దారిగా ఉండాలని నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఇబ్రహింపట్నం శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని కేస్లి తండా, మంథన్ గౌరెల్లి, నల్లవెల్లి, చింతపట్ల గ్రామాల్లో కొటి రూపాయల అభివృద్ధి పనులకు అయన ప్రారంబోత్సవం చేశారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ అధికారులు తమ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి అధికారులు తమ తీరును మార్చుకొవాలని హెచ్చరించారు. లేని పక్షంలో అలాంటి అధికారులపై త్వరలోనే చర్యలుంటాయని అన్నారు. మంథన్‌గౌరెల్లి గ్రామంలో తాగునిటి సమస్య ఉందని సకాలంలో మంచి నీరు రావడంలేదని ఎంఎల్‌ఏ ముందు గిరి జన మహిళలు మొర పేట్టుకున్నారు. కరంటు సక్రమంగా ఉండడం లేదని రైతులు ఎంఎల్‌ఏ దృష్టికి తెచ్చారు. కరంటు, మంచినిటి సరఫరా అధికారులపై ఎంఎల్‌ఏ అగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో పర్యటించి నప్పుడు మళ్లి అసమస్యలు రాకుండా చూడాల్సిన భాధ్యత అధికారులపై ఉందని అన్నారు. ప్రజా సనమ్యలను పరిష్కరించడంలో ముందుండి పనిచేయాలని అన్నారు. అప్పుడు ప్రజలకు మనపై గౌరవం పెరుగుతుందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాలంటే అధికారులు కంకణ బద్దులై పనిచేయాలని అన్నారు. అప్పుడే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని అన్నారు. ఈకార్యక్రమంలో ఎంపిపి కొప్పు సుకన్యభాష, ఎంపిటిసిలు, కొర్ర జ్యోతి అరవింద్ నాయక్, లక్ష్మి పతి గౌడ్, మాజి ఎంపిపిలఅఉ రాచర్ల వెంకటేశ్వర్లు, రమావత్ జ్యోతి శ్రీనివాస్‌నాయక్, నాయకులు, బిలకంటి శేఖర్‌రెడ్డి, అమృతాసాగర్, ఎంపిడిఓ నరేందర్‌రెడ్డి, తహశీల్దారు అయ్యప్ప వివిధ శాఖల అధికారులు ఉన్నారు. నాయకులు లిక్కి శ్రీనివాస్‌రెడ్డి, పాండురంగారెడ్డి, మోటే శ్రీశైలం, వరికుప్పల సుధాకర్, వుప్పల భాస్కరు గుప్త, ముచ్చర్ల సంపత్ వెంకట్‌రెడ్డి,మాజి వెస్ఎంపిపి దెంది రాంరెడ్డి, చిలుక మధుసూధన్‌రెడ్డి, బాల శివుడు, తదితరులు పాల్గోన్నారు.

## ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కాంగ్రెస్ కుట్రలు చేస్తోంది

బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్ ఆరోపణ

ప్రజాపక్షం /హైదరాబాద్ : ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తుందని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్ ఆరోపించారు. ఎన్‌డిఎ ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని, ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందంటూ కాంగ్రెస్ ఎంపి మల్లు రవి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నమన్నారు. తెలంగాణలో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఒరగబెట్టింది ఏమి లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కథ కంచికి చేరిందని, లోక్‌సభ ఎన్నికల ద్వారా మరోసారి రుజువైందని ఆయన ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## పేద విద్యార్థులకు ఫౌండేషన్ సభ్యుల చేయూత



ప్రజాపక్షం / కొడంగల్ : యువ 24 ఫౌండేషన్ ఆద్వర్యంలో పేద మధ్య తరగతి విద్యార్థులకు చేయుతను విద్యాను ప్రోత్సహించడం ఎంతో సంతృప్తినిస్తుందన్నారు ఫౌండేషన్ సభ్యులు. బుధవారం కొడంగల్ మండల పరిధిలోని ఆశమ్మకుంట తాండలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న గిరిజన పేద మధ్య తరగతి విద్యార్థులకు పాఠశాల ప్రదానోపాధ్యాయుల సమక్షంలో యువ 24 ఫౌండేషన్ సభ్యులు నోటు పుస్తకాలు, బ్యాగ్‌లు, మధ్యాహ్న భోజనానికి కావాల్సిన ప్లేట్స్, పెన్సిల్‌లు, వాటర్ బాటిల్స్‌లు, కూర్చోవడానికి ఫ్లోర్‌నైట్స్ సకల సదుపాయాలను సమకూర్చడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతు ఫౌండేషన్ ఆద్వర్యంలో ప్రజలకు కావాల్సిన మంచి పనులను చేస్తు ప్రజా సేవ చేయడం మానవ జన్మ సుకృతం అన్నారు. డబ్బులను వృధా చేయకుండా ఇలాంటి పేద విద్యార్థులకు కావాల్సిన అవసరాలను తీర్చడం ఎంతో పుణ్యం వస్తుందని అందుకు ప్రతి ఒక్క యువత చెడువ్యాసనాలకు గురికాకుండా సన్మార్గంలో నడిచి తమ జీవితాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు. సేవ కార్యక్రమాలపై గ్రామస్థులు, ఉపాధ్యాయులు ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సురేష్‌గౌడ్, కలారీ రమేష్, కృష్ణయాదవ్, రామయ్యగౌడ్, వెంకట్, నాగేష్, దేవ్ మహారాజ్, నరేష్‌గౌడ్‌లతో పాటు తదితరులు పాల్గోన్నారు.

## లారీ ఢీకొని తల్లీ కూతుళ్లు మృతి



ప్రజాపక్షం/తాండూర్ : తాండూర్‌లో సాయత్రం తాండూర్ కాగ్నా నది శివారులో వేగంలో ఉన్న లారీ బైకును ఢీకొట్టి తల్లి ,కుతుళ్లు అక్కడిక్కడే మృతి చేందగా స్వల్ప గాయలతో తండ్రి కుమారునికి గాయాలతో బయటపడ్డారు. వివరాల్లోకి వెళితే బంట్వారం మండలం సల్బత్తాపూర్ గ్రామానికి చేందిన కోస్గి నర్సిములు తన భర్య అనిత ,కుతరుచిట్టి ,కుమారునితో కలిసి యాలాల్ మండలకేంద్రంలోని ఆధార్ కేంద్రం వద్దకు వెళ్లారు. సాయత్రం తిరిగి గ్రామానికి బైకుపై బయల్దేరు మార్గమధ్యలో కాగ్నా నది బ్రిడ్జి సమీపంలో రాగానే ఎదురుగా వస్తున్న లారీ బైకును ఢీకొట్టింది. అనిత తలకు తీవ్రగాయాలు కాగా ,కూతురు చిట్టి తలపై నుంచి లారీ చక్రాలు దూసుకెళ్లడంతో చితికిపోయింది. ఈ లారీ అంతకు ముందే బాలరాజు లక్ష్మి అనే దంపతుల బైకును ఢీకొట్టింది, విషయం తెలుసుకున్న పోలీస్‌లు సంఘటన స్థలనికి చేరుకుని మృతదేహలను తాండూర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ఎస్ ఐ విఠల్‌రెడ్డిబాధితులను కలిసి జరిగిన ప్రమాదంపై ఆరా తీవారు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు జరుపుతామని తెలిపారు.

# కొడంగల్ అభివృద్ధిపై కలెక్టర్ సమీక్ష

పనులు ప్రారంభించాలని అధికారులకు ఆదేశాలు



ప్రజాపక్షం / కొడంగల్ : కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి మంజురైన నిధులతో పనులను వెంటనే ప్రారంబించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్, నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌లు అధికారులకు అదేశాలు జారీ చేస్తు బుధవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌లు మాట్లాడుతు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి పనులను అధికారులు తమ శాఖలకు నిర్ధేశించిన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలన్నారు. మంజురు అయిన పనులకు టెండర్ల ప్రక్రియను వేగవంతం చేసి పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రోడ్ల విస్తరణ, రోడ్ల బలోపేతంకు సంబందించి పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బి శాఖల ఇంజనీర్‌లు ప్రత్యేక దృష్టి సారించి పనులలో జాప్యం జరుగకుండా వేగవంతంగా పనులు చేయాలన్నారు. నియోజకవర్గంలో పలు కాలేజీల నిర్మాణం నిమిత్తం భూసేకరణ చేపట్టాలని భూ సేకరణ విషయంలో ఏదైన సమస్యలు వస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కొడంగల్‌లో నిర్మించే అథితి గృహముకు సంబందించి ప్రత్యేక నమూనను తయారు చేయాలని ప్రభుత్వాస్పత్రిలో వైద్యుల నియమకానికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. గృహ జ్యోతి పథకం కింద దారిద్రరేఖకు దిగువనున్న పేద కుంటుంబాలకు విద్యుత్ సౌకర్యాన్ని కల్పించే దిశగా అధికారులు పనిచేయాలని, మిషన్ భగిరథ కింద ప్రతి ఇంటికి మంచినీరు అందే విధంగా అధికారులు ముందుండాలన్నారు. గ్రామాలలో వాటర్ ట్యాంకుల నిర్మాణాలు, పైప్‌లైన్ పనులకు అవసరమైన నిధులు కేటాయించడం జరుగుతుందన్నారు. కడ అభివృద్ధిలో బాగంగా మంజురైన చెక్‌డ్యాంల నిర్మాణ పనులపై అటవి శాఖ భూముల్లో జరుగుతున్న పనులపై కలెక్టర్ అధికారులకు అడిగి తెలుసుకున్నారు. గురుకుల పాఠశాలలు స్థానికంగా ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వైద్య, విద్య రంగాలలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా అధికారులు తస్మాత్ జాగ్రత్తలు పాటించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి సోంత నియోజకవర్గంలో ప్రజలకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా అధికారులు పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, కడ ఇన్‌చార్జి వెంకట్‌రెడ్డి, తాండూర్ ఆర్‌డివో శ్రీనివాస్‌లతో పాటు వివిధ శాఖలకు సంబందించిన అధికారులు పాల్గోన్నారు.

## ఎన్ఎస్ఎస్ స్పన్ డిబేట్‌లో విజేత శ్రీచైతన్య స్కూల్

హైదరాబాద్: నిర్వహించిన నేషనల్ స్పేస్ సొసైటీ (ఎన్ఎస్ఎస్) స్పన్ డిబేట్ 2024లో శ్రీచైతన్య నంబర్ వన్గా నిలిచింది. ఈ పోటీలో ప్రపంచ వ్యాప్తంగా 9 దేశాల నుంచి వందకుపైగా విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ఫైనల్‌కు అర్హత సంపాదించిన నలుగురిలో ఇద్దరు విజేతలుగా నిలిచారు. ఆ ఇద్దరిలో ఒకరు శ్రీచైతన్య సూల్‌కు విద్యార్థి. ఫైనల్‌కు చేరుకున్న నలుగురిలో మన దేశం నుంచి ఈ స్కూల్‌కు చెందిన విద్యార్థి మాత్రమే ఫైనల్ చేరడంతోపాటు, విజేతగా నిలిచాడు. ఏడు సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ స్పన్ డిబేట్‌లో నాలుగోసారి పతకం గెల్చుకోవడం ద్వారా, ప్రపంచంలో మరే ఇతర పాఠశాల సాధించని రికార్డును శ్రీచైతన్య సొంతం చేసుకుంది. 2018లో రన్నరప్‌గా, 2019లో మొదటి రెండు స్థానాలను, 2020లో రన్నరప్‌గా , 2024 విన్నర్‌గా నిలిచింది. అంతరిక్షంలో మానవ ఆవాసాల స్థాపనకు కృషి చేస్తున్న అమెరికా సంస్థ నేషనల్ స్పేస్ సొసైటీ 'స్పేస్ పాలసీ అండ్ యూనివర్సలైజేషన్' అనే అంశంపై' పాఠశాల విద్యార్థులకు స్పన్ డిబేట్‌ను నిర్వహించింది. ప్రపంచ వ్యాప్తంగా వందకుపైగా విద్యార్థులు ఈ పోటీకి ఎంపికైతే, వారిలో 12 మంది శ్రీచైతన్య విద్యార్థులే కావడం గమనార్హం. భారత్‌తోపాటు, బెలారస్, మెక్సికో, పెరూ, రుమేనియా, సిరియా, దక్షిణ కొరియా, ట ర్కీ, అమెరికా దేశాల నుంచి ఇద్దరు విద్యార్థులతో కూడిన పది జట్లు ఫైనల్‌కు అర్హత సంపాదించాయి. వీటిలో మన దేశం నుంచి క్వాలిఫై అయిన రెండు జట్లూ శ్రీచైతన్య స్కూల్‌కు చెందినవే. కాగా, విజేతగా నిలిచిన విద్యార్థిని, ఆమె తల్లిదండ్రులు, బోధనా సిబ్బంది, నాన్ టీచింగ్ స్టాఫ్‌ను స్కూల్ డైరెక్టర్ సీమ అభినందించారు. ఈ చారిత్రక విజయంతో జాతీయ, అంతార్జాతీయ వేదికలపై శ్రీచైతన్య తిరుగులేదని మరోసారి రుజువైందని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## కేంద్రమంత్రి బండికు ఘన స్వాగతం



ప్రజాపక్షం/శామీర్‌పేట : బారతీయ జనతాపార్టీ కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు శామీర్‌పేట మండలం మురాహారిపల్లిలోని బృందావన్ హోటల్ వద్ద బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బుధవారం ఘనం గా స్వాగతం పలికారు. కేంద్రమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన బండి సంజయ్ మొట్టమొదటి సారిగా తన స్వగ్రామం కరీంనగర్‌కు వెళ్తుండగా రాజీవ్ రహదారి మార్గమధ్యంలోని శామీర్‌పేట మండలానికి రావడంతో బిజెపి శ్రేణులు ఘన స్వాగతం పలికారు. మురాహారిపల్లిలోని సాయి బృందావన్ గార్డెన్ హోటల్‌లో అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా బిజెపి కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి రాజీవ్ రహదారి పొడవునా కేంద్రమంత్రి బండి సంజయ్‌కి నీరాజనాలు పలికారు. అనంతరం శాలువాలు బొకేలతో ఘనంగా సన్మానించారు. జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మేధావుల సేవలు యూనివర్శిటీకి అవసరం



ప్రజాపక్షం/శామీర్‌పేట: ప్రజాక్షేత్రంలో అత్యంత గోప్ప సేవలు అందిస్తున్న మేదావులను విశ్వవిద్యాలయ స్థాయిలో గౌరవించి విద్యాపరమైన సేవలు వినియోగించకునే విధంగా నల్సార్ యూనివర్శిటి విశిష్ట ప్రొఫెసర్‌లుగా మాజీ గవర్నర్, దౌత్యవేత్త గోపాలకృష్ణగాంధీ, ప్రముఖ పాత్రికేయుడు, మెగాసెసే అవార్డు గ్రహిత పి సాయినాథ్‌లను నియమించుకున్నామని నల్సార్ యూనివర్శిటి వైస్ చాన్స్‌లర్ శ్రీకృష్ణదేవరావులు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవిద్య పరిధిని విస్తృతం చేయాలని, న్యాయ శాస్త్రం చదువుతున్న విద్యార్థులకు న్యాయబావనకు సంబందించిన అనేక ప్రధాన ప్రశ్నలను పరిచయం చేయాలని బావిస్తున్నామని అన్నారు. ఆ దిశగా మేధావులను విశిష్ట ప్రొఫెసర్‌లుగా నియమించుకోవడం ఒక అడుగు ముందుకు వేయడం అని చెప్పారు. ప్రజాక్షేత్రంలో మేదావుల బోధనల ద్వార చట్టం అనేది కేవలం సాంకేతిక విషయ అద్యాయనం మాత్రమే కాదని విద్యార్థులకు సామాజిక మరియు ఆర్థిక న్యాయ అంశాలలో లోతైన ప్రశ్నలకు సంబందించిన అంశాలను అందించడం అవసరమని అన్నారు. విశ్వవిద్యాలయానికి ఈ మేదావులు విద్యార్థులకు చట్టానికి సామాజిక ఆర్థిక న్యాయానికి మధ్య ఉండే సంబంధాన్ని వివరిస్తారని తెలిపారు. గోపాలకృష్ణ గాంధీ డీల్లీలోని అశోక విశ్వ విద్యాలయంలో చరిత్ర, రాజకీయాల యొక్క విశిష్ట ప్రొఫెసర్‌గా పౌర సమాజ జీవితంలో ఎంతో సేవ చేశారన్నారు. ప్రజాపాలన రంగంలోను, దౌత్య రంగంలోను గవర్నర్ వంటి రాజ్యాంగ బాధ్యతల నిర్వహణలో విశేష ప్రతిభ చూపారన్నారు. పీపుల్స్ ఆర్కైవ్ ఆఫ్ రూరల్ ఇండియా వ్యవస్థాపకుడు, ది హిందూ పత్రిక రూరల్ అఫైర్స్ ఎడిటర్ గా పి సాయినాథ్ ఎన్నో సేవలు అందించారన్నారు. దాదాపుగా 30 సంవత్సరాలకు పైగా గ్రామీణ రిపోర్టింగ్‌లో ఉన్న ఒక ప్రముఖ పాత్రికేయుడని, అతను 2007లో రామన్ మెగాసెసే అవార్డు, 2000లో ఆమ్నేస్టి ఇంటర్‌నేషనల్ గ్లోబల్ హ్యూమన్ రైట్స్ జర్నలిజం ప్రైజ్‌తో పాటు 60 కంటే ఎక్కువ జాతీయ, అంతార్జాతీయ రిపోర్టింగ్ అవార్డులను అందుకున్నారని చెప్పారు.

## కళకు, పెట్టుబడికి బలమైన చరిత్ర

ఎఫ్ఎల్ఓ తో అరవింద్ విజయ్ మోహన్ వెల్లడి



ప్రజాపక్షం / హైదరాబాద్ : కళకు పెట్టుబడికి బలమైన చరిత్ర ఉందని ఆర్‌టీరీ ఇండియా లగ్జరీ బ్రాండ్ స్టోరీ క్రాఫ్ట్స్‌మ్యాన్ వ్యవస్థాపకుడు, సిఈఓ అరవింద్ విజయ్ మోహన్ అన్నారు. భారతదేశంలో ఆర్ట్ ఇన్వెస్ట్‌మెంట్ దృష్టాంతం గురించి ఆయన మాట్లాడుతూ కళను ఎప్పుడూ పెట్టుబడిగా చూడకూడదని పేర్కొన్నారు. కళ ఒక సాంస్కృతిక పెట్టుబడిగానే చూడాలని, అలా చూస్తుంటే గర్వం కలుగుతోందని వివరించారు.ఈ మేరకు ఎఫ్ఐసిసిఐ లేడీస్ ఆర్గనైజేషన్ (FLO) హైదరాబాద్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని ఒక హోటల్‌లో మాగ్నెటిక్ బ్రాండ్స్ సెషన్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అరవింద్ విజయ్ మోహన్ హాజరు కాగా అతనితో ఒక కళా పరిశోధకులు, కళా సలహాదారు, ఎఫ్ఎల్ఓ హైదరాబాద్ చైర్‌పర్సన్ ప్రియా గజ్దర్ సంభాషణ జరిపారు. భారతదేశంలో అత్యధికంగా అనుసరించబడుతున్న బ్రాండ్ స్టోరీ క్రాఫ్ట్‌మ్యాన్ ఆయిన అర్వింద్‌తో ఈరోజు సంభాషణలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం అరవింద్ విజయ్ మోహన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని బ్రాండ్‌గా ఎలా చూస్తున్నారనే మీడియా ప్రశ్నలకు ఆయన బదులిస్తూ బ్రాండ్ టీజీ ప్రగతిశీలి అని మరీ ముఖ్యంగా సైబరాబాద్ బ్రాండ్ ఆకర్షణీయమైనదని పేర్కొన్నారు. ప్రపంచం మొత్తం ఇప్పుడు ఇండియా బ్రాండ్‌ను గుర్తిస్తోందని, భారతదేశం యొక్క అంతర్జాతీయ అభిప్రాయాలు చాలా సానుకూలమైనవి, ప్రగతిశీలమైనవి కావడం విశేషం అన్నారు. తన జీవితకాల అనుభవాలను బ్రాండ్ కథలు కళల దృశ్యాలను సభికులతో పంచుకున్నారు. వ్యక్తిగతంగా చెప్పాలంటే తాను చిత్రకళా ఉపాధ్యాయుల కుటుంబానికి చెందినవాడినని చెప్పారు. నేను కళ ప్రపంచంలో పెరిగానని, నా ప్రమేయం లేకుండానే నేను ఈ రంగంలో స్థిరపడ్డానన్నారు. కళ చరిత్రపై అంతర్దృష్టిని ఇస్తూ లియోనార్డో చిత్రపటం రూ. 450 మిలియన్ల డాలర్లకు అమ్ముడుపోయిందన్నారు. ఇంకా అతను అనేక విజయవంతమైన బ్రాండ్ల కథనాలను పంచుకున్నాడు.

# చమురు ధరలు తగ్గించాలి

టి టిడిపి నేత పి.సాయిబాబా



ప్రజాపక్షం / హైదరాబాద్ : రాష్ట్రంలో పెట్రోల్, డిజిల్ ధరలు గరిష్ఠ స్థాయిలో పెరిగాయని, వెంటనే ఈ ధరలను తగ్గించాలని టి టిడిపి నేత, సికింద్రాబాద్ పార్లమెంటు అధ్యక్షులు పి.సాయి బాబా అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో రూ.2 చొప్పున తగ్గించినా చమురు ధరల్లో తగ్గుదల కనిపించడం లేదన్నారు. ఆ రకంగా దేశంలోనే ఎక్కడా లేని విధంగా తెలంగాణా రాష్ట్రంలో అత్యధిక చమురు ధరలు ఉన్నాయని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలు ఎప్పుడు తగ్గాతాయా? అని దేశ ప్రజలు ఎదురు చూస్తున్నారని, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే దేశంలో ఎక్కడా లేని విధంగా అన్ని రాష్ట్రాల్లో కంటే తెలంగాణలోనే వీటి రేట్లు ఎక్కువగా ఉన్నాయని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలు ఏ రోజుకారోజు నిర్ణయిస్తామని చెబుతున్న చమురు మార్కెటింగ్ సంస్థలు రిటైల్ ధరల పెంపును నిర్ణయిస్తున్నారన్నారు. దీనికి అనుగుణంగా మార్కెట్ ధరలు ఉంటున్నాయని, మనకు పెట్రోల్ బంకుల్లో కనిపించే రేట్లలో చూసుకుంటే డీలర్లకు పెట్రోల్ 42 శాతం, డీజిల్ 49 శాతం ధరలకే వస్తున్నా ధరలు పెంచి అమ్ముతున్నారన్నారు. ఇదిలా ఉంటే అటు కేంద్ర ప్రభుత్వం వీటిపై ప్రత్యేక పన్నులు విధిస్తోందన్నారు. కస్టమ్స్ డ్యూటీ, సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీ కలిపి 31 శాతం పన్నులు ఉంటాయని పి.సాయిబాబా గుర్తు చేశారు. దీంతో లీటర్ పెట్రోల్ పై కేంద్రం రూ.32.90, డీజిల్ పై రూ.31.80 వసూలు చేస్తోందన్నారు. అదేమని ప్రశ్నిస్తే... తమకు మరోవైపు.. డీలర్ కమిషన్ పెట్రోల్ పై 4 శాతం, డీజిల్ పై 3 శాతం ఉంటాయని చెబుతోందని గుర్తు చేశారు. పెట్రోల్, డీజిల్ పై రాష్ట్రాలు పన్నులు విధిస్తున్న క్రమంలో చూసి ధరలు నిర్ణయించాలని సాయిబాబా అన్నారు. తెలంగాణలో లీటర్ పెట్రోల్ పై 35.20 శాతం, లీటర్ డీజిల్ పై 27 శాతం వ్యాట్ వసూలు చేయడం కూడా సరికాదన్నారు. తెలంగాణలో వసూలు చేస్తున్న వ్యాట్, సెస్‌లు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలోనే అధికంగా ఉన్నాయన్నారు. అందుకే తెలంగాణా రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ ధరలు మండిపోతున్నాయని సాయిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. కావున రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తెలంగాణలో వసూలు చేస్తున్న వ్యాట్, సెస్‌లను తగ్గించి అధిక ధరలతో అల్లాడుతున్న పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరట కల్పించాలని సాయిబాబు కోరారు. నిజంగా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజు గౌడ్, మేడిపల్లి శ్యామ్ సుందర్, ఎస్.ప్రకాష్, యాదిగిరి రావు తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాణాల్లో నాణ్యత లోపించకూడదు

ఎంఎల్ఎ వీర్లపల్లి శంకర్



ప్రజాపక్షం/కేశంపేట: ప్రజల అవసరాల కోసం నిర్మించే నిర్మాణాల్లో నాణ్యత లోపించకూడదని షాద్‌నగర్ ఎంఎల్‌ఏ వీర్లపల్లి శంకర్ అన్నారు. కేశంపేట మండల కేంద్రంలోని వాగుపై సుమారు 50 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను ఆయన బుధవారం పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించకుండా చూసుకుని, నిర్మాణం చాలా కాలం మన్నేలా నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వాగుపై నిర్మాణ పనులు చురుగ్గా సాగుతుండడంతో చుట్టుపక్కల పొలాల రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి విశాలశ్రావణ్‌రెడ్డి, పీఆర్ఏఈ భూపాల్, కేశంపేట, ఫరూఖ్‌నగర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, బాల్‌రాజ్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గూడ వీరేష్, నాయకులు యాదయ్యయాదవ్, శ్రావణ్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, కరుణాకర్‌రెడ్డిలతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

# విచ్చలవిడిగా ఇసుక అక్రమ రవాణా

పోలీసులు, రాజకీయ నాయకుల పేర్లతో హల్‌చల్

అడ్డుకునే వాడేవడంటూ బెదిరింపులు



ప్రజాపక్షం / కొడంగల్ :అనుమతుల పేరుతో విచ్చలవిడిగా అక్రమ ఇసుక రవాణా సాగుతున్న అరికట్టే నాథుడే కరువయ్యాడనే విమర్శలు వెల్లవిరుస్తున్నాయి. కొడంగల్ నియోజకవర్గంలో అధికార యాంత్రాంగాన్ని గుప్పిట్లో పెట్టుకుని పోలీసుల కళ్లముందే ఇష్టానుసారంగా అక్రమ రవాణా సాగుతున్న పోలీసులు ఎందుకు మౌనంగా ఉంటున్నారు. అక్రమ వ్యాపారులు తూతూ మంత్రంగా అనుమతుల పత్రాలను తీసుకుని యాలాల్ మండలంలోని దేవనూర్ నుంచి బోంరాస్‌పేట మీదుగా కొడంగల్‌కు పదుల సంఖ్యలో విచ్చలవిడిగా పట్టపగలే దోరికినంత దోచుకుంటు జిల్లా కలెక్టర్ నుంచి కింది స్థాయి అధికారి వరకు ప్రతి ఒక్కరి కళ్లు కప్పి అక్రమ వ్యాపారాలకు తెరలేపుతున్నాట్లు తెలుస్తుంది. అయితే గత రెండు రోజులుగా బోంరాస్‌పేట మండలంలోని మహాంతిపూర్ వాగు నుంచి కొడంగల్ పట్టణానికి చెందిన లక్ష్మి భర్త మొగులయ్యలు ఇళ్లు కట్టుకునేందుకు జిల్లా కలెక్టర్ పేరుతో ఆన్‌లైన్‌లో 18 వేలు డిడిలు కట్టి ఇసుక రవాణాకు అనుమతులు తీసుకోవడం జరిగింది. మొత్తం ఆరు ట్రాక్టర్‌లు ఉండగా రోజుకు ఒక ట్రాక్టర్ ఒక ట్రిప్పు మాత్రమే నడపాలి ఇది అధికారికంగా ఉన్నటువంటి అనుమతులు. కాని ఇసుక వ్యాపారులు పేరు ఒకరిది సోమ్ము మరోకరిది అంటు వారికి నచ్చిన రీతిలో దాదాపు రోజుకు 20 నుంచి 30 ట్రాక్టర్‌లు అక్రమ ఇసుక రవాణా చేస్తు అధికారులను, పోలీసులను తప్పుదోవ పట్టుస్తు ప్రభుత్వ సోమ్మును కాజేస్తున్నారు. బీజాపూర్ హైదారాబాద్ నేషనల్ హైవే పోలీస్ స్టేషన్ ముందు నుంచే పోలీసుల కళ్ల ముందే అక్రమ రవాణా సాగుతున్న పోలీసులు ఏందుకు పట్టించుకోవడం లేదనే విమర్శలకు తావిస్తుంది. దీనిపై అక్రమ వ్యాపారులు బహిరంగంగా పోలీసులు మాకు అండగా ఉన్నారని దీంతో పాటు కాంగ్రెస్ పార్టీ లీడర్ల మంటు బెదిరింపులకు గురి చేస్తున్నారని కొంతమంది వాపోతున్నారు. దీనిపై పోలీసులను వివరణ కొరగా ఇసుక ట్రాక్టర్‌లకు అనుమతులు ఉన్నాయని అందుకే పట్టించుకోవడం లేదంటు సమాదానాలు ఇస్తున్నారు. అనుమతులకు మించి ట్రాక్టర్‌లు నడుస్తుంటే దీనిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. అదేవిధంగా యథేచ్చగా సాగుతున్న మట్టి ట్రాక్టర్‌లను కూడా పట్టుకుని సీజ్ చేస్తామని తెలిపారు.

## ఫర్టిలైజర్స్ దుకాణంలో అనుమతులు లేని ఎరువులు

సీజ్ చేసిన వ్యవసాయ అధికారి



ప్రజాపక్షం / కొడంగల్ : ఓ ఫర్టిలైజర్స్ దుకాణంలో అనుమతులు లేకుండా అక్రమంగా ఎరువులు అమ్ముతున్నారనే సమాచారంతో దాడులు చేసిన అధికారి వాటిని సీజ్ చేసి షాపు యజమానికి నోటీసులు అందించినట్లు కొడంగల్ వ్యవసాయ అధికారి లావణ్య తెలిపారు. పూర్తి వివరాల్లోకి వెళితే కొడంగల్ పట్టణంలోని వైష్ణవి ఫర్టిలైజర్స్ &పెస్టిసైడ్స్ దుకాణంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఎరువుల మందులు అమ్ముతున్నారనే పక్క సమాచారం మేరకు బుధవారం దాడులు చేసి విచారణ చేపట్టగా దుకాణంలో ఉన్న 68 మెట్రిక్ టన్నుల డిఏపి, 88 మెట్రిక్ టన్నుల యూరియా, 13మెట్రిక్ టన్నుల ఎస్ఎస్‌పి ఎరువులు ఉన్నట్లు గుర్తించారు. వీటి విలువ దాదాపు 25లక్షలకుపైగానే ఉంటుందని అంచన వేశారు. దీనిపై అధికారులు స్టాక్ సీల్ చేసి అనుమతులు లేకుండా అమ్మిన కొనినా చట్టరిత్య చర్యలు తీసుకుంటామని నోటీసులు అందించినట్లు పేర్కొన్నారు. దుకాణాలలో అనుమతులు లేకుండా మందులు, ఎరువులు కొనుగోలు చేసిన, విక్రయాలు జరిపిన చట్టపరంగా చర్యలు తీసుకుని కేసులు నమోదు చేయడంతో పాటు లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులకు సంబందించి పూర్తి వివరాలను స్టాక్ పాయింట్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. రైతులు విత్తనాలు, మందులు కోనేముందు అధికారుల సూచనలు సలహాలు తీసుకోవాలని తస్మాత్ జాగ్రత్తలు పాటించాలన్నారు.

## పాఠశాలలకు ర్యాక్స్, బుక్స్ పంపిణీ

ప్రజాపక్షం/కేశంపేట: రోటరీ క్లబ్ ఆఫ్ భాగ్యనగర్ వారి సౌజన్యంతో లైబ్రరీ ప్రాజెక్టులో భాగంగా కేశంపేట మండలంలోని 27 ప్రభుత్వ పాఠశాలలకు బుధవారం జడ్పిటిసి తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి చేతుల మీదుగా ర్యాక్స్, బుక్స్ పంపిణి చేశారు. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ మద్దిలేటి, సెక్రెటరి ఆదినారాయణ, సభ్యులు జిఎస్‌రెడ్డి, బాల్‌రెడ్డి, హరికొల్లారెడ్డి, శ్యామ్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, మహీధర్‌రెడ్డి, రమణ, ఏంఈఓ మనోహర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# క్రీడ

## రెండో వన్డేలోనూ అదుర్స్

### హర్మన్ సేన ఖాతాలో మరో విక్టరీ

**బెంగళూరు :** బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా సౌతాఫ్రికాతో బుధవారం జరిగిన రెండో వన్డేలో టీమ్ఇండియా మహిళలు అదరగొట్టారు. ఎంతో ఉత్కంఠగా జరిగిన ఈ పోరులో కివీస్ మహిళల జట్టుపై 4 పరుగుల తేడాతో విజయం సాధించారు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 3 వికెట్లకు 325 పరుగులు భారీ స్కోర్‌ను నమోదు చేసింది. స్మృతి మంధాన (136) సెన్సేషనల్ సెంచరీతో జట్టుకు మంచి స్కోర్ అందించగా, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(103*) కూడా శతకం బాది అదరగొట్టింది. ఇక రిచా ఘోష్(25 *) కూడా తన ఇన్నింగ్స్‌లో మెరుపులు మెరిపించింది. సౌతాఫ్రికా బౌలర్లలో ఎమ్‌లాబా రెండు వికెట్లు, క్లాస్ ఓ వికెట్‌ను తమ ఖాతాలో వేసుకున్నారు. భారత్ నిర్దేశించిన భారీ లక్ష్యాన్ని ఛేధించేందుకు మైదానంలోకి దిగిన కివీస్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లకు 321 పరుగులు చేసింది. అయితే గెలుపునకు అతి చేరువలో వచ్చి ఓటమిని చవిచూసింది. ఇక ఆ జట్టులోని కెప్టెన్ లారా వోల్వార్డ్135*), మరిజన్నే కాప్(114*) సెంచరీలతో రాణించినప్పటికీ గెలవలేకపోయారు. భారత బౌలర్లలో పూజా వస్త్రాకర్(2/54), దీప్తి శర్మ(2/56) రెండేసి వికెట్లు పడగొట్టగా, అరుంధతి రెడ్డి(1/62), స్మృతి మంధానా(1/13) చెరో వికెట్ తమ ఖాతాలో వేసుకున్నారు.



**భారత మహిళల తుది జట్టు :** హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), షఫాలీ వర్మ, స్మృతి మంధాన, దయాళన్ హేమలత, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్(వికెట్ కీపర్), దీప్తి శర్మ, పూజా వస్త్రాకర్, రాధా యాదవ్, ఆశా శోభన, రేణుకా ఠాకూర్ సింగ్, అరుంధతి రెడ్డి, శ్రేయాంక పాటిల్, ప్రియా పునియా, సైకా ఇషాక్, ఉమా ఛెత్రీ.

**సౌతాఫ్రికా మహిళల తుది జట్టు :** లారా వోల్వార్డ్ (కెప్టెన్), తజ్మిన్ బ్రిట్స్, అన్నెకే బాష్, సునే లూస్, మారిజానే కాప్, అన్నరీ డెర్క్‌సెన్, నొండుమిసో షాంగసే, సినాలో జాఫ్తా(వికెట్ కీపర్), మసబాటా క్లాస్, నోంకులులేకో మ్లాబా, అయాబొంగా ఖాకా, టునెమీ టిఖుక్, డెల్మీ, ఖాకా మైకే డి రిడర్, నాడిన్ డి క్లెర్క్, ఎలిజ్‌మారీ మార్క్స్.

## కోచ్ సెలెక్షన్స్‌లో ట్విస్ట్

### గంభీర్ ముందు ఆ మూడు కీలక ప్రశ్నలు



**న్యూఢిల్లీ :** టీమ్ఇండియా మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్ త్వరలో భారత జట్టు కొత్త కోచ్‌గా నియమితులయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొత్త కోచ్ నియామకానికి సమయం దగ్గరపడుతున్న తరుణంలో బిసిసిఐ క్రికెట్ సలహా కమిటీ (సిఎసి) తాజాగా పలు ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఈ నేపథ్యంలో గంభీర్ కూడా మంగళవారం ఈ ఇంటర్వ్యూలకు వర్చువల్‌గా పాల్గొన్నాడు. దాదాపు 40 నిమిషాల పాటు సాగిన ఈ మీటింగ్‌లో గంభీర్‌ను అక్కడ మూడు కీలక ప్రశ్నలు అడిగినట్లు సమాచారం. ఇంతకీ అవేంటంటే?

* జట్టు కోచింగ్ సిబ్బందికి సంబంధించి మీ ఆలోచనలు ఎలా ఉన్నాయి?
* బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో కొంతమంది సీనియర్ ఆటగాళ్లు ఉన్నప్పుడు, జట్టులో మార్పులు చేయాలంటే ఆ పరిస్థితిని మీరు ఎలా ఎదుర్కొంటారు?
* ఒక్కో ఫార్మాట్‌కు ఒక్కో కెప్టెన్, వర్క్‌లోడ్‌కు అనుగుణంగా ఆటగాళ్ల ఫిట్‌నెస్ పరిమితులు, ఐసిసి ట్రోఫీలు గెలవలేక జట్టు ఎదుర్కొంటున్న వైఫల్యాలను పరిష్కరించడం వంటి అంశాలపై మీ అభిప్రాయాలు ఏంటీ?

ఇలా మూడు ప్రశ్నలను కమిటీ సభ్యులు అడిగినట్లు తెలుస్తోంది. అయితే కోచ్ నియామకానికి సంబంధించిన ఇంటర్వ్యూలో గంభీర్ ఓ రౌండ్ పూర్తి చేశారు. రెండో రౌండ్ బుధవారం జరగనుంది. ఇదిలా ఉండగా, కోచ్ పదవికి దరఖాస్తు చేసిన వారిలో నుంచి గంభీర్‌నే కాకుండా డబ్ల్యువి రామన్‌ను కూడా బిసిసిఐ తాజాగా ఇంటర్వ్యూకు పిలిచింది. వీరిద్దరూ కూడా వర్చువల్‌గానే హాజరయ్యారు. రామన్‌తోనూ సభ్యులు 40 నిమిషాల పాటు మాట్లాడారు. రెండో రౌండ్ కూడా పూర్తయ్యాక గంభీర్‌ను కోచ్‌గా ప్రకటించే అవకాశాలు కన్పిస్తున్నాయట. కాగా, రామన్‌ను ఇంటర్వ్యూ చేసినప్పటికీ కూడా బిసిసిఐ గౌతమ్ గంభీర్ వైపే ఎక్కువ మొగ్గు చూపుతున్నట్లు సమాచారం అందుతోంది. ఇకపోతే హెడ్ కోచ్ ఎంపికతో పాటు అజిత్ అగార్కర్ నేతృత్వంలోని ప్యానెల్‌కు కూడా కొత్త సెలెక్టర్‌ను ఎంపిక చేసే పనిలో ఉంది బిసిసిఐ. ఏదేమైనా రానున్న రోజుల్లో భారత క్రికెట్‌లో మరిన్ని గణనీయమైన మార్పుల కోసం బిసిసిఐ ఆలోచించి మరీ నిర్ణయాలు తీసుకుంటోందట. కొత్త కోచ్, సెలెక్టర్ నియామకాలు జట్టులో కొత్త ఉత్సాహాన్ని ఇస్తాయని భావిస్తోందట. దీంతో బిసిసిఐ ఎలాంటి నిర్ణయాలు తీసుకోబోతుందా అని క్రికెట్ అభిమానులు కూడా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

## టాప్‌లోనే స్కై.. ఆల్‌రౌండర్ కేటగిరిలో దూసుకొచ్చిన స్టోయినిస్



**న్యూఢిల్లీ :** టీ20 ప్రపంచకప్‌లో గొప్పగా రాణిస్తున్న ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ మార్కస్ స్టోయినిస్ తాజా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో దూసుకెళ్లాడు. అఫ్గాన్ ఆటగాడు నబీని వెనక్కి నెట్టి ఆల్‌రౌండర్ కేటగిరిలో నంబర్‌వన్ స్థానానికి చేరుకున్నాడు. ఈ పొట్టి ప్రపంచకప్‌లో ఇప్పటి వరకూ 190 స్ట్రైక్ రేట్‌తో స్టాయినిస్ 156 పరుగులు చేశాడు. బంతితోనూ రాణిస్తూ 6 వికెట్లు తీసి జట్టు సూపర్ 8 చేరడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ విభాగంలో నబీ నాలుగో స్థానానికి పడిపోగా.. శ్రీలంక కెప్టెన్ హసరంగ, బంగ్లా ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్ రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. పొట్టి ఫార్మాట్‌లో టాప్ బ్యాటర్‌గా టీమ్ఇండియా ఆటగాడు సూర్యకుమార్ యాదవ్ కొనసాగుతున్నాడు. అతడి తర్వాత ఇంగ్లాండ్ బ్యాటర్ ఫిల్ సాల్ట్, పాక్ కెప్టెన్ బాబర్ అజామ్ ఉన్నారు. ఇక టీ20 టీమ్ ర్యాంకింగ్స్‌లో.. టీమ్ఇండియా టాప్‌లో కొనసాగుతోంది. ఆ తర్వాత ఆస్ట్రేలియా, వెస్టిండీస్ ఉన్నాయి.

# రీల్



### మహేష్ గొప్ప మనసు..

## తన అభిమాని కుటుంబాన్ని దత్తత

మన టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ ఒక్క ఆన్ స్క్రీన్ మీదనే కాకుండా ఆఫ్ స్క్రీన్ లో కూడా రియల్ హీరో అని అందరికీ తెలిసిందే. తన కష్టార్జితం నుంచి చిన్న పిల్లలకి గుండె ఆపరేషన్ కోసం వెచ్చించి ఇప్పటివరకు ఎన్నో వేల ప్రాణాలని కాపాడి అంతమంది కుటుంబాలకి కనిపించే దైవం అయ్యాడు. అయితే అయితే తనకి ఉన్న కోట్ల అభిమానుల్లో ఒక అభిమాని తాలూకా విషాదగాథ ఇప్పుడు అందరినీ ఎంతగానో కదిలిస్తుంది. బాపట్ల కాకర్లమూడికి చెందిన మహేష్‌బాబు అలాగే స్వర్గీయ కృష్ణగారికి వీరాభిమాని అయినటువంటి రాజేష్ అనే వ్యక్తి గత కొంతకాలం నుంచి తీవ్రమైన అనారోగ్య సమస్యలకి గురికావడంతో తమ మీద ఆధారపడిన కుటుంబం ఒక్కసారిగా నిస్సహాయత స్థితిలోకి వెళ్ళిపోయింది. అయితే ఇంకా చిన్నవయసులోనే ఉన్న ముగ్గురు కొడుకులు తనకి ఉండగా వారికి మహేష్‌బాబు మీద ఉన్న అభిమానంతో అర్జున్, అతిథి, ఆగడు అంటూ మహేష్ సినిమాల పేర్లనే తాను పెట్టుకున్నాడు. వీరిలో పెద్దవాడు అర్జున్ ఏదో చిన్న పనిచేస్తూ ఖర్చులకి సంపాదిస్తున్నాడు అట, కానీ అవి ఏమాత్రం సరిపోవడం లేదు.

### నా కెరీర్‌పై

## ప్రీతి ప్రభావాన్ని వెల్లడించిన తాప్సీ



జియో సినిమాలో ప్రీమియర్ అయిన శిఖర్ ధావన్ తొలి షో, ధావన్ కరేంగే విత్ శిఖర్ ఇటీవలి ఇంటర్వ్యూలో, షారూఖ్‌ఖాన్తో కలిసి రాజుకుమార్ హిరానీ చిత్రం డన్కీలో చివరిగా కనిపించిన బాలీవుడ్ నటి తాప్సీ పన్ను తన బాలీవుడ్ ప్రయాణం గురించి ఆసక్తికరమైన వివరాలను పంచుకుంది. ఇంటర్వ్యూలో, తాప్సీ తన బాలీవుడ్‌కు పరిచయం కావడానికి కారణం ప్రీతి జింటాతో ఉన్న ఒక పోలిక కారణం అని వెల్లడించింది. ప్రీతి జింటాతో తనకు ఉన్న సారూప్యత కారణంగా తాను మొదట బాలీవుడ్‌కు పరిచయం అయ్యానని నటి పట్ల తన ప్రగాఢమైన అభిమానాన్ని వ్యక్తం చేసింది. ఆమె ఎల్లప్పుడూ ఆమెలాగే ఉండేందుకు ప్రయత్నించిందని పేర్కొంది. తాప్సీ హృదయపూర్వక ప్రశంసల మాటలను విన్న ప్రీతిజింటా అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తన రాబోయే ప్రాజెక్ట్ గురించి, తాప్సీ తన పైప్‌లైన్లో ఫిర్ ఆయీ హసీన్ దిల్రుబా, వో లడ్కీ హై కహాన్ మరియు ఖేల్ ఖేల్ మే వంటి సినిమాలు ఉన్నాయని పేర్కొంది.

## 'శర్వా 37'లోకి యంగ్ హీరోయిన్ ఎంట్రీ



యంగ్ హీరో ఛార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా కృతి శెట్టి హీరోయిన్‌గా నటించిన రీసెంట్ చిత్రం మనమేతో పలకరించిన సంగతి తెలిసిందే. ఇక ఈ సినిమా తర్వాత శర్వానంద్ తన కెరీర్ 37వ సినిమాలో బిజీగా ఉన్నాడు. మరి ఈ సినిమాని రామ్ అబ్బరాజు దర్శకత్వం వహిస్తుండగా ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్టైన్మెంట్స్ వారు నిర్మాణం వహిస్తు న్నారు. అయితే ఈ సినిమా నుంచి మేకర్స్ ఇంట్రెస్టింగ్ అప్డేట్‌ని అందించారు. ఈ సినిమా హీరోయిన్‌ని పరిచయం చేస్తూ యంగ్ హీరోయిన్ సాక్షి వైద్యని పరిచయం చేశారు. మరి ఈ సినిమాలో ఈమె నిత్యాగా కనిపించనుంది అని డీసెంట్ లుక్స్ తో కూడిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ని మేకర్స్ రిలీజ్ చేశారు. మరి ఇందులో ఈమె చాలా అందంగా కనిపిస్తూ ఆకట్టు కునేలా ఉంది. మరి ఈ సినిమాలో ఈమె ఎలాంటి పెర్ఫామెన్స్ ని అందించనుందో చూ డాలి. ఇక ఈ చిత్రానికి విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నాడు.

## కేజ్రీవాల్ డబ్బు డిమాండ్ చేసినట్లు ఆధారాలున్నాయి: ఇడి

**న్యూఢిల్లీ :** ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని కోర్టు జూలై 3 వరకు పొడిగించింది. మద్యం కుంభకోణంలో అరెస్టయిన కేజ్రీవాల్ రెగ్యులర్ బెయిల్ కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు విచారించింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయనను కోర్టు ముందు హాజరుపరిచారు. సిఎం అరవింద్ కేజ్రీవాల్ రూ.100 కోట్లు డిమాండ్ చేసినట్లుగా ఆధారాలు ఉన్నాయని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కోర్టుకు తెలిపింది. అరెస్టుకు ముందే ఆధారాలు సేకరించినట్లుగా పేర్కొంది. కేజ్రీవాల్ పిఎంఎల్ఏ కింద దాఖలు చేసిన ఛార్జిషీట్లలో ఆయన పేరు లేదని కేజ్రీవాల్ తరపు న్యాయవాది విక్రమ్ చౌదరి వాదించారు. సిబిఐ దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌లో సైతం కేజ్రీవాల్‌ను నిందితుడిగా పేర్కొనలేదన్నారు. కేజ్రీవాల్ కింది కోర్టులో బెయిల్ పిటిషన్ వేయవచ్చని మే 10న సుప్రీం కోర్టు ఆదేశాల్లో పేర్కొన్న విషయాన్ని ప్రస్తావించారు. ఎన్నికల సమయంలో కేజ్రీవాల్ అరెస్టు సమయం వెనుక దురుద్దేశం ఉందన్నారు. మద్యం కుంభకోణం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై మార్చి 21న కేజ్రీవాల్‌ను ఇడి అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. తన అరెస్టును సవాల్ చేస్తూ కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దానిపై విచారణ ఆలస్యమవుతుండటంతో ఎన్నికల్లో ప్రచారం కోసం చేసిన అభ్యర్థనను అంగీకరిస్తూ.. కోర్టు షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ ఇచ్చింది. కోర్టు ఆదేశాల మేరకు జూన్ 2న తిరిగి జైలు అధికారుల ముందు లొంగిపోయారు. ఆయన ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్నారు.

## నీటి సమస్య పరిష్కరించకుంటే నిరవధిక దీక్ష: అతిశీ

**న్యూఢిల్లీ :** ఒకవైపు భానుడి ప్రతాపం.. మరోవైపు నీటి సంక్షోభం ఢిల్లీ ప్రజలను పీడిస్తున్నాయి. నీటి కొరతతో నగరవాసులు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని కేంద్రాన్ని ఢిల్లీ ప్రభుత్వం కోరింది. నగరంలో నెలకొన్న నీటి ఎద్దడికి రెండు రోజుల్లో ముగింపు పలికేలా చర్యలు తీసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాసింది. తమ నీటి వాటాను హర్యానా ప్రభుత్వం సరైన సమయానికి విడుదల చేయకపోవడంతో ఢిల్లీలో నీటి సంక్షోభం మరింత తీవ్రమవుతోంది. 'వాటా ప్రకారం.. హర్యానా నుంచి ఢిల్లీకి 613 ఎంజిడి (రోజుకు మిలియన్ గ్యాలన్లు) రావాల్సిఉంది. కానీ, మంగళవారం 513 ఎంజిడిలను మాత్రమే విడుదల చేశారు. ఒక ఎంజిడి నీరు 28,500 మంది అవసరాలకు వినియోగించవచ్చు. అంటే 28 లక్షల మందికి పైగా నీటి కొరతతో నరకం చూస్తున్నారు. ఈ సమస్యపై ఇప్పటికి ఎన్నోసార్లు అక్కడి ప్రభుత్వానికి లేఖ రాశాను' అని ఆప్ మంత్రి ఆతిశీ తెలిపారు. ప్రస్తుతం హీట్‌వేవ్ కారణంగా ఇబ్బందిపడుతున్న నగరవాసులకు నీటి సంక్షోభం కూడా తోడైందని ఢిల్లీ మంత్రి ఆవేదన వ్యక్తంచేశారు. 'ఈ సమస్యను పరిష్కరించాలని ప్రధాని మోదీకి లేఖ రాశా. ఒకవేళ జూన్ 21 లోగా వారు స్పందించకపోతే.. నిరవధిక దీక్ష చేపడతా' అని ఆతిశీ స్పష్టంచేశారు. కాగా.. యమునా నదీ ప్రవాహం తగ్గడంతో ఢిల్లీ నీటి అవసరాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ సమస్యను కొంతైనా తగ్గించేందుకు నీటి సరఫరా వ్యవస్థ దెబ్బతినకుండా అధికారిక బృందాలు గస్తీ కాస్తున్నాయి.

## ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు మృతి

**జమ్ము:** జమ్మూకశ్మీర్‌లో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు తీవ్రవాదులు హతమయ్యారు. ఒక పోలీస్ అధికారి గాయపడ్డారు. ఈ మేరకు పోలీస్ ఉన్నతాధికారి వెల్లడించారు. బారాముల్లాలో సోపోర్ ప్రాంతంలో తీవ్రవాదులు, భద్రతా దళాలకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు తీవ్రవాదులు మరణించారని తెలిపారు. మరోవైపు కేంద్రపాలిత ప్రాంతం బండిపోరాలోని అర్గామ్ ప్రాంతంలో తీవ్రవాదులు ఉన్నారని భద్రత దళాలకు ఆదివారం రాత్రి సమాచారం అందింది. ఈ నేపథ్యంలో భద్రతాదళాలు తనిఖీలు నిర్వహించాయి. ఈ విషయాన్ని గమనించిన తీవ్రవాదులు భద్రతా దళాలపై కాల్పులకు తెగబడ్డారు. ఆ క్రమంలో భద్రతాదళాలు జరిపిన కాల్పుల్లో ఒక తీవ్రవాది మరణించాడు.

# 20శాతం లోటు వర్షపాతం

### రుతుపవనాలు ముందుగా వచ్చినా వర్షాలు లేవు

**న్యూఢిల్లీ :** నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది దేశంలోకి ముందుగానే ప్రవేశించినా, ఇప్పటి వరకు 20శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు భారత వాతావరణ విభాగం (ఐఎండి) వెల్లడించింది. జూన్ 12–18 మధ్య రుతుపవనాల కదలికల్లో పెద్దగా పురోగతి కనిపించలేదని పేర్కొంది. అయితే, రానున్న 3–4 రోజుల్లో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, కోస్తాంధ్ర, బీహార్, జార్ఖండ్‌లో పరిస్థితులు అనుకూలంగా మారనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. జూన్ 1–18 మధ్య భారత్‌లో 64.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఐఎండి వెల్లడించింది. సాధారణంగా ఈ సమయంలో సగటున 80.6 మిమీ వర్షపాతం కురవాల్సి ఉందని తెలిపింది. జూన్ 1 నుంచి భారత వాయువ్య ప్రాంతంలో 10.2 మిమీ (సాధారణం కంటే 70 శాతం తక్కువ), మధ్య భారత్‌లో 50.5 మిమీ (సాధారణం కంటే 31 శాతం తక్కువ), దక్షిణాదిలో 106.6 మిమీ (సాధారణం కంటే 16 శాతం అధికం), తూర్పు, ఈశాన్య ప్రాంతాల్లో 146.7 మిమీ (సాధారణం కంటే 15 శాతం తక్కువ) వర్షపాతం నమోదైనట్లు ఐఎండి పేర్కొంది.

**జూన్ 12కే దేశవ్యాప్తంగా విస్తరించాయి**

ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు నికోబార్ ప్రాంతంలోకి మే 19న ప్రవేశించాయి. మే 30 నాటికి దక్షిణ, మధ్య భారతదేశంలోని కొన్ని ప్రాంతాలతో పాటు ఈశాన్య రాష్ట్రాల వరకు విస్తరించాయి. సాధారణం కంటే ఆరు రోజులు ముందుగానే వచ్చాయి. జూన్ 12 నాటికి కేరళ, కర్ణాటక, గోవా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు రుతుపవనాలు పూర్తిగా విస్తరించాయి. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, బంగాల్, సిక్కిం, ఈశాన్య రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లోనూ వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత రుతుపవనాల కదలికల్లో పెద్దగా పురోగతి కనిపించలేదని ఐఎండీ పేర్కొంది. భారత్‌లోని 11 వాతావరణ ఉప విభాగాల పరిధిలో జూన్ 1 18 మధ్య సాధారణం, అంత కంటే అధిక వర్షపాతం నమోదైనట్లు తెలిపింది. మరో 25 ఉప విభాగాల పరిధిలో తక్కువ నుంచి అతితక్కువ వర్షం కురిసినట్లు వెల్లడించింది.

**'సాధారణం కంటే తక్కువే'**

జూన్ నెలలో దేశవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతమే నమోదవుతుందని ఐఎండి అంచనా వేసింది. దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ, వాయువ్యం, మధ్య భారత్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావచ్చని పేర్కొంది. దేశంలోని అత్యధిక వర్షాధార వ్యవసాయ ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. భారతదేశంలో ఎక్కువ శాతం వర్షాధార పంటలే. అందుకు రుతుపవనాలు కీలకం. నికర సాగు విస్తీర్ణంలో 52 శాతం వీటిపైనే ఆధారపడి ఉంది. తాగునీరు, విద్యుత్ ఉత్పత్తికి కీలకమైన రిజర్వాయర్లను నింపడానికి కూడా ఇది చాలా కీలకంగా ఉంది. జూన్, జులైలను సాగుకు అత్యంత ముఖ్యమైన రుతుపవన నెలలుగా పరిగణిస్తారు.

## అసోంను ముంచెత్తిన వరదలు 26మంది మృతి

### 1.61లక్షల మందికి తీవ్ర ఇబ్బందులు



**న్యూఢిల్లీ :** అసోంలో వరదలు భీకరరూపం దాల్చాయి. భారీ వర్షాల కారణంగా సంభవించిన వరదల్లో ఇప్పటివరకు 26 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. మంగళవారం రాత్రి కరీంగంజ్ జిల్లాలో కొండచరియలు విరిగిపడి ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతిచెందినట్లు చెప్పారు. మృతుల్లో ముగ్గురు మైనర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. 'కుంభవృష్టిగా కురుస్తున్న వర్షాలతో 15 జిల్లాలోని సుమారు 1.61 లక్షల మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నదులు, కాలువలు ఉద్ధృతంగా ప్రవహిస్తుండటం వల్ల రహదారులు, ఇళ్లు ధ్వంసమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మొత్తం 470 గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. వరద తాకిడికి సుమారు 1380 హెక్టార్ల పంట నష్టపోయింది. ఇంకా కొన్ని ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. 5 వేల పైగా పౌరులు సహాయక శిబిరాల్లో తలదాచుకుంటున్నారు' అని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

## ఆపరేషన్ థియేటర్‌లో డాక్టర్, నర్సు రొమాన్స్



**చెన్నై:** చెన్నైలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేసే డాక్టర్, నర్సు ఆపరేషన్ రూమ్‌లో రొమాన్స్ చేస్తూ కెమెరాకి చిక్కారు. ఆ వీడియోలోని డాక్టర్‌ని సుబ్బయ్య షణ్ముగంగా గుర్తించారు. అందులోని నర్సు ఆపరేషన్ థియేటర్‌లో పని చేసే మహిళ అని తేలింది. ఈ ఘటన నగరంలోని రాయపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చోటుచేసుకుంది. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఈ వీడియో కలిగిన పెన్‌డ్రైవ్‌తో పాటు ఒక లేఖను ఓ జాతీయ వెబ్‌సైట్‌కి పంపించారు.ఈ ఘటన గురించి తమకు ఎలాంటి సమాచారం గానీ, డాక్టర్ సుబ్బయ్యపై ఫిర్యాదు గానీ అందలేదని ఆసుపత్రి అధికారులు తెలిపారు. వీడియో బయటకు వచ్చింది కాబట్టి దీనిపై విచారణ జరుపుతామని పేర్కొన్నారు. 'డాక్టర్‌పై మాకు ఇంతవరకూ ఎలాంటి ఫిర్యాదు అందలేదు. కానీ... జూన్ 14వ తేదీ నుంచి ఈ వీడియో చక్కర్లు కొడుతోంది కాబట్టి విచారణ ప్రారంభించాం' అని రాయపేట ఆసుపత్రిలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆయిషా చెప్పారు. మరోవైపు ఈ వీడియో ఎవరు, ఎం దుకు తీశారనేది ప్రశ్నార్థకంగా మారింది. డాక్టర్ షణ్ముగంపై 2020లో లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చాయి. పొరుగింటి వారితో పార్కింగ్ విషయమై ఆయన పెద్ద గొడవకే దిగిన సందర్భ మూ ఉంది. వారి ఇంటి గేట్లపై మూత్ర విసర్జన చే సి... వార్తల్లో నిలిచారు. ఇందుకు సంబంధించిన వీడియో సైతం గతంలో వైరల్ అయింది. ఇ ప్పుడు నర్సుతో రొమాన్స్ చేస్తున్న వీడియో తెరమీదకి రావడంతో ఆయన మరోసారి వార్తల్లోకి ఎక్కారు.

## జాతీయ నాయకుల విగ్రహాల తరలింపు తగదు

**సభాపతులకు ఖడ్గే లేఖ**

**న్యూఢిల్లీ:** మహాత్మాగాంధీ, బీఆర్ అంబేద్కర్ తదితర జాతీయ నాయకుల విగ్రహాలను పార్లమెంట్ కాంప్లెక్స్‌లోని కొత్త ప్రదేశానికి తరలించడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖడ్గే అభ్యంతరం వ్యక్తం చేశారు. జాతీయ నేతల విగ్రహాలను తిరిగి యథాస్థానంలో పెట్టాలన్నారు. ఈ మేరకు లోక్ సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్‌కు లేఖ రాశారు. ఎటువంటి సంప్రదింపులు లేకుండా జాతీయ నాయకుల విగ్రహాలను నిరంకుశంగా ప్రత్యేకంగా ఓ మూలకు మార్చారని... ఇది ప్రజాస్వామ్య ప్రాథమిక స్ఫూర్తిని ఉల్లంఘించడమేనని ఖడ్గే మండిపడ్డారు. 'ఎటువంటి సంప్రదింపులు లేకుండా ఏకపక్షంగా ఈ విగ్రహాలను తొలగించడం మన ప్రజాస్వామ్య ప్రాథమిక స్ఫూర్తిని ఉల్లంఘిస్తుందని నేను చాలా ప్రారంభ దశలోనే చెప్పాలనుకుంటున్నాను. మహాత్మా గాంధీ, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, ఇతర జాతీయ నాయకుల విగ్రహాలు తగిన చర్చలు, పరిశీలనల తర్వాత ప్రముఖ ప్రదేశాలలో ఉన్నాయని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లోని ప్రతి విగ్రహం, దాని స్థానం అపారమైన విలువ, ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయి' ఖడ్గే తన లేఖలో పేర్కొన్నారు. పార్లమెంటు హౌస్ కాంప్లెక్స్‌లో జాతీయ నాయకులు, ఎంపీల చిత్రపటాలు, విగ్రహాలను ఏర్పాటు చేయడానికి ప్రత్యేక కమిటీ ఉందని రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు కూడా అయిన ఖడ్గే ఎత్తి చూపారు. అందుకే మన జాతి ఐక్యత, సమగ్రత కోసం ఎంతగానో కషి చేసిన మహాత్మా గాంధీ, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, ఇతర జాతీయ నాయకుల విగ్రహాలను తగిన గౌరవం తో వాటి అసలు స్థానాలకు మార్చాలని కోరుతున్నట్లు తెలిపారు.

## నేడు కశ్మీర్‌లో ప్రధాని మోదీ యోగా



**కశ్మీరు:** జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. జమ్మూకశ్మీర్‌లో నిర్వహించనున్న కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొననున్నారు. దాల్ సరస్సు ఒడ్డున మోదీ యోగా చేయనుండగా... ఆ కార్యక్రమంలో దాదాపు ఏడు వేల మంది పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిని పర్యవేక్షించిన జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా... యోగా డే సందర్భంగా మోదీ కశ్మీర్ లోయకు రావడంపై హర్షం వ్యక్తం చేశారు. 'కశ్మీర్ ప్రజలతో మోదీకి మంచి అనుబంధం ఉంది. అందుకే ఆయన ఇక్కడికి రావాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. మోదీ రాక మాకెంతో గర్వకారణం. ఆ రోజు జరగబోయే కార్యక్రమంలో ఆయనతో పాటు 7 వేల మందికి పైగా పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నాం''అని మనోజ్ సిన్హా పేర్కొన్నారు. 'గత పదేళ్లలో జాతీయ, అంతర్జాతీయ వేదికలపై యోగా ఎంతో గుర్తింపు పొందింది. ఇప్పటి వరకు జరిగిన కార్యక్రమాల్లో 23.5 కోట్ల మందికి పైగా పాల్గొన్నారు. ఏటా యోగా చేసే వారి సంఖ్య పెరగడం హర్షణీయం. ఒత్తిడి లేని ప్రశాంతమైన జీవితం కోసం ప్రజలు ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నారు' అని ఎల్‌జీ వెల్లడించారు. కాగా... జమ్మూకశ్మీర్‌లో ఇటీవల వరుస ఉగ్ర ఘటనలు చోటు చేసుకోవడం ఆందోళనకు గురిస్తోందని, దీంతో ఈ నెల 29న ప్రారంభం కానున్న అమర్‌నాథ్ యాత్ర కోసం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని సిన్హా పేర్కొన్నారు.